
www.andhrajyothy.com viziayanagaram
# ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
16 విజయనగరం
బుధవారం 30 ఆగస్టు 2017



# వరద విలాపం

మధ్య పేజీల్లో

- ముంపులోనే పంట పొలాలు
- వందలాది ఎకరాల్లో నష్టం
- ఉధృతంగా ప్రవహిస్తున్న చంపావతి, సువర్ణముఖి నదులు



జియ్యమ్మవలస మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న జగన్నాథసాగరం

# ఆనందం అధనం



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందా? ఆర్థిక సమస్యలతో ఇల్లు పూర్తి చేయలేక అవస్థలు పడుతున్నారా? అయితే మీకో శుభవార్త. ఇలాంటి ఇళ్లు పూర్తి చేసేందుకు... ఆర్థికంగా సాయమందించడానికి ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఒక్కో ఇంటికి రూ.25 వేలు చొప్పున మంజూరు చేసేందుకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయంతో జిల్లావ్యాప్తంగా 22,232 మందికి ప్రయోజనం చేకూరనుంది.




మధ్యలో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇళ్లు

- ఇందిరమ్మ లబ్ధిదారులకు అదనపు సాయం
- ఒక్కో ఇంటికి రూ.25 వేలు మంజూరు
- జిల్లాలో 22,232 మందికి లబ్ధి
- వ్యక్తిగత ఖాతాలకు నిధుల జమ

(కలెక్టరేట్)

అందరికీ పక్కా ఇళ్లు ఉండాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఎన్‌టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం, అర్బన్ హౌసింగ్ స్కీమ్ ఇళ్లు మంజూరు చేసింది. ప్రస్తుతం వీటి నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఈ పథకాలకు దూరంగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు కూడా న్యాయం చేయాలన్న ఆలోచనతో నిలిచిపోయిన ఇళ్లకు ప్రభుత్వం తాజాగా సాయం అందజేయనుంది. గతంలోనే ఈ ప్రకటన చేసింది. ఇప్పుడు నిధుల మంజూరుకు ముందుకొచ్చింది. 2006 నుంచి 2014 వరకూ గత ప్రభుత్వం మూడు విడతలుగా ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు మంజూరు చేసింది. అప్పట్లో కాస్త ఆర్థికంగా ఉన్న వారు నిర్మాణం పూర్తి చేసుకున్నారు. మిగిలిన వారు ప్రభుత్వం ఇచ్చిన నిధులు సరిపోక మధ్యలో- మిగతా 14లో




# తేల్చుకోండ్హీ

- మండల స్థాయిలోనే పరిష్కరించుకోండి
- జెంటిల్‌మెన్ ఒప్పందాలపై కొత్తమెలిక
- చేతులెత్తేసిన టీడీపీ జిల్లా నేతలు
- అయోమయంలో కేడర్

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)

మండల అధ్యక్ష ఎన్నికల సమయంలో కొన్ని మండలాల్లో చేసుకున్న జెంటిల్‌మెన్ ఒప్పందాల పీటముడి వీడకపోగా మరింతగా బిగుసుకుంటోంది. ఈ సమస్యపై ఇన్నాళ్లూ నాన్చిన టీడీపీ జిల్లా నేతలు చివరకు చేతులెత్తేశారు. మండలాల్లోనే తేల్చుకోవాలని వారిపైకే నెట్టేశారు. ఇటీవల సమన్వయ కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. తాజా పరిణామంతో తమ్ముళ్లు అయోమయంలో పడ్డారు. మండల స్థాయిలో పరిష్కారం కాకే ఒప్పందంలోని రెండో వర్గం పార్టీ జిల్లా నాయకులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. జామి, ఎస్.కోట మండలాలతో పాటు - మిగతా 14లో



సాలూరు కోటవీధి కాలువలో గంజాయి ప్యాకెట్లు

# మురుగులో గంజాయి గుట్ట

- కాలువలో గంజాయి
- గుర్తించిన స్థానికులు
- వందకిలోలు ఉంటుందని అంచనా
- సాలూరు కోటవీధిలో ఘటన

(సాలూరు)

పోలీసు తనిఖీలకు భయపడి మురుగు కాలువలో గంజాయి ప్యాకెట్లను పడేసి పరారైన ఘటన సాలూరులో మంగళవారం ఉదయం కలకలం సృష్టించింది. పట్టణంలోని కోట వీధి మురుగు కాలువలో సుమారు రూ.5లక్షల విలువ చేసే వంద కిలోల గంజాయిని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం ఉదయం పడేశారు. ప్యాకెట్లుగా ఉన్న వాటిని గుర్తించిన స్థానికులు చించి గంజాయిగా అనుమానించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టణ ఏఎస్ఐ శ్రీనివాసరావు కాలువలో ఉన్న 26 ప్యాకెట్లను పరిశీలించారు. గంజాయి అని నిర్ధారణకు వచ్చాక సిబ్బంది సహకారంతో బయటకు తీయించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీలకు భయపడే - మిగతా 14లో




7లో

చీపురుపల్లి స్టేషన్‌లో ఆగిన సూపర్‌ఫాస్ట్

# అక్కడ టిక్కెట్.. ఇక్కడ హాల్ట్

- రిజర్వేషన్ లేని స్టేషన్ నుంచి టికెట్ల జారీ
- ప్రయాణికుల ఆందోళన



సీపీఎస్ రద్దుపై ఉద్యమించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు (ఫైల్)

# యుద్ధం.. శరణం!

● విజయవాడలో రేపు ఉద్యోగుల మిలీనియం మార్చ్ ● సీపీఎస్ రద్దుకు ఉపాధ్యాయ సంఘాల మద్దతు

(సాలూరు రూరల్)

సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) రద్దు కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబరు ఒకటిన విజయవాడలో మిలినీయం మార్చ్ నిర్వహించనున్నారు. సీపీఎస్ వర్తింస్తున్న ఉద్యోగుల్లో ఆ విధానంపై అసంతృప్తి నెలకొంది. రాష్ట్రంలో ఇలాంటి ఉద్యోగులు 1.82 లక్షల మంది ఉన్నారు. జిల్లాలో 7,802 మంది ఉన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు తమ ఉద్యోగ విరమణ అనంతరం జీవిత భద్రత కరువైందనే భయాందోళనలో ఉన్నారు. సీపీఎస్ అమల్లోకి వచ్చిన 12 ఏళ్ల అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఉద్యమ బాట పట్టాయి. రానున్న 25 ఏళ్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ల భారం నుంచి తప్పించుకోవడానికి సీపీఎస్ విధానాన్ని అమల్లోకి తెచ్చాయి.

రానున్న 25 ఏళ్ల తరువాత శాశ్వత పింఛనుదారులు ఉండకపోవడంతో ఈ విధానం ప్రభుత్వాలకు ప్రయోజనం చేకూరుతుంది. పాత పింఛనుదారులు అందించే పింఛను మొత్తాలు ఆదా కావడంతో ప్రభుత్వాలకు ఆర్థిక భారం తప్పుతుంది. అయితే సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మాత్రం సామాజిక భద్రత కరువుతుందని ఆయా వర్గాలు వాపోతున్నాయి. సీపీఎస్ ఉద్యోగులు తమ పదవీ విరమణ తరువాత అందుకోబోయే మొత్తాలు అప్పటి షేరు మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. ఈ విధానం వల్ల ఉద్యోగ విరమణ తరువాత ప్రైవేట్ ఉద్యోగికి, ప్రభుత్వ ఉద్యోగికి భేదం లేకుండా పోతుందని ఉద్యోగులు వాపోతున్నారు. పాత పెన్షన్ విధానాన్ని కోరుతున్నారు. ఈ ప్రస్తుతం మారిన రాజకీయ, ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సీపీఎస్ రద్దుకు వివిధ సంఘాలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నాయి. ఈ పోరాటంలో ఉపాధ్యాయ సంఘాలు ఒక అడుగు ముందున్నాయి. జాక్టో, ప్యాప్టో ( ఉపాధ్యాయ సంయుక్త సంఘాలు) ఉద్యమాలు చేశాయి. ఈ విధానం రద్దుకు రాజకీయ మద్దతు లభిస్తోంది. మిలినీయం మార్చ్ చేసి సీపీఎస్ రద్దు చేయించడానికి ఏపీసీపీఎస్ఈఏ కృతనిశ్చయంతో ఉంది. ఈ మేరకు వేసవిలో జరిగిన ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాల్లో ప్రచారం నిర్వహించడంతో పాటు నిధులను సైతం సేకరించారు. ఇటీవల వివిధ స్థాయిల్లో మిలినీయం మార్చ్ ప్రేరణకు ఉద్యమాలు చేశారు. ఈ మార్చ్‌కు అన్ని ఉపాధ్యాయ సంఘాలు మద్దతునిచ్చాయి. జిల్లా నుంచి రెండు వేల మంది మార్చ్‌కు తరలివెళ్లడానికి బస్సు, రైళ్లకు రిజర్వేషన్లు చేయించుకున్నారు.

మిలీనియం మార్చ్‌కు ఉద్యోగులు తలపెట్టిన నేపథ్యంలో సీపీఎస్ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు గ్రాట్యుటీ మంజూరు చేశారు. దీనితో సరిపెట్టుకోకుండా సీపీఎస్ రద్దు లక్ష్యంగా ఉద్యమం తీవ్రం చేయడానికి మిలినీయం మార్చ్‌ను విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాటు చేశారు.

## ఇదీవిధానం

సీపీఎస్ విధానాన్ని నిర్వహించడానికి నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్)ను సెంట్రల్ రికార్డ్ కీపింగ్ ఏజెన్సీ ( సీఆర్‌ఏ)గా నియమించారు. ఈ విధానంలో ప్రతి ఉద్యోగి తన పే, డీఏ నుంచి పది శాతం వారి ప్రాన్ (పర్మినెంట్ రిటైర్‌మెంట్ అక్కౌంట్ నెంబర్)కు జమ చేస్తారు. అంతే మొత్తాన్ని ప్రభుత్వం ఉద్యోగి ప్రాన్‌కు జమ చేస్తుంది. ఇలా జమైన మొత్తంలో 58 శాతం ఎస్‌బీఐ, 40 శాతం యూటీఐ ఆధ్వర్యంలో వేర్వేరు కంపెనీల్లో పెట్టుబడి పెడుతుంది. ఈ మొత్తం నిధుల్లోంచి 26 శాతం నిధులను విదేశీ ఇన్వెస్టర్లకు సైతం అందుబాటులో ఉంచుతారు. ఇందుకోసం అయ్యే ఖర్చులను ప్రభుత్వమే బరిస్తుంది. దీని వల్ల కేంద్రరాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతోంది.

## ఇలా అమల్లోకి..

ఈ విధానం కేంద్ర ప్రభుత్వ హయాంలో 2004లో ఆమోదం పొందింది. అప్పటి యూపీఏ ప్రభుత్వానికి వామపక్షాలు సైతం పూర్తి మద్దతుగా నిలవడం విశేషం. కేంద్రప్రభుత్వం 2004లో అమలు చేసిన ఈ విధానాన్ని అప్పట్లో వామపక్షాలు ఆదిలోనే వ్యతిరేకించి ఉంటే బాగుండేదని ఉద్యోగవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తొలుత ఈ విధానాన్ని కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరినవారికి వర్తింపచేశారు. అలాగే రాష్ట్రంలో సెప్టెంబరు 2004 నుంచి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. ఈ విధానంలో ఉద్యోగి ఉద్యోగ విరమణ తరువాత కుటుంబ పింఛను పథకం వర్తించదు. పాత పింఛను విధానంలో ఉద్యోగి పదవీ విరమణ నెలలో తీసుకున్న పేలో సగం జీతాన్ని నిబంధనలకు అనుగుణంగా పింఛనుగా అందించేవారు. సీపీఎస్ విధానం దీనికి భిన్నమైనది. ఈ పథకం ఏపీతో సహా 18 రాష్ట్రాలు అమలు చేస్తున్నాయి.

## రద్దు చేయాల్సిందే



సీపీఎస్ దుర్మార్గమైన విధానం. ఉద్యోగికి సామాజిక భద్రత ఉండదు. పదవీ విరమణ అనంతరం హాయిగా జీవనం గడపలేని పరిస్థితి. ఈ విధానం రద్దు చేయాలి. సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ మంజూరు చేయడం ఆనందమే.

**- కలిపిండి సంగమేశ్వరరావు, జేఏసీ, సాలూరు చైర్మన్**

## తక్షణం స్పందించాలి



సీపీఎస్ విధానం రద్దుకు ప్రభుత్వం తక్షణం స్పందించాలి. ఈ విధానం కొనసాగించడం దారుణం. దీనికి చరమగీతం పాడి ప్రభుత్వం ఉద్యోగుల మన్ననలు పొందాలి.

**- ఇండుపూరి గున్నరాజు, పీఆర్‌టీయూ రాష్ట్ర కౌన్సిలర్, జేఏసీ కో చైర్మన్, సాలూరు**

ఉద్యోగపర్వం


మిలీనియం మార్చ్‌ను విజయవంతం చేయాలని ప్రచారం



# మీ చేతిలో... మీ సేవ

● అందుబాటులోకి వచ్చిన యాప్ ● 150 రకాల సేవలకు వీలు

(కొత్తవలస)

మీ చేతిలో మీ సేవ కొత్తగా అందుబాటులోకి వచ్చిన అప్లికేషన్. దీని ద్వారా 150రకాల సేవలను పొందొచ్చు. ముఖ్యంగా ఏటా విద్యా సంవత్సరం ఆరంభంలో వివిధ ధ్రువీకరణపత్రాల కోసం విద్యార్థులు అవస్థలు పడుతుంటారు. ఇలాంటి ఇబ్బందులను అధిగమించడం కోసం రెవెన్యూ, ఇతర సేవలను సులభంగా పొందేందుకు యాప్ ఉపయోగపడుతుంది.ప్రస్తుతానికిఆరు ఐకాన్లుమాత్రమే అందుబాటులో ఉన్నాయి. బిల్లు పేమెంట్, సర్వీసులు, మొబైల్, డీటీహెచ్, రీచార్జ్ పోస్టుపెయిడ్, ల్యాండ్‌లైన్ బిల్లుల చెల్లింపు, నగదు బదిలీ, ట్రాఫిక్ చలానా చెల్లింపు, ఇతర బిల్లులు ప్రభుత్వ సమాచారం, ట్రావెల్స్ టికెట్ బుకింగ్, సినిమా టికెట్ బుకింగ్ ఉంటాయి.

### రెవెన్యూ సర్వీసులకు సంబంధించి

రెవెన్యూశాఖలకు సంబంధించిన సమాచారం, ధ్రువీకరణ పత్రాలు అవసరమైతే యాప్ ద్వారానే దరఖాస్తు చేసి పొందొచ్చు. సర్వీసు ఐకాన్‌పై క్లిక్ చేస్తే కేటగిరి-ఏ కింద రెవెన్యూ రికార్డులకు సంబంధించిన సమాచారం లభిస్తుంది. ఇందులో ఆర్ ఓ ఆర్, 1-బీ, అడంగళ్ పహాణీ, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్, కొత్త ఓటరు, జనన, మరణ ధ్రువీకరణపత్రాల జారీ ఉంటాయి. కేటగిరి-బీలో ప్రభుత్వ సేవల గురించి ఉంటుంది. ఇన్సెంటివ్ మంజూరు, ఆదాయ, ఇంటిగ్రేటేడ్ సర్టిఫికెట్, ఈబీసీ, ఓబీసీ సర్టిఫికెట్, కరెక్షన్ ఇన్ డెత్ అండ్ బర్త్, సర్టిఫికెట్, రేషన్ కార్డు సరెండర్, రేషన్ కార్డు ట్రాన్స్‌ఫర్, లేట్ రిజిస్ట్రేషన్ ఆఫ్ బర్త్, డెత్, వ్యవసాయ ఆదాయానికి సంబంధించిన సమాచారం ఉంటుంది. దేవాదాయశాఖసేవలకింద రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల బుకింగ్ సేవలు అందుబాటులో ఉంటాయి.

### పాఠశాలలు, కళాశాలల సమాచారం

ఈ యాప్‌లో సమాచార సేవల కింద అత్యసర ఫోన్ నంబర్లు, రాష్ట్రం గురించి, ఆర్టీసీ డిపోలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల వివరాలు, పోలీసుస్టేషన్లు, ప్రభుత్వ వైద్యశాలలు, ప్రభుత్వ పథకాలు, బ్లడ్‌బ్యాంకల వివరాలుంటాయి. దేశంలో విద్యార్థి స్కాలర్ షిప్ పథకాలు, మీ సేవ దరఖాస్తు స్థితి, వాతావరణం, తదితర సమాచారం ఉంటుంది. బిల్లుల చెల్లింపులు సేవల కింద విద్యుత్, ఆధార్‌కార్డు సేవలు, గ్యాస్, బీమా, నీటి బిల్లులు చెల్లించుకోవచ్చును. వీటితో పాటు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తున్నాయి.

### ఇలా ఇన్‌స్టాల్ చేసుకోవాలి

వివిధ రకాల సేవలను పొందాలంటే ముందుగా యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. స్మార్టు ఫోన్‌ను తీసుకుని ప్లేస్టోర్ ఒపెన్ చేయాలి. మీసేవ యాప్ అని టైప్ చేస్తే మీ సేవా ఐకాన్ కనిపిస్తుంది. ఐకాన్‌పై డబుల్ క్లిక్‌చేస్తే యాప్ ఇన్ స్టాల్ అవుతుంది. తర్వాత యాప్‌ను ఒపెన్‌చేసి పేరు, ఫోన్ నెంబరు, చిరునామా నమోదు చేసుకోవాలి. అనంతరం ఫోన్‌కు నాలుగు అంకెల పాస్‌వర్డు ఇస్తే రిజిస్ట్రేషన్ పూర్తి అవుతుంది. తర్వాత ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయిన యాప్ ఐకాన్‌ను ఒపెన్ చేసి ఫోన్ నంబరు నమోదు చేసి సబ్ మిట్ కొడితే పని చేయడం మొదలవుతుంది. సర్వీసులకు సంబంధించిన ఫీజులను నెట్ బ్యాంకింగ్, క్రెడిట్, డెబిట్, కార్డుల ద్వారా చెల్లించుకోవచ్చు.

# బోదండం... జిహ్వాకు వరం!

**కురుపాం రూరల్:** దట్టమైన అటవీ ప్రాంతంలో మాత్రమే లభ్యమయ్యే బోదండం కూర అంటే.. గిరిజనానికి ఎంతో ప్రీతి. ఈ కూర ఒక్కసారైనా రుచి చూడాలని దీనిగురించి తెలిసిన వారు అనుకుంటారు. కేవలం కొండ ప్రాంతాల్లో మాత్రమే లభ్యమయ్యే బోదండం కూర గురించి మైదాన ప్రాంతీయుల్లో చాలా మందికి తెలియదనే చెప్పాలి. ఏజెన్సీ ప్రాంతంలోని వారు కొండ పోడుల్లో వెదికి మరీ బోదండం కూరను సేకరిస్తారు. పెసరపప్పు, కంది పప్పులో బోదండం ఆకు కూరను వేసి వండుతారు. వేపుడు కూడా చేసుకోవచ్చు.



అత్యధిక పోషక విలువలు కలిగిన బోదండం కూరను దాచుకుని మరీ తింటారు. మార్కెట్లో దొరికే తోటకూర, గోంగూర, బచ్చలికూర కంటే ఎన్నో రెట్లు రుచికంగా ఉండి పోషక విలువలున్న బోదండం కూర ఆరోగ్యానికి మంచిదంటూ న్యూట్రిషన్లు సైతం చెబుతున్నారు. ఇది మిగిలిన ఆకు కూరలు వలే కాకుండా చెట్టుగా ఉంటుంది. లేత చిగురు ఆకులను సేకరించి వివిధ రకాల వంటలలో కలిపి వండుతారు. మాంసం కూరలలో బోదండం ఆకు కూరను కలిపి వండితే ఎంతో రుచిగా ఉంటుందని గిరిజనులు తెలిపారు. ఇటీవల కొన్ని సంవత్సరాలుగా బోదండం కూర జాడ కన్పించడం లేదు. అడవులు నరికివేతకు గురికావడం, కొండ పోడుల్లో సాగు విస్తీర్ణం పెరగడం వంటి కారణాల వల్ల బోదండం చెట్లు నరికివేతకు గురయ్యాయి. ఇప్పుడు అక్కడక్కడ మాత్రమే ఈ చెట్లు కనిపిస్తున్నాయి. అడ్డాకుల మాదిరిగా ఉండే బోదండం చెట్ల శివారును ఉన్న లేలేత ఆకులను మాత్రమే కూరగా వినియోగిస్తారు. ప్రస్తుతం తిత్తిరి పంచాయతీ పరిధిలోగల చీకటి కొండల్లో మాత్రమే ఈ కూర లభించే బోదండం చెట్లు కనిపిస్తున్నాయి.

## నొప్పులు తాళలేక యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన అప్పలరాజు

**కొత్తవలస/రూరల్ :** మండలంలోని గొల్లలపాలెంకు చెందిన ఉరిటి అప్పలరాజు (24) అనే యువకుడు ఒళ్లు, కడుపునొప్పి భరించలేక మంగళవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్టేషన్ హెచ్‌సీ రెహమాన్ తెలిపారు. బంధువులు, కొత్త వలస పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్టీసీ కళాసీగా పనిచేస్తున్న అప్పలరాజు గత రెండువారాలుగా అనా రోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో ఇంటివద్దనే చికిత్స పొందుతూ మందులు వాడుతున్నప్పటికీ తీవ్రమైన ఒళ్లు నొప్పులతో బాధపడేవాడని బంధువులు తెలియజే శారు. తండ్రి అప్పారావు, అన్నయ్య చంద్రశేఖర్ ఉదయం పొలం పనికి వెళ్లడంతో ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో నొప్పులను తాళలేక వంట గదిలోని శ్లాబ్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అన్నయ్య ఉరిటి చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ఆసుపత్రికి తరలించారు.

## రైలు ఢీకొని రైల్వే ఉద్యోగి మృతి



మృతి చెందిన రెడ్డి కృష్ణ (ఫైల్)

**పార్వతీపురం టౌన్ :** గుర్తు తెలియని రైలు ఢీకొన్న సంఘటనలో రైల్వే ఉద్యోగి మృతి చెందారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పార్వతీపురం పట్టణంలోని కొత్తవలసకు చెందిన రైల్వేశాఖలో ఉద్యోగం నిర్వహిస్తున్న రెడ్డి కృష్ణ (45) మంగళవారం ఉదయం ఉద్యోగ నిర్వహణకు వెళ్లారు. విశాఖపట్నం నుంచి రాయగడ వైపు వెళుతున్న రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పశువుల పాక కూలి గేదె మృతి

**కొత్తవలస రూరల్:** రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని కాటకాపల్లి గ్రామంలోని కళ్ళెంపూడి అర్జునకు చెందిన పశువుల పాక నేలకూలి పాడి గేదె మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. ఘటనపై వీఆర్వో మునిషా ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేశారు. న్యాయం చేయాలని బాధితులు అధికారులను వేడుకుంటున్నారు.

## రూ.4500 విలువగల గుట్కాలు స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న గుట్కాలు

**ముంజేరు(భోగాపురం):** మండలం ముంజేరు గ్రామంలో గ్రామానికి చెందిన వ్యక్తి నుంచి రూ.4500 విలువగల గుట్కాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తారకేశ్వరరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో గుట్కాలు అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సోమవారం రాత్రి ఎస్‌ఐ మహేష్, సిబ్బందితో కలిసి దాడిచేసి గుట్కాలు స్వాధీనం చేసుకొని ఒకరిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఎక్కడైనా గుట్కా లు, ఖైనీలు అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐలు తాకరేశ్వరరావు, మహేష్‌లు హెచ్చరించారు.

## ప్రజల ప్రాణాలతో ఆటలా..?

### ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాదరావు

**కొత్తవలస:** ఎటువంటి శాస్త్రీయమైన చదువులేని, తెలిసీ తెలియని వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో ఆటలాడుకోవడం సరికాదని రాష్ట్ర యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి జేవీ ప్రసాదరావు అన్నారు. మంగళవారం ఆయన కొత్తవలసలో విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఎంపీ, ఆర్‌ఎంపీలు సర్టిఫికెట్‌లు ఇచ్చి ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేసుకోవాలని చూస్తోందని ఇది సరైంది కాదన్నారు. ఇప్పటికే కార్పొరేట్ ఆసుపత్రులు ఉన్నదానికి లేనిదానికి ఆపరేషన్లు అంటూ ప్రజలను పీడిస్తున్నారని ఆరోపించారు. తాజాగా ప్రభుత్వం ఆర్‌ఎంపీలు, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి గ్రామాలలో విడిచిపెడితే మరింత దోచుకు తింటారని ఆరోపించారు. గ్రామాలలో ఇప్పటికే ఎటువంటి శిక్షణ లేని చేతి సంచి వైద్యులు ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారని, ప్రభుత్వం వారికి లైసెన్సులని, సర్టిఫికెట్‌లు ఇచ్చి ప్రోత్సహించడం తగదన్నారు. అతి చిన్న దేశమైన క్యూబాలో ప్రతి 1000 జనాభాకు ఒక పట్టభద్రుడైన వైద్యుడున్నారని, మనదేశంలో మాత్రం 50 వేల మంది జనాభాకు కుడా ఒక వైద్యుడు లేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం అర్హులైన వైద్యులను నియమించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు.

# ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

- తప్పిన పెను ప్రమాదం
- ఊపిరి పీల్చుకున్న స్థానికులు



అదుపుతప్పి ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ

**విజయనగరం క్రైం :** పట్టణంలోని కేఎల్‌పురం వద్ద మంగళవారం తెల్లవారుజామున అదుపుతప్పి లారీ రోడ్డు పక్కన ఉన్న ఇంటిలోకి దూసుకెళ్లింది. ఆ ఇంటిని యజమానులు చిన్న గొడౌన్‌గా ఉపయోగించుకోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. దీంతో పెనుప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే.. కలెక్టరు కార్యాలయం నుంచి గజపతి నగరం సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న ఏపీ30వి 8559 లారీ కలెక్టరేట్ కార్యాలయం దాటిన వెంటనే కేల్‌పు రంమలుపువద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న రెండు విద్యుత్ స్తంభాలను గుద్దుకుని ఇంటి గోడను ఢీకొట్టింది. అయితే ఆ సమయంలో రహదారి ఆక్రమణ పనులు జరుగుతుండడంతో విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. లేకుంటే ఘోర ప్రమాదం సంభవించేది. లారీ ఇంటిగోడను ఢీకొన్న శబ్దానికి ఇంటిపక్కనే నివాసం ఉంటున్న యజమానితో పాటు స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే ట్రాఫిక్ పోలీసులకు సమాచారమందించగా ఎస్‌ఐ సాగర్‌బాబు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. లారీ డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## విద్యుదాఘాతంతో వృద్ధునికి తీవ్రగాయాలు

- క్వారీల కోసం గ్రామస్థులను ఇబ్బందులు పెడుతున్నారని ఆగ్రహం



విద్యుత్‌ఘాతానికి గురైన సన్యాసి

**శృంగవరపుకోట రూరల్ :** మండలంలోని తలారి పంచాయతీ చుక్కవానిపాలెం గ్రామ సమీపంలో తెగిపడిన 11కెవి విద్యుత్‌లైన్ వైర్లును తాకి లగుడు సన్యాసి(75)తీవ్రంగా గాయపడ్డాడు. ఈవిషయంపై గ్రామ న్యాయవాది దుర్గాప్రసాద్, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా వున్నాయి. చుక్కవానిపాలెం గ్రామానికి చెందిన వృద్ధుడు సన్యాసి ప్రతిరోజు ఉదయం, సాయంత్రం టీ తాగేందుకు గ్రామానికి కిలోమీటరు దూరంలో వున్న సంతగైరమ్మపేటకు వెళ్తుంటాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం టీ తాగేందుకు వెళ్తుండగా విద్యుత్‌వైరు తెగిపడివుందని దీనిని తాకడంతో ఒక్కసారిగా నేలపై కుప్పకూలి పోవడంతో తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని 108 సిబ్బంది ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. పరిస్థితి విషమించడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు.

### ● గ్రామాన్ని అతలాకుతలం చేస్తున్నారు

నిబంధనలకు విరుద్ధంగా క్వారీలకు తమ గ్రామం మధ్యలోనుంచి, పొలాల మధ్యలోనుంచి విద్యుత్‌లైన్ వేశారని అప్పట్లో తాము వ్యతిరేకించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గతంలో ఈ విద్యుత్ వైర్లు తగిలి చిరంజీవి అనే విద్యార్థికి తీవ్రగాయాలవ్వగా, పశువులు మరణించాయన్నారు. విద్యుత్‌శాఖ, క్వారీ యాజమాన్యం నిర్లక్ష్యానికి ప్రజలు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని గ్రామస్థులు ఎన్.కృష్ణంరాజు, బి.శ్రీను, వి.అప్పలనాయుడు, వేణుగోపాల్, రాంబాబు తదితరులు తెలిపారు.



తెగిపడిన విద్యుత్‌తీగను చూపిస్తున్న చుక్కవానిపాలెం గ్రామస్థులు

## కార్మికుల సమస్యలపై స్పందించండి

- వేద యాజమాన్యానికి జడ్పీటీసీ ప్రసాదరావు డిమాండ్



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**పూసపాటిరేగ:** ఈనెల 31లోగా వేద పరిశ్రమ యాజమాన్యం తమ అభిప్రాయాన్ని తెలియజేయాలని స్థానిక జడ్పీటీసీ సభ్యులు ఆకిరి ప్రసాదరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేద పరిశ్రమ యాజమాన్యం కార్మికుల సమస్యలపై స్పందించి అభిప్రాయం తెలియజేయాలన్నారు. కార్మికులు సంయమనంతో ఉన్నారని, 31లోగా యాజమాన్యం స్పందించకుంటే కార్మికులకు అండగా టీడీపీ పోరాటం చేస్తోందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దంగా భూలోక, మైలపల్లి సింహాచలం, పిన్నింటి సన్యాసినాయుడు, పిన్నింటి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## ఇంట్లో చోరీ

- వెంటిలేటర్ ద్వారా దొంగల ప్రవేశం
- మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరణ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న క్లూస్‌టీం

**విజయనగరం క్రైం :** పట్టణంలోని బొబ్బాదిపేటలో సోమవారం అర్ధరాత్రి వెంటిలేటర్ ద్వారా ఇంటిలోకి ప్రవేశించి దొంగతనం జరిగినట్లు వన్‌టౌన్ అవుట్‌పోస్టు ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే బొబ్బాదిపేటలో ఎం.రాజేష్ కుటుంబంతో నివాసం ఉంటు న్నాడు. రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి ఎవరి బెడ్‌రూంలో వారు నిద్రించారు. దొంగలు అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము సమయంలో వెంటిలేటర్ ద్వారా హాల్‌లో ప్రవేశించి హాల్‌లో ఉన్న బీరువాను తెరిచి లోపల ఉన్న మూడు తులాల బంగారు ఆభరణాలు అపహరించి పరారయ్యారు. ఉదయం 6 గంటలకు నిద్ర లేచి హాల్‌లోకి వచ్చి చూడగా బీరువాలోని బట్టలు పడి ఉండడం చూసి షాక్‌కు గురయ్యారు. బీరువా లోపల చూడగా బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు తెలుసుకుని వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ లక్ష్మణరావు, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి పరిశీలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## ఘనంగా లక్ష పత్రి పూజ

**పార్వతీపురం టౌన్:** స్థానిక సూర్యపీఠంలో గణేష మహోత్సవాల్లో భాగంగా పీఠాధిపతి బ్రహ్మశ్రీ వేమకోటి నరహరిశాస్త్రి వేద మంత్రాల మధ్య మంగళవారం విద్యా గణపతికి లక్ష పత్రి పూజలు నిర్వహించారు. గణపతి మంటపంలో 1116 రుద్రాక్షలతో సహస్ర లింగార్చన, వివిధ పత్రాలు, పుష్పాలతో అధినాయకునికి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వి.వివేకానంద శర్మ, వి.తేజ, ఆదిత్య, రామకృష్ణ వైదిక సహకారాన్ని అందించారు.



విద్యా గణపతికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

# ముంపు ముప్పు తప్పేదెప్పుడు?

- శత్రుచర్ల రియల్ ఎస్టేట్, బీఎస్ఎంనగర్ కాలనీ వాసుల గోడు
- పట్టించుకోని పాలకులపై ప్రజల ఆగ్రహం

**పార్వతీపురం టౌన్:** ప్రతి ఏటా పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో నివాసితులకు కష్టాలు తప్పడం లేదు. 21వ వార్డులో ఆర్టీసీ కాంప్లెక్స్ వెనుక ఉన్న శత్రు చర్ల రియల్ ఎస్టేట్ కాలనీ, 19వ వార్డులోని బీ ఎస్ఎం నగర్‌తో జనశక్తి, ఎస్ఎన్‌పీ, గూడ్స్ షెడ్ రోడ్డు, రామాపురం కాలనీలోని కొన్ని వీధులు వరద నీటిలో చిక్కుకుంటున్నాయి. శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీకి వెళ్లే రహదారిపై వర్షపునీరు ప్రవహించడమే కాకుండా నివాసాల మధ్య వరదనీరు ఉండి పోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడు తున్నారు. సౌందర్య థియేటర్ కూడలి నుంచి బాలాజీనగర్ వరకు ప్రధాన కాలువపై కొంతమంది వాణిజ్య సముదాయాలను నిర్మించడంతో వర్షాకాలంలో వరద నీరు వెళ్లేందుకు వీలులేకుండా పోయింది. కాలువను ఆక్రమించుకుంటున్నా అధికారులు చోద్యం చూడటం పలు విమర్శలకు తావిస్తుంది. అలాగే 19వ వార్డులో వరహాల గెడ్డకు ఆనుకొని ఉన్న బీఎస్ఎం నగర్ భారీ వర్షాలకు ప్రతి ఏడాది రెండు, మూడు రోజులు నీటిలో ఉండాల్సిన పరిస్థితి తప్పడం లేదు. రోజు రోజుకు వరహాలగెడ్డ కుదుంచుకుపోవడం వరదనీరు బీఎస్ఎం నగర్‌లోకి చొచ్చుకువచ్చి రావడంతో నివాసితులు నరకం చూస్తు న్నారు. వరహా లగెడ్డకు ఆనుకొని నిర్మించిన రాజీవ్ గృహకల్ప నివాసి తులు వర్షం పడిందంటే భయంతో జీవనం సాగిస్తారు. గత రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు రాజీవ్ గృహకల్ప సముదా యంలోకి చొచ్చుకు పోయింది.

### పాలకులు ఏం చేస్తున్నారు...?

ప్రతి ఏటా వర్షాకాలంలో ముంపుకు గురవుతున్న కాలనీల్లో పాలకులు, అధికారులు పర్యటించి వరద నీటి మళ్లింపునకు చర్యలు చేపట్టకుండా చోద్యం చూస్తున్నారని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు. వరదలు వచ్చే సమయంలో ఇరిగేషన్ అధికారులతో పాటు రెవెన్యూ అధికారులు చూడటం, వెళ్లిపోవడం తప్ప ప్రణాళికలతో వరదనీటి సమస్యను పరిష్కరించడం లేదని లోతట్టు ప్రాంత కాలనీల వాసులు విమర్శలు గుప్పిస్తున్నారు. వరహాలగెడ్డపై ఉన్న ఆక్రమణలతో పాటు వెడల్పు చేయాలని పలువురు కోరుతున్నారు. ప్రజా ప్రతినిధులు దృష్టిపెట్టడం లేదని వాపోతున్నారు.

## ఉత్సాహంగా గణేష్ నిమజ్జనాలు

**పార్వతీపురం టౌన్:** పట్టణంలోని యుజవన సంఘాల సభ్యులు ఉత్సాహంతో సోమవారం రాత్రి గణేష్ నిమజ్జనాలు చేశారు. గూడ్స్‌షెడ్ వీధితో పాటు పట్టణంలోని కొన్ని వీధుల్లో యువత ఘనంగా వినాయక నిమజ్జనాలు చేశారు. సాయంత్రం ఉత్సవ మంటపాల నుంచి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు మేళతాళాలు, డీజే బాక్సుల సౌండ్ సిస్టమ్‌తో కుర్రకారు జోష్‌గా ముందుకు సాగారు. వెంకంపేట, గంగసాగరం, గోపసాగరాల్లో రాత్రి 12 గంటల సమయంలో నిమజ్జనం చేశారు.



నిమజ్జనం సందర్భంగా చిందులు వేస్తున్న కుర్రకారు

## ఆధ్యాత్మికమే జీవితానికి మోక్ష మార్గం

**పార్వతీపురం టౌన్:** ఆధ్యాత్మికమే మానవ జీవితానికి మోక్ష మార్గమని ఉత్తరాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాస నందా సరస్వతి అన్నారు. మంగళవారం పట్టణంలోని దుర్గ గుడివీధిలో హోమ సహస్ర చండీయాగంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా శ్రీసర్వమంగళాదేవి పీఠాధిపతి ము రపాక కాళిదాసుశర్మ, యజ్ఞకర్త మలిచేటి రాజీవ్‌రెడ్డి, రుత్వికులు శ్రీనివాసనందా సరస్వతికి స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక వేదికపై భక్తులను ద్దేశించి మాట్లాడారు. ఉత్తరాంధ్రలోనే హోమ సహస్ర చండీ యాగానికి నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఎవరైయితే హిందూ ధర్మ పరిరక్ష కు పూనుకుంటారో వారు పునీతులవుతారన్నారు. ఆధ్యాత్మిక, దైవ కార్యక్రమాలు చేయడం వల్ల సకాలం వర్షాలు కురిసి ప్రజలంతా సంతోషంగా జీవిస్తారన్నారు. శ్రీనివాస నందా సరస్వతికి దుశ్శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు.



ప్రసంగం చేస్తున్న శ్రీనివాసనందా సరస్వతి

## పులిగుమ్మిలో తాగునీటి ఇబ్బందులు

**పార్వతీపురం:** పార్వతీపురం మండలంలో వరద బీభత్సవం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పులిగుమ్మి వద్ద పైపులైన్లు సాకిగెడ్డ ప్రవాహానికి కొట్టుకుపోవడంతో తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదే విధంగా పుట్టూరు, పులిగుమ్మి, తాళ్లబురిడి, బందలుప్పి, తదితర గ్రామాల్లో వరి పంట ముంపునకు గురయ్యింది. సాకిగెడ్డ ప్రవాహంతో తాళ్లబురిడి, ములగ మధ్య రహదారి కొట్టుకు పోయింది. మండలంలోని కృష్ణపల్లి, పెదమరికి, ములగ, డీకే పట్నం, గోచెక్క ప్రాంతాల్లో వరద కారణంగా పంట ముంపునకు గురయ్యింది.



వరద ఉధృతికి కొట్టుకుపోయిన పైపులైన్లు

## గోతులు పూడ్చండి మహాప్రభో..!

**పార్వతీపురం టౌన్:** స్థానిక నవరత్న థియేటర్ కూడలిలో ఫ్లైఓవర్ వద్ద గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. బైపాస్ రహదారి నుంచి నవరత్న థియేటర్ కూడలి మీదుగా ఒడిశా, తదితర ప్రాంతాలకు భారీ వాహనాలు వెళ్తుంటాయి. ఫ్లైఓవర్ ప్రాంతంలో పెద్ద పెద్ద గోతుల కారణంగా రాత్రివేళల్లో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయం అధికారులకు మొరపెట్టుకుంటున్నా కనీసం స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో గోతుల్లో నీరు చేరిపోయి మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని స్థానికులు భయపడుతున్నారు.



ఫ్లైఓవర్ నిర్మాణం వద్ద ఏర్పడ్డ ప్రాణాంతక గోతులు

## మాతృ భాషను పరిరక్షించుకోండి

**పార్వతీపురం:** మాతృ భాషను పరిరక్షించుకొనేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ అన్నారు. మంగళవారం మాతృ భాష దినోత్సవం సందర్భంగా టీడీపీ కార్యాలయంలో గిడుగు రామ్మూర్తిపంతులు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి మాట్లాడుతూ తెలుగు భాషలోనే పాలన, అధికార వ్యవహారాలు సాగాలని వివరించారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వైస్ చైర్మన్ బెలగాం జయప్రకాష్‌నారాయణ, టీడీపీ నాయకులు కోలా వెంకటరావు, బార్నాల సీతారాం పాల్గొన్నారు.

నర్సిపురం, పెదబొండపల్లి, తదితర గ్రామాల్లో గల పాఠశాలల్లో మాతృ భాష దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బహుమతులను అందించారు.

## ఘనంగా నాగార్జున జన్మదిన వేడుకలు

**పార్వతీపురం టౌన్:** స్థానిక వేణుగోపాల్ థియేటర్ వద్ద సినీ నటుడు అక్కినేని నాగార్జున జన్మదిన వేడుకలను నాగార్జున ఫ్యాన్స్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు వల్లేపు చిన్నారావు, చందక దేశాలు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. గణేష్ యూత్ ఆధ్వర్యంలో విఘ్నేశ్వరుని ఉత్సవాల మంటపం వద్ద కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ సినీ ఫ్యాన్స్ సభ్యులు మజ్జి కృష్ణ, గొర్లి మాధవరావు, పైలా శ్రీనివాసరావు,అనిల్, సంచాన శంకరరావు, శుభలేఖ శ్రీను పాల్గొన్నారు.

## కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు

- ఆర్డీవో సుదర్శనదొర హెచ్చరిక

**పార్వతీపురం:** ఎస్సీ, ఎస్టీలను కులం పేరుతో దూషిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో బి.సుదర్శనదొర అన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మోనటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీపీ హరిప్రియ థాట్రాజ్, ఎంపీడీవో కె.కృష్ణారావు, తహసీల్దార్ రఫీ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో సుదర్శనదొర

### గ్యాస్ సమాచారం

పార్వతీపురం పెంటపాటి కామరాజు గ్యాస్ ఏజెన్సీ పరిధిలో మంగళవారం వరకు బుక్ చేసుకున్న కురుపాం మండలం, గరుగుబిల్లి మండలం, పార్వతీపురం మండలం గోపాలపురం, పట్టణ వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా అవుతుంది. ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేయ దలచిన వారు 9666023456 నెంర్‌కు ఆన్‌లైన్ బుకింగ్ చేసుకోవాలి. ఫిర్యాదులు, సలహాల కోసం గ్యాస్ ఏజెన్సీ ల్యాండ్‌లైన్ 08963-221425, 221345 నెంబర్లను సంప్రదించాలి.

### సినిమా గైడ్

వెంకటేశ్వర కళామందిర్-- పైసావసూల్
పద్మశ్రీ -------- జయ జానకీ నాయక
సౌందర్య ------ నేనే రాజు నేనే మంత్రి

## లోతట్టు ప్రాంతాల్లో చైర్‌పర్సన్ పర్యటన

**పార్వతీపురం టౌన్:** పట్టణంలో రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో కాలనీలు జలమయమయ్యాయి. మంగళవారం పట్టణంలోని శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ, బాలాజీ నగర్, జనశక్తి కాలనీ, ఎస్ఎన్‌పీ కాలనీల్లో చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వైస్‌చైర్మన్ బెలగాం జయప్రకాష్‌నారాయణ, పాలకవర్గ సభ్యులు పర్యటించారు. శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ వరదనీటి మళ్లింపునకు ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే సౌందర్య థియేటర్ రహదారిలో ఉన్న ప్రధాన కాలువలో వ్యర్థాలు, చెత్త తొలగించాలని ప్రజారోగ్యశాఖాధికారి ప్రసాద్‌ను కోరారు. వరహాలగెడ్డ వరద ఉధృతి కారణంగా ప్రతి ఏడాది ఇబ్బందులు పడుతున్నామని రాజీవ్ గృహకల్ప నివాసితులు చైర్‌పర్సన్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులతో మాట్లాడి వరహాలగెడ్డకు రక్షణగోడ నిర్మించడానికి చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలో ఎక్కడెక్కడ ముంపు ప్రాంతాలు ఉన్నాయో అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు కోలా వెంకటరావు, కౌన్సిలర్లు బార్నాల సీతారాం, మంచిపల్లి సత్యనారాయణ, రెడ్డి రవికుమార్ పాల్గొన్నారు.



పట్టణంలో కాలనీని పరిశీలిస్తున్న దృశ్యం

## 34 మద్యం సీసాల స్వాధీనం


స్వాధీనంలో మద్యం సీసాలు

**సీతానగరం:** అక్రమంగా తరలిస్తున్న 34 మద్యం సీసాలను వేర్వేరు చోట్ల పోలీసులకు పట్టుబడ్డాయి. బలిజిపేట మండలం కొత్త అజ్జాడకి చెందిన గుమ్మిడి ఎరుకులు 16 సీసాలను తరలిస్తుండగా సీతానగరం శివాలయం వద్ద ఏఎస్ఐ శారదకు పట్టుబడ్డాయి. అలాగే బూర్జిలో అల్లు నాగేశ్వరరావు వద్ద మరో 18 సీసాలను హెచ్‌సీ నాగేశ్వరరావు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసులు నమోదుచేసినట్టు పోలీసులు తెలిపారు.

# వారపు సంతలో సౌకర్యాలు కల్పించండి

### ● మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

**పార్వతీపురం టౌన్:** పట్టణంలోని ఎఎంసీ ఆవరణలో ఉన్న వారపు సంతలో సౌకర్యాలు కల్పించేందుకు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్, సంత మోనటరింగ్ చైర్మన్ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సంత పర్యవేక్షణ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించారు. సంతలో పశువులకు తాగునీటి తొట్టెలు, వాటిని తరలించేందుకు ర్యాంప్‌లు, షెడ్‌లు నిర్మాణం పక్కాగా ఉండాలన్నారు. ముఖ్యంగా పశువులు అక్రమ రవాణా లేకుండా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు.

రాష్ట్ర గో సంవరక్షణ అధ్యక్షుడు లోగిస రామకృష్ణ మాట్లాడుతూ సంతల్లో సౌకర్యాలు లేకపోతే మూసివేయాలని అన్నారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేశారు. కానీ వాటి పనితీరుపై అధికారులు పర్య వేక్షణ లేదన్నారు. సంతల్లో సౌక ర్యాలకు ని ధులు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభు త్వా నికి లేఖ రాసినట్టు చెప్పారు. చైర్మన్‌తో పాటు పర్యవేక్షన కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేస్తే పశువులతో పాటు రైతులకు మేలు చేసిన వారిమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ శ్రీనివాసరావు, ఏడీఎం బి.శ్రీని వా సరావు,పట్టణ ఎస్ఐ జేవీ రమణ పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

## అంధకారంలో గుడివాడ కాలనీ

**గుడివాడ (బలిజిపేట)** మూడు నెలలగా వీధులో దీపాలు లేక అంధకారంలో మగ్గుతున్నామని పలగర పంచాయతీ గుడివాడ కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట అనేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పంట పొలాలకు ఆనుకుని కాలనీ ఉండడంతో రాత్రిపూట విషసర్పాలు సంచరించడం భయభ్రాంతులకు గురవుతున్నామన్నారు. సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేదని తెలిపారు. కాలనీలో చేతి పంపు మర మ్మతులకు గురై నెలలు గ డుస్తున్నా ఎవరూ పట్టిం చుకోవడం లేదని వాపోయారు. దీంతో తాగునీటికి నానా అవస్థలు పడుతు న్నామని తెలిపారు. అధికా రులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.


మరమ్మత్తులకు గురైన బోరు

## మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

**బలిజిపేట:** ఏపీసీపీఎస్ఈ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న మండల కేంద్రాల్లో తలపెట్టిన మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పైడపునాయుడు కోరారు. మంగళవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పోరాటాల ఫలితంగా దేశంలో మొదటిసారిగా గ్రాట్యుటీ కుటుంబ పింఛన్ లభించిందన్నారు. ఈ సమావేశంలో సీపీఎస్ఈ మండల అధ్యక్షుడు ధర్మారావు, ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.


### మార్చ్‌కి వీఆర్వోలు తరలి రండి

**సీతానగరం:** మార్చ్‌ను విజయవంతం చేయాలని మండల వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఆర్.బలరాం తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయాలని చేపట్టిన ఉద్యమాన్ని అన్ని సంఘాల వారు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. విజయవాడలో 1న చేపట్టనున్న భారీ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొవాల్సిందిగా కోరారు.


గోడ పత్రికను విడుదల చేస్తున్న ఉద్యోగులు

## సమయ పాలన లేకపోతే చర్యలు తప్పవు

**బర్లి (బలిజిపేట)** ఉపాధ్యాయులంతా ప్రభుత్వ సమయాలు పాటించకపోతే చర్యలు తప్పవని మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన బర్లి, మిర్తివలస పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. బర్లిలో పాఠశాల ఉపాధ్యాయడు కె.రాంబాబు హాజరు కాకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3.30 వరకు సమయం విధిగా పాటించాలని అతిక్రమిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పాఠశాల్లో మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో

# జీఎస్టీతో బాదుడే

### ● అవగాహన సదస్సులో ప్రజా సంఘాల నాయకులు

● అమాంతం పెరిగిన కూరలు, నిత్యావసరాల ధరలు ● కార్పొరేట్, విదేశీ కంపెనీలకు లాభాలు

**పార్వతీపురం టౌన్:** వ్యాపారుల పాలిట జీఎస్టీ గుదిబండగా మారిందని ప్రజా సంఘ నాయకులు ఎం.శ్రీనివాస అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో జీఎస్టీపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం సులువైన పన్ను విధానమని వ్యాపారులపై జీఎస్టీని మోపిందన్నారు. నెల తిరిగే సరికి జీఎస్టీ రంగు బయటపడిందన్నారు. బడా కార్పొరేట్, విదేశీ కంపెనీలకు లాభాలు తెచ్చి పెట్టే విధంగా జీఎస్టీ ఉందన్నారు.

ఆహార వస్తువులకు పన్ను మినహాయించామని, ధరలు తగ్గుతాయని చెప్పారని, ఇప్పుడు ఉల్లి నుంచి టమాటా వరకు అన్నీ ధరలు అమాంతంగా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిఫిన్, కాఫీ నుంచి వస్త్ర దుకాణాల వరకు 5 శాతం నుంచి 28 శాతం వరకు జీఎస్టీ పేరుతో పన్నులు మోపారన్నారు. జీఎస్టీ రద్దుకు ప్రతి ఒక్కరూ ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాపార సం ఘ నాయకులు ఐ.గు న్నేష్, సంకా ఈశ్వరరావు, సీపీఎం డివిజన్ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, పట్టణ పౌర సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాకల సన్యాసిరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస

## అన్నమాచార్యుల కీర్తనల పుస్తకం ఆవిష్కరణ నేడు

**పార్వతీపురం టౌన్:** స్థానిక వెంకటేశ్వర కళామందిర్ ఆవరణలో బుధవారం వాసవీ, గాయత్రీ విద్యా సంస్థలు ముద్రించిన అన్నమాచార్యుల వాగ్గేయ వరదాయని 505 కీర్తనల పుస్తకాన్ని శ్రీసర్వమంగళాదేవి పీఠాదిపతి మురపాక కాళిదాసుశర్మ ఆవిష్కరిస్తారని, ఆ విద్యాసంస్థల కర స్పాండెంట్ పీవీ మణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి వి ద్యావంతులు, కవులు, రచయితలు హాజరవ్వాలని కోరారు.

### రైతుబాజార్‌లో కూరల ధరలు

కిలో ఒక్కంటికి

| | |
|---|---|
| టామాటాదేశవాళీ | రూ.43 |
| వంకాయలు | రూ.26 |
| బెండకాయలు | రూ.23 |
| బీరకాయలు | రూ.22 |
| దొండకాయలు | రూ.17 |
| పొడవుచిక్కుడు | రూ.13/ 16 |
| గోరు చిక్కుడు | రూ. 26 |
| కేబిజి బుట్ట | రూ.20 |
| నక్కదోశ | రూ. 26 |
| కీరదోశ | రూ. 20 |
| కంద | రూ. 20 |
| చేమ | రూ. 26 |
| పొట్ల కాయ | రూ.7 |
| ముల్లంగి | రూ. 18 |
| కేరెట్ | రూ. 37 |
| బీట్ రూట్ | రూ. 34 |
| ఫ్రెంచ్ బీన్స్ | రూ. 64 |
| క్యాప్సి కమ్ | రూ. 58 |
| పొటల్స్ | రూ.32 |
| ఆగాకర కాయలు | రూ. 65/90 |
| ఉల్లిపాయలు | రూ. 24 |
| బంగళాదుంపలు | రూ.11 |
| అల్లం | రూ. 50/55 |
| వెల్లుల్లి | రూ. 40/45 |
| పచ్చిమిర్చి | రూ.36/40 |
| మునగకాడ(ఒకటి) | రూ.5 |
| కాకర కాయ(ఒకటి) | రూ.8 |
| అరటికాయ (ఒకటి ) | రూ.5 |
| ఆకుకూరలు | రూ.8 |

# జన్మభూమికి సేవ చేయడం అదృష్టం

**బర్లి (బలిజిపేట)** పుట్టి, పెరిగిన ప్రాంతానికి సేవచేయడం ఎంతో అదృష్టమని జడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణి అన్నారు. మంగళవారం బర్లిలో తాన్న సత్యంనాయుడు, లక్ష్మమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరయారు. సర్పంచ్ పాలూరి సరస్వతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో పథకాలను ప్రస్తావించారు. తాన్న రామకృష్ణ, వారి కుమారుడు చైతన్యలను అభినందించారు. గ్రామంలో తాగునీటికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ జన్మభూమి స్ఫూర్తితో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ బర్లి నుంచి సుభద్ర వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. తాన్న సత్యంనాయుడు, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి మనుమడు తాన్న చైతన్యనాయుడు నిర్మించిన ముఖ ద్వారాన్ని బొబ్బిలి చిరంజీవులు ప్రారంభించారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎ మ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ శంకుస్థాపన చేశారు. గ్రామం లో సుమారు రూ. 2 లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, సీతానగరం జడ్పీటీసీ సభ్యుడు వెంకటరా వునాయుడు, బొబ్బిలి వైస్ ఎంపీపీ తమ్మిరెడ్డి దామోదరరావు, బలిజిపేట టీడీపీ మండల అధ్యక్షుడు సత్య నారాయణరాజు, మాజీ ఎంపీపీ శంబంగి సత్యంనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు మండలరాధ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణి, ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరంజీవులు

# పర్లాకిమిడి నుంచే వాడుక భాషోద్యమం

● చైతన్య సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తి

**పర్లాకిమిడి:**గ్రాంధిక భాష అర్థం కాక చదువుపై గ్రామీణులు నిరాశక్తత చూపేరోజుల్లో గిడుగు రామమూర్తి 1910లో వాడుకభాషోద్యమాన్ని పర్లాకిమిడి నుంచే ప్రారంభించారని చైతన్య సమితి అధ్యక్షుడు కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం రాణి పేటలో కేంబ్రిడ్జి పాఠశాలలో తెలుగు భాషాదినోత్సవం పురస్కరించుకొని చైతన్య సమితి సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణమూర్తి మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తెలుగుభాషకు చేసిన సేవలు కొనియాడారు. స్వశక్తితో పైకివచ్చిన వ్యక్తిగా ఆయన నిలిచారన్నారు. కార్యక్రమంలో బీఎస్.రావు, హరి, అల్లాడ లక్ష్మణరావు పాల్గొన్నారు.

**కళాంజలి ఆధ్వర్యంలో...**

స్థానిక రాజవీధిలో కళాంజలి సంస్థ ఆధ్వర్యంలో తెలుగు భాషాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాంజలి అధ్యక్షుడు, గిడుగు రామమూర్తి బంధువు బీవీ రమణమూర్తి తెలుగు భాషాభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన కృషిని వివరించారు. పర్లాకిమిడిలో చదువుకొని ఇక్కడి నుంచే ఉద్యమాలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో సభ్యులు జవ్వాది సూర్యారావు, నానాజీ, జనార్దనరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణమూర్తి

# చైనా వస్తువులను నిషేధించండి

● ఆర్.ఉదయగిరిలో స్వదేశీ జాగరణ్‌మంచ్


బ్యానర్లను దహనం చేస్తున్న స్వదేశీ జాగరణ్‌మంచ్ సభ్యులు, టిబెటియన్లు

**పర్లాకిమిడి:** ఆర్.ఉదయగిరి సమితిలో చైనా వస్తువుల నిషేధించాలని స్వదేశీ జాగరణ్‌మంచ్ ఆధ్వర్యంలో మంగళవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మోటారు సైకిళ్లపై వందలమంది ర్యాలీ నిర్వహించి చైనా వస్తువులను వాడవద్దని అవగాహన కల్పించారు. దుకాణాల్లో చైనా వస్తువులను విక్రయిస్తున్న వారి బ్యానర్లను తీసి దహనంచేశారు. ఈ కార్యక్రమంలో స్వదేశీ జగరన్ మంచ్ అధ్యక్షుడు సుదర్శన్ పండా, టిబెటియన్ నాయకుడు సిమ్‌జాయ్‌సన్, సెరంగో బక్కి పాల్గొన్నారు.

# ఎన్నికలకు సిద్ధం కండి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ

**పర్లాకిమిడి:** ముందస్తుగా అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో కార్యకర్తలు సిద్ధంకావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ పిలుపునిచ్చారు.మంగళవారం ఆర్.ఉదయగిరిలో జరిగిన బీజేపీ నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో వెంకటరమణ మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే మూలస్తంభాలన్నారు.మోడి ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను గ్రామాల్లో ప్రచారం చేసి ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేయాలని కోరారు. పంచాయతీ ఎన్నికల విజయాన్ని స్ఫూర్తిగా తీసుకొని కార్యకర్తలు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సరోజ్‌సాబత్, ఉదయ్‌మంకడ్, చంద్రన్నకర్జి, మండల్ పాల్గొన్నారు.

# పర్లాకిమిడిలో క్రీడోత్సవ ర్యాలీ


పర్లాకిమిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

**పర్లాకిమిడి:** స్థానిక గజపతి క్రీడామైదానంలో మంగళవారం జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకొని జిల్లా క్రీడాధికారి ప్రభాకర్‌త్రిపాఠి జెండా ఎగురవేసి ఆటలను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్రీడా ర్యాలీ నిర్వహించారు. కాగా వర్షం వల్ల క్రీడోత్సవాలు రద్దయ్యాయి.

# క్షయ వ్యాధిపై అవగాహన

**పర్లాకిమిడి:**స్థానిక సీడీఎంవో కార్యాలయంలో మంగళవారం క్షయవ్యాధి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కటక్‌కు చెందిన డాక్టర్ దేవదత్త మాట్లాడుతూ అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న రోగులను గమనిస్తే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ముఖ్యవైద్యాధికారి పూర్ణచంద్రకొరో, జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రవిబాబు పాల్గొన్నారు.

# రెండు పూరిళ్లు నేలమట్టం

**పర్లాకిమిడి:** పర్లాకిమిడిలో పట్టణం 13వవార్డులో భారీ వర్షాలకు రెండు పూరిళ్లు కూలిపోయాయి. కూలీలు అప్పారావు, రాజారావుల ఈ పూరిళ్లు కూలిపోవడంతో లబోదిబోమంటున్నారు. నిరాశ్రయులయ్యామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.


నేలకొరిగిన పూరిల్లు

### తల్లి కడుపులోనే
# కన్నుమూసిన శిశువు

● ఐటీడీఏ పీవో చొరవతో దక్కిన తల్లి, మరో బిడ్డ ప్రాణాలు

**సాలూరు రూరల్:** మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఫలితం లేకుండా పోతున్నది. క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉండడంతో ప్రభుత్వ ఆశయానికి విఘాతం కలుగుతున్నది. ఈ నేపథ్యంలో ప్రధానంగా గిరిశిఖర, గిరిజన ప్రాంతాల్లో తల్లీబిడ్డ మరణాలు సంభవిస్తున్నాయి. దిగువమెండంగిలో ఆదివారం ఓ గర్భిణీ, కడుపులో ఉన్న బిడ్డ మరణించిన సంఘటన మరువక ముందే మన్యంలో మరో శిశువు తల్లిగర్భంలో మరణించింది. ప్రసవానికి గిరిజన గర్భిణీ వస్తున్న విషయం తెలుసుకున్న పార్వతీపురం ఐటీ డీఏ పీవో లక్ష్మీశ వైద్యసిబ్బందిని అప్రమత్తం చేయడంతో తల్లి, కడుపులో ఉన్న మరో బిడ్డ ప్రాణాలు దక్కాయి. వివరాలిలా ఉన్నాయి. ఏవోబీలో ఆంధ్రా-ఒడిశా వివాదస్పద గ్రామమైన గంజాయిభద్ర పంచాయతీలో ధూళిభద్ర గ్రామానికి చెందిన చోడిపల్లి కమల (23) నెలలు నిండిన గర్భిణీ. ఆమెకు సోమవారం రాత్రి ఆకస్మికంగా ప్రసవ నొప్పులు రావడంతో పాటు బిడ్డ కాలు ఒకటి బయటకు వచ్చింది. దీంతో ఆందోళన చెందిన గిరిజనులు ఆమెకు డోలీ కట్టి మోసుకుంటూ కొండ దిగి సారిక వరకు వచ్చారు. అక్కడకు 108 వాహనం రావడంతో సాలూరు సీహెచ్ ఎన్సీకి తరలిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పార్వతీపురం ఐటీడీఏ పీవో లక్ష్మీశ వైద్యసిబ్బందిని అప్రమత్తం చేశారు. అయితే ఆమెది హైరిస్క్ కేసు కావడంతో ప్రాథమిక జాగ్రత్తలు తీసుకొని హుటాహుటిన వైద్య సిబ్బంది విజయనగరం ఘోషాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యసిబ్బంది సైతం అప్రమత్తంగా ఉన్నారు. కమల ఆసుపత్రికి చేరుకోగానే వెనువెంటనే ప్రసవ ఏర్పాట్లు చేశారు. సిజేరియన్ చేశారు. అయితే కాలు బయటకు వచ్చిన బిడ్డ మరణించింది. మరో మగబిడ్డ, తల్లి క్షేమంగా ఉన్నారు.

# ఇక అధికారుల పల్లెబాట

**కలెక్టరేట్:** ప్రభుత్వాధికారులు ఇక నుంచి పల్లె బాట పట్టనున్నారు. వారానికి మూడు రోజులు పాటు క్షేత్ర స్థాయి పర్యటన చేయనున్నారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకూ పని చేసిన అధికారులంతా గ్రామాలకు వెళ్లనున్నారు. ఒక రోజు రాత్రి ఆయా గ్రామంలో బస చేసి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలపై ప్రజలు నుంచి వివరాలు సేకరిస్తారు. ప్రజలు నుంచి సేకరించిన అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తారు. అందుకోసం ప్రత్యేక యాప్‌ను కూడా రూపకల్పన చేస్తారు. ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వచ్చే నెల మొదటి నుంచి పల్లె బాట అమలు చేయడానికి అంతా రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారి చొప్పున ఉన్నారు. జిల్లాలో ఏ మండలంలోనైనా ప్రత్యేకాధికారులు లేకపోతే ఆయా స్థానాలకు జిల్లా అధికారులను నియమిస్తారు. ఇక నుంచి వీరంతా వారానికి మూడు రోజులు పాటు క్షేత్రస్థాయి పర్యటన చేస్తారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

● వసతి గృహ సంక్షేమాధికారులకు జిల్లా జడ్జి గిరిధర్ హెచ్చరిక
● హాస్టళ్లలో జరిగే సంఘటనలకు అధికారులదే బాధ్యత
● బాలికల ప్రవర్తనపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న జిల్లా జడ్జి గిరిధర్

**కలెక్టరేట్:** జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థులకు ఏదైనా జరిగితే ఆయా సంక్షేమ అధికారులే బాధ్యత వహించాలని జిల్లా జడ్జి అలపాటి గిరిధర్ అన్నారు. విధులు నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తూ అవాంఛనీయ ఘటనలకు కారకులైన వారిని విడిచిపెట్టబోమని, వివిధ చట్టాలు కింద వారిని ప్రొసిక్యూట్ చేస్తామని హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ ఆడిటోరియంలో సంక్షేమ వసతి గృహాలకు చెందిన అధికారులతో బాలిబాలికలతో సున్నితత్వం అనే కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో ఉన్న మైనర్ బాలికలు తెలియక తప్పు చేసినా అందుకు సంరక్షకులే బాధ్యత వహించాలన్నారు. దీనిని దృష్టి లో పెట్టుకుని వసతి గృహాల్లో పని చేసే అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని హెచ్చరించారు. వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోకి ఇతరులను లోనికి అనుమతించవద్దని సూచించారు. సక్రమం గా విధులకు హాజరుకాని వారిని ప్రొసిక్యూట్ చేసేందుకు వెనుకడుగు వేసేది లేదని, ఒక సారి ప్రొసిక్యూట్ చేస్తే ఆయా కుటుంబాలు ఎన్నో ఇబ్బందులకు గురవుతాయని చెప్పారు. విద్యార్థులు కదలికల్ని నిత్యం గమనిస్తూ ఉండాలని అన్నారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో విధులకు గైర్హాజరు అయ్యేవారు ఎక్కువగా ఉన్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు.

# విద్యార్థులను కన్నబిడ్డలుగా చూసుకోండి

● కలెక్టర్ వివేక్ యాదవ్

వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులును సంక్షేమ అధికారులు కన్న బిడ్డలుగా చూసుకోవాలని కలెక్టరు వివేక్ యాదవ్ అన్నారు. న్యాయ, పోలీసు, పరిపాలన వ్యవస్థలు నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తూ హాస్టల్‌లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అట్టడుగు వర్గాలు వారి కుటుంబాలకు చెందిన విద్యార్థులకు వసతులు కల్పించడం ద్వారా వారి జీవితాల్లో మార్పులు తీసుకుని రావాలనదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకుని రావాలని తెలియజేశారు. క్షేత్రస్థాయి లో సంక్షేమ అధికారులు వసతి గృహాలను పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులతో రెండు నెలలకు ఒకసారి ముఖాముఖిగా కలుసుకుని సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ శ్రీహరి, రెండవ జేసీ నాగేశ్వరరావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సునీల్‌రాజకుమార్, బీసీ వెల్ఫేర్ అధికారిణి కుమ్మ కరారి, ఐసీడీఎస్ పీడీ రాబర్ట్స్, జిల్లా వైద్యాధికారి పద్మజ, డీసీహెచ్ఎస్ ఉషశ్రీ, ప్రముఖ సైకాలజిస్ట్ విజయరామరాజు, బొబ్బిలి డీఎస్పీ సౌమ్యలత, అసిస్టెంట్ ప్రొసిక్యూటర్ కేశవరావు, బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలకు సంబంధించిన సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

# మాకంటే మాకు..!



**ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న రాయితీ ట్రాక్టర్లకు విపరీతమైన పోటీ నెలకొంది. నేతల ప్రాపకంతోనే ఇవి మంజూరయ్యే అవకాశం ఉండడంతో వారి చుట్టూ రైతన్నలు గింగిరాలు కొడుతున్నారు. తమ కంటే తమకు మంజూరు చేయించాలని ప్రాధేయపడుతున్నారు. ఈ పరిస్థితితోనే ప్రభుత్వం జిల్లాకు కేటాయింపు పెంచినా డిమాండ్ మాత్రం తగ్గలేదు. జిల్లాకు మంజూరు చేసినవి వందల్లో ఉంటే దరఖాస్తులు వేలల్లో వచ్చి చేరుతున్నాయి. దీంతో నేతల తలబొప్పి కడుతోంది.**

- రైతు రథాలకు పోటాపోటీ ● పైరవీల జోరు
- నేతల ప్రసన్నానికి రైతుల ప్రదక్షిణలు
- ఒక్కో నియోజకవర్గానికి 64 ట్రాక్టర్లు
- విజయనగరానికి 16 మాత్రమే
- రూ.1.50లక్షల నుంచి 2.50 లక్షల వరకు రాయితీ

(శృంగవరపుకోట)

**రైతు** రథం (రాయితీ ట్రాక్టర్లు) కోసం పైరవీలు మొదలయ్యాయి. ప్రజాప్రతినిధుల చుట్టూ ఆశావాహులు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. దీంతో ఈపథకం వారికి తలనొప్పి తెప్పిస్తోంది. జిల్లాకు కేటాయించిన ట్రాక్టర్లు వందల్లో ఉండగా.. దరఖాస్తులు వేలల్లో వస్తుండడంతో అధికారులు సతమతమవుతున్నారు. తమకు ట్రాక్టర్ మంజూరు చేయించాలని అధికార పార్టీ నేతలపైన రైతులు ఒత్తిడి తెస్తున్నారు. తమ చేతిలో లేదని తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ వారు నమ్మడం లేదు. దీనికి తోడు ఎమ్మెల్యే సిఫార్స్ ఉంటేనే మంజూరవుతాయని వ్యవసాయ అధికారులే చెబుతుండడంతో మరింత ఇరకాటంలో పడుతున్నారు.

### కేటాయింపు పెంపు..

ఈ పథకానికి ఉన్న డిమాండ్‌తో నియోజకవర్గాలకు మరిన్ని ట్రాక్టర్‌లను పెంచాలని ఎమ్మెల్యేలు కోరగా, మరికొన్ని కేటాయించారు. ప్రస్తుతం ఒక్కో గ్రామీణ ప్రాంత నియోజకవర్గానికి 64 ట్రాక్టర్లు, పట్టణ ప్రాంత నియోజకవర్గానికి 16 ట్రాక్టర్లు ఈ పథకం కింద అందించనున్నారు. దీంతో జిల్లాకు మొత్తం 528 ట్రాక్టర్లు ఇవ్వనున్నారు. ఇదిలా ఉంటే ఒక్కో నియోజకవర్గంలో నాలుగు నుంచి ఐదు మండలాలు ఉన్నాయి. కేటాయింపును బట్టి ఒక్కో మండలానికి 10 నుంచి 15 ట్రాక్టర్లు వరకు రైతులకు మంజూరు చేసే అవకాశం ఉంది. రెండు చక్రాల నుంచి నాలుగు చక్రాల ట్రాక్టర్.. ఇతర వ్యవసాయ పనిముట్లతో కలిపి రూ.5.50 నుంచి రూ.8.50లక్షల వరకు మార్కెట్‌లో ఉంది. ట్రాక్టర్, పనిముట్లను బట్టి ఈ పథకం లో రూ.1.50 లక్షలు, రూ.2.00 లక్షలు, రూ. 2.50 లక్షల రాయితీ ఉంది. దీంతో వీటిని పొందేందుకు రైతులు ఉత్సాహపడుతున్నారు.

### ప్రతిబంధకంగా రెండెకరాల నిబంధన ..

రాయితీపై ట్రాక్టర్ పొందేందుకు రెండెకరాల నిబంధన చాలామందికి ప్రతిబంధకంగా మారింది. అదీగాక గతంలో ఏ పథకం నుంచైనా రాయితీ ట్రాక్టర్లు పొందినవారు ఈ పథకానికి అనర్హులు.

ఇదిలా ఉంటే నిబంధనల ప్రకారం ఈ పథకంలో ప్రతి నియోజకవర్గం నుంచి ఎస్సీలకు 17.1 శాతం, ఎస్టీలకు 5.33 శాతం తప్పనిసరిగా కేటాయించాలి. అయితే వీరి నుంచి పెద్దగా డిమాండ్ లేదు. జనరల్, బీసీ కేటగిరిల నుంచి ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సిఫార్స్‌తో మంజూరు కానుండడంతో, ఎమ్మెల్యేల పాత్ర ఉంటుంది. దీంతో రైతులు ఎమ్మెల్యేలు, వారి అనుచరుల చుట్టూ గింగిరాలు కొడుతున్నారు.

### నిబంధనలివీ ..

- ఇంతకముందు ఏ పథకంలో రాయితీపై ట్రాక్టర్ పొంది ఉండరాదు
- రైతుకు కనీసం రెండెకరాల పొలం ఉండాలి.
- రైతుకు సొంతంగా ట్రాక్టర్ ఉండరాదు.
- కచ్చితంగా 17.1 శాతం ఎస్సీలకు, 5.33 శాతం ఎస్టీలకు కేటాయించాలి.
- ఈ ట్రాక్టర్ మంజూరైతే, ఆరేళ్ల వరకు అమ్మనని అంగీకార పత్రం రైతు ఇవ్వాలి.
- ఏ రకం, ఏ కంపెనీ ట్రాక్టర్ కావాలో రైతు నిర్ణయించుకోవాలి.
- జిల్లా సంయుక్త సంచాలకులు ఆర్థిక ఆమోదం తెలిపిన తర్వాత రాయితీ పోనూ.. మిగతా సొమ్ము రైతులు ఏపీఎస్ఏఐడీసీ లిమిటెడ్‌కు డీడీ ద్వారా చెల్లించాలి.

### ఇలా దరఖాస్తు చేయాలి..

- ఈ పథకంలో ట్రాక్టర్ల కోసం రైతులు దరఖాస్తుకు పాసు పుస్తకం, ఆధార్ కార్డుల నకలు జత చేసి సంబంధిత మండల వ్యవసాయాధికారికి అందించాలి.
- వ్యవసాయ అధికారుల సూచన మేరకు రూ.10వేలు మీసేవలో చెల్లించాలి.
- వెంటనే రైతు సెల్‌కు సమాచారం వస్తుంది.

### నియోజకవర్గాల వారీగా కేటాయించిన ట్రాక్టర్ల వివరాలు

| నియోజకవర్గం | ట్రాక్టర్లు | జనరల్ | ఎస్సీ | ఎస్టీ |
|---|---|---|---|---|
| విజయనగరం | 16 | 13 | 3 | -- |
| నెలిమర్ల | 64 | 52 | 11 | 1 |
| శృంగవరపుకోట | 64 | 51 | 11 | 2 |
| చీపురుపల్లి | 64 | 52 | 11 | 1 |
| గజపతినగరం | 64 | 52 | 11 | 1 |
| పార్వతీపురం | 64 | 50 | 11 | 3 |
| బొబ్బిలి | 64 | 50 | 11 | 3 |
| సాలూరు | 64 | 45 | 11 | 8 |
| కురుపాం | 64 | 45 | 11 | 8 |

# అక్కడ టిక్కెట్.. ఇక్కడ హాల్ట్

- రిజర్వేషన్ లేని స్టేషన్ నుంచి టికెట్ల జారీ
- ప్రయాణికుల ఆందోళన
- చీపురుపల్లిలో ఎక్కించిన వైనం

(చీపురుపల్లి)

రైల్వే శాఖ నిర్లక్ష్యంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హాల్ట్ లేని స్టేషన్ నుంచి రిజర్వేషన్ టికెట్లు జారీ చేయడంతో అక్కడ రైలు ఆగలేదు. దీంతో ప్రయాణికులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో ఆముదాలవలస స్టేషన్‌లో ఆగని.. సూపర్‌ఫాస్ట్ రైలుని చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ఆపి రిజర్వేషన్ ప్యాసింజర్లను ఎక్కించారు.

హౌరా నుంచి సికింద్రాబాద్‌కి మంగళవారం వీక్లీ సూపర్‌ఫాస్ట్ రైలు ఉంది. దీనికి శ్రీకాకుళం రోడ్డు (ఆముదాలవలస) నుంచి 48 మంది ప్రయాణికులు నెట్‌లో రిజర్వేషన్ చేయించుకున్నారు. అయితే ఈ రైలుకి ఆ స్టేషన్‌లో హాల్ట్ లేదు. సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో రైలు.. స్టేషన్ దాటి వెళ్లిపోతుండడంతో ప్రయాణికులు ఆందోళన చెంది.. స్టేషన్‌మాస్టర్‌ను అడిగారు. ఆయన వెంటనే కంట్రోల్ రూంకి ఫోన్ చేసి వివరాలు తెలిపారు. దీంతో చీపురుపల్లి రైల్వేస్టేషన్‌లో ఈ రైలుని రైల్వే అధికారులు సుమారు అరగంట వరకు నిలిపివేశారు. దీని వెనుకే వస్తున్న పలాస-విశాఖపట్నం పాసింజర్ రైలులో .. ఈ రైలుకి రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులను ఎక్కించి చీపురుపల్లికి తీసుకువచ్చారు. ఇక్కడ వారిని సూపర్‌ఫాస్ట్ రైలులోకి ఎక్కించారు. దీంతో కథ సుఖాంతమైంది.



చీపురుపల్లి స్టేషన్‌లో ఆగిపోయిన సూపర్‌ఫాస్ట్

### నిర్లక్ష్యం ఎవరిది..!

నిర్లక్ష్యం ఎక్కడ జరిగిందో అర్థం కాక ప్రయాణికులు తలలు పట్టుకున్నారు. అసలు హాల్ట్ లేని స్టేషన్‌లో రిజర్వేషన్ టికెట్లు ఎలా జారీ చేశారు. తప్పు జరిగిందని కేవలం అరగంటలో ఎలా తెలుసుకున్నారు. ఈ ప్రశ్నలకు సమాధానం రావాల్సి ఉంది. ఆముదాలవలస రైల్వేస్టేషన్ నుంచి చీపురుపల్లి స్టేషన్‌కి చేరుకోవడానికి కేవలం పావుగంట సమయం పడుతుంది. ఈ సమయంలో ప్రయాణికులకు న్యాయం చేయాలని ఎలా భావించారు. ఎన్నడూ లేనిది ఎంఈఎంయూ పలాస విశాఖ రైలు అంత లేటుగా ఎందుకు వచ్చింది. వాస్తవంగా చీపురుపల్లి స్టేషన్‌కి మధ్యాహ్నం 2.45 నిమషాలకు చేరుకోవాల్సి ఉంది. కానీ సాయంత్రం నాలుగున్నర సమయంలో చేరు కుంది. ఇవన్నీ ప్రశ్నలుగా మిగిలిపోయాయి, హాల్ట్ లేని చోట రిజర్వేషన్ ఇవ్వడం సాధ్యం కాదని రైల్వే స్టేషన్‌మాస్టర్ చెబుతున్నారు. ఏది ఏమైనా ఈ ఏమరపాటు రైల్వే శాఖకి తగదని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు.


తమ గోడుని వ్యక్తం చేస్తున్న బాధితులు

# 5 నుంచి జేఎంఎల్‌బీసీ సమావేశాలు

**కలెక్టరేట్ :** బ్యాంకు అధికారులు, ప్రభుత్వ అధికారులతో కూడిన మండల స్థాయి సంయుక్త కమిటీ (జేఎంఎల్‌బీసీ) సమావేశాలు సెప్టెంబరు 5 నుంచి నిర్వహించనున్నట్టు లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.గురవయ్య తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ పథకాలకు రుణ సహాయంపై చర్చించేందుకు ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. తొలి త్రైమాసికంలో సాధించిన లక్ష్యాలపై చర్చిస్తామని చెప్పారు. పంట రుణాల మంజూరు, స్వయం శక్తి సంఘాలకు బ్యాంకు లింకేజీ, ఎస్సీ, బీసీ యాక్షన్ ప్లాన్ అమలు, ట్రైకార్, పీఎంఈజీపీ, వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణ సహాయం, నగదు రహిత లావాదేవీలు, బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మండల అధికారులు, సంబంధిత బ్యాంకుల అధికారులు ఈ సమావేశాల్లో పాల్గొనాలని సూచించారు. పదిహేను రోజులపాటు జరిగే సమావేశాల షెడ్యూల్‌ను ఆయన తెలిపారు. సెప్టెంబరు 5న కొత్తవలస ఎస్‌బీఐలో వేపాడ, ఎల్.కోట, కొత్తవలస మండలాలకు, 6న ఎస్‌కోట ఏడీబీ బ్రాంచిలో ఎస్.కోట, జామి మండలాలకు, 7న సాలూరు ఎస్‌బీఐలో సాలూరు, పాచిపెంట, రామభద్రాపురం, మక్కువ మండలాలకు, 8న నెల్లిమర్ల ఎస్‌బీఐలో నెల్లిమర్ల, గుర్ల మండలాలకు, 11న చీపురుపల్లి ఎస్‌బీఐలో చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం మండలాలకు, 12న తెర్లాం ఎస్‌బీఐలో తెర్లాం, బాడంగి మండలాలకు, 13న బొబ్బిలి ఎస్‌బీఐలో సీతానగరం, బలిజిపేట, బొబ్బిలి మండలాలకు, 14న గజపతినగరం ఎస్‌బీఐలో మెంటాడ, దత్తిరాజేరు, బొండపల్లి, గజపతినగరం మండలాలకు సమావేశాలు నిర్వహిస్తామన్నా రు. 15న పార్వతీపురం ఎస్‌బీఐ ఏడీబీ బ్రాంచిలో పార్వతీపురం, 18న భోగాపు రం ఎస్‌బీఐలో డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు, 19న కురుపాం ఎస్‌బిఐలో కురుపాం, జియ్యమ్మవలస, గుమ్మలక్ష్మీపురం మండలాలకు సంబంధించిన సమావేశాలు జరుగుతాయన్నారు.

# కొట్టాం పీహెచ్‌సీని సందర్శించిన ‘ హు’ ప్రతినిధి

**శృంగవరపుకోట రూరల్ :** కొట్టాం పీహెచ్‌సీని ప్రపంచ ఆరోగ్య సంస్థ (హు) ప్రతినిధి సమతరాయ్ మంగళవారం సందర్శించారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ వైద్యాధికారి జగదీష్, సీహెచ్‌వో వేణుగోపాల్‌తో ఎంఆర్ వ్యాక్సిన్‌పై చర్చించారు. దీనికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎంఆర్ వ్యాక్సిన్ 13 వేల మందికి వేయాల్సి ఉండగా.. ముగ్గురికి వేయలేదు. వీరు అనారోగ్యంతో ఉండడంతో వేయలేదని తెలిపారు. అనంతరం టీకాలు వేయని చిన్నారులను ఎస్.కోట సీహెచ్‌సీకి రప్పించి సమతరాయ్ సమక్షంలో వేశారు. లక్ష్యాలను సాధించిన సిబ్బందిని ఆయన అభినందించారు.


సమతరాయ్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఎంఆర్ టీకా వేస్తున్న సిబ్బంది

# వరద విలాపం!

జిల్లాలో వరద భయం ఇంకా వీడలేదు. వర్షాలు తగ్గుముఖం పట్టినా ఉధృతంగా ప్రవహిస్తున్న నదులతో తీర ప్రాంత గ్రామాల ప్రజలు భయం గుప్పిట్లోనే ఉన్నారు. నాగావళి నది శాంతించినా పంటలకు ఆయుకట్టు పరిధిలో తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ముఖ్యంగా వరినాట్లు నీట మునగడంలో మొనలు కుళ్లిపోతున్నాయి. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. కాగా తోటపల్లి ప్రాజెక్టు స్పిల్‌వే కోతకు గురైంది. గతంలో దెబ్బతిన్నా మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇప్పుడు మరింత ప్రమాదకరంగా మారింది. వరద ఉధృతికి కూలిన ఎడమ ప్రధాన కాలువ పాసెజ్‌ను ప్రాజెక్టు అధికారులు పరిశీలించారు. పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

- ఉధృతంగా ప్రవహిస్తున్న చంపావతి, సువర్ణముఖి నదులు
- తీరప్రాంతాలను వదలని భయం
- కాలువలకు గండ్లు
- ముంపులోనే పంట పొలాలు
- వందలాది ఎకరాల్లో నష్టం




## ఉధృతంగా.. చంపావతి నది

**గజపతినగరం రూరల్ :** చంపావతి నదీ పరివాహక ప్రజలకు వరద భయం పట్టుకుంది. గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు చంపావతి ఉధృతంగా ప్రవహిస్తుంది. ఎన్నడూ లేనంతగా వరదనీరు రావడంతో తీర ప్రాంత ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంకోవైపు చెరువులు, వాగులు వంకలు కలిసిపోవడంతో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. నాట్లువేసి పట్టుమని పది రోజులు కూడా కాలేదని, ఎడతెరిపిలేని వర్షాలకు పంటపొలాలు నీట మునిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దమ్ము, ఉబాలు, ఎరువులు ఇలా ఎకరాకు రూ.5వేలు పైబడే ఖర్చు అయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పుడు పంట ముంపు నకు గురికావడంతో వరినాట్లు కుళ్లిపోయే పరస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే మండలంలోని మదుపాడ గ్రామంలో వడ్డిమామిడి చెరువు కింద ఎనిమిది ఎకరాలు, పురిటిపెంట సుబ్బసాగరం కింద 25ఎకరాల వరకు పంట మునిగిపోయింది. ఇలా మండలంలోని అనేక గ్రామాల్లో వందల ఎకరాల్లో పంట నీట మునిగింది. ఆగస్టులో సాధారణ వర్షపాతం 162.2మి.మీ కాగా మంగళవారం ఉదయం వరకు 328.8మి.మీ వర్షపాతం నమోదైంది. చంపావతి నదీ పరివాహక ప్రాంతాలైన కొనిస, పత్రువాడ, గంగచోళ్లపెంట, పురిటిపెంట, లోగిస తదితర గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులు అప్రమత్తం చేశారు.



మదుపాడలో నీటమునిగిన వరిపంట



కొండల నడుమ హోయలొలికిస్తున్న చంపావతి నది

## చంపావతి.. పరవళ్లు

**నెల్లిమర్ల :** కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు, ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న వరద నీటితో చంపావతి నది పరవళ్లు తొక్కుతోంది. నిన్నమొన్నటి వరకు ఎడారిని తలపించి నేడు జలకళ ఉట్టిపడుతూ కొండల నడుమ పరుగు పెడులు పెడుతోంది.




పరవళ్లు తొక్కుతూ.. ముందుకు సాగుతూ..

## 1500 ఎకరాల్లో...

**జియ్యమ్మవలస :** కొద్ది రోజులగా కురుస్తున్న వర్షాలకు మండలంలో వందలాది ఎకరాల్లో వరి పొలాలు మునిగిపోయాయి. మండలంలో 1500 ఎకరాల్లో వరి నాట్లు, అరటి తోటలు నీట్లో ఉండిపోయినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. తహసీల్దార్ కేవీఎస్ భాస్కరరావు అధికారులను అప్రమత్తం చేశారు. పరజపాడు గదబవలస గ్రామానికి చెందిన 34 గిరిజన మత్స్యకార కుటుంబాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జగన్నాథసాగరానికి భారీ గండి పడడంతో రూ.45 లక్షలు విలువైన చేప పిల్లలు కొట్టుకుపోయాయి. ఇంత జరిగినా మత్స్యశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ముంపునకు గురైన ప్రాంతాల్లో మండల వ్యవసాయాధికారి మూడడ్ల శ్రావణ్‌కుమార్ పర్యటించారు. కుదమ, కేటీవాడ, బట్లభద్ర, బిత్రపాడు, పరజపాడు, పెదకుదమ గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు.



వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఏవో శ్రావణ్‌కుమార్



తోటపల్లి ప్రాంతంలో నీట మునిగిన వరి పంట

## అపార నష్టం

**గరుగుబిల్లి :** గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని వరి ఉభాలు అధికంగా నీటి మునిగాయి. పైప్రాంతం నుంచి వరద ప్రవాహం రావడంతో ప్రస్తుతం పంట పొలాలు చెరువుల్లా దర్శనమిస్తున్నాయి. నందివానివలస, తోటపల్లి, పిట్టలమెట్ట, సంతోషపురం గ్రామాల పరిధిలో సుమారు 100 ఎకరాలకు పైగా వరి నాట్లు నీట మునిగాయి. ముంపునకు గురైన ప్రాంతాలను తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి, ఏఈవో అమర శివ పరిశీలించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.



రెండు గేట్లు నుంచి దిగువకు విడిచిపెట్టిన వరద నీరు

**తోటపల్లి (గరుగుబిల్లి) :** తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం మంగళవారం నాటికి తగ్గు ముఖం పట్టింది. ప్రాజెక్టులో 105 మీటర్ల పూర్తి సామర్థ్యానికి గాను 103.90 మీటర్ల మేర నీరు ఉంది. పైప్రాంతం నుంచి సుమారు 10 వేల క్యూసెక్కుల మేర రాగా, రెండు గేట్లు నుంచి 7,961 క్యూసెక్కుల మేర నీటిని దిగువకు విడుదల చేశారు. కాల్వల నుంచి సాగునీటి సరఫరా తగ్గించినట్టు ప్రాజెక్టు డీఈ పాండు తెలిపారు.



కోతకు గురైన స్పిల్ వే ముందు ప్రాంతం

### కోతకుగురైన స్పిల్‌వే..

ప్రాజెక్టుకు అధిక వరద ప్రవాహం కారణంగా నూతన స్పిల్‌వే ముందు భాగం కోతకు గురైంది. గతంలో కొంతమేర రక్షణగోడ నిర్మించిన ప్రాంతం మినహా మిగతాది కోతకు గురవడంతో ప్రమాదంగా మారింది. గత నెల 16న నెలకొన్న వరద బీభత్సానికి స్పిల్‌వేను ఆనుకుని ఉన్న మెట్లు బీటులువారాయి. స్పిల్‌వేను ఆనుకుని రక్షణ చర్యలు చేపట్టేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినా ఎటువంటి ఫలితం కనిపించలేదు. ప్రస్తుతం ప్రాజెక్టుకు వరుస వరదలు రావడంతో రోజురోజుకీ కోతలు పెరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు దృష్టి సారించి అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉంది. లేకుంటే స్పిల్‌వేకు ప్రమాదం పొంచిఉంది.



పార్వతీపురం మున్సిపాల్టీ జనశక్తి కాలనీలో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి



శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీలో...



## వర్షం దెబ్బ... రోడ్డుపై గొయ్యి

**చీపురుపల్లి రూరల్ :** నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని రహదారులు దెబ్బతిన్నాయి. పెదనడిపల్లి వద్ద ప్రధాన రోడ్డుకు పెద్ద రంధ్రం ఏర్పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన రంధ్రాన్ని పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## సూపర్ పాసెజ్ పునరుద్ధరణకు ప్రతిపాదనలు

**తోటపల్లి (గరుగుబిల్లి) :** తోపటల్లి ఎడమ ప్రధాన కాలువపై గల సూపర్ పాసెజ్ వరద ఉధృతికి కూలిపోవడంతో ప్రాజెక్టు అధికారులు మంగళవారం పరిశీలించారు. దీని నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు చేస్తున్నట్టు పాత బ్యారేజీ డీఈ వై.గనిరాజు (పాలకొండ) అన్నారు. పాసెజ్ కూలిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంలో నిర్మించిన సైపున్‌కు వరద తాకిడి వల్ల అధికంగా కూలిందన్నారు. దీని నిర్మాణానికి 2007-08 సంవత్సరానికి సంబంధించి అవసరమైన అంచనాలతో ప్రతిపాదనలు చేశామన్నారు. పూర్తి నిర్మాణానికి రూ.1.30 కోట్లతో అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామన్నారు. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ పరిశీలనలో ఎడమ కాలువ నీటి సంఘం అధ్యక్షుడు పట్టా లక్ష్మణరావు, జేఈ కె.రాజేష్, ఐజీలు పి.జగన్నాథం, శంబంగి తిరుపతిరావు ఉన్నారు.



కూలిన సూపర్ పాసెజ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డీఈ గనిరాజు, తదితరులు

## కూలిన కల్వర్టు

**శృంగవరపుకోట రూరల్ :** వేములాపల్లి సమీపంలోని కల్వర్టు మంగళవారం సాయంత్రం కూలిపోయింది. గత కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు శిథిలావస్థలో ఉన్న కల్వర్టు నానిపోవడంతో కూలిపోయిందని స్థానికులు చెబుతున్నారు. దీంతో తమ గ్రామం నుంచి కొత్తగోపాలపల్లికి రాకపోకలు నిలిచిపోయాయన్నారు. వెంటనే అధికారులు దీన్ని పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వేములాపల్లిలో కూలిన కల్వర్టు



## పెదాంకలం కాలువకు గండి

**బలిజిపేట :** మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందిస్తున్న పెదాంకలం కాలువకు బలిజిపేట సమీపంలో భారీ గండి పడింది. కాలువలో 10.10 కిలోమీటర్ వద్ద గట్టుకు గండి పడడంతో పంట పొలాలపై నీరు ప్రవహిస్తోంది. దీంతో పొలాల్లో ఇసుక మేటలు వేసింది. నారాయణపురానికి చెందిన కొంతమంది రైతులు నీటిని అక్రమంగా తరలించేందుకు కాలువ గట్టుకు రంధ్రం పెట్టడంతో కోతకు గురైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏఈ వేణుగోపాలరావు ఆధ్వర్యంలో ఇరిగేషన్ సిబ్బంది ఈ గండిని తాత్కాలికంగా పూడ్చడంతో కొంత ప్రమాదం తగ్గింది.



వసతి గృహం చుట్టూ చేరిన నీరు

## జలదిగ్బంధంలో వసతి గృహం

**లక్కవరపుకోట :** స్థానిక ఎస్సీ బాలుర వసతి గృహం జల దిగ్బంధంలో చిక్కుకుంది. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి హాస్టల్ భవం చుట్టూ నీటితో నిండిపోయింది. దీంతో విద్యార్థులు బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్నారు. కనీసం కాలకృత్యాలు తీర్చుకొనేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వసతి గృహం లోతట్టు ప్రాంతంలో ఉండడంతో ఎప్పటికప్పుడు ఇలా తయారవుతుందని విద్యార్థులు వాపోయారు. ఈ వసతి గృహంలో సుమారు 90 మంది విద్యార్థులు ఉంటున్నారు.

## వందల ఎకరాల్లో పంట నష్టం

**కొమరాడ :** అల్పపీడన ప్రభావంతో గతకొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షా లకు మండలంలో సుమారు 600 ఎకరాల్లో పత్తి, వరి, అరటి పంటలకు నష్టం వాటి ల్లింది. వరి పంట పొలంలో వరద నీరు ని ల్వ ఉండటం వల్ల మొనలు కుళ్లిపోతున్నట్టు రైతులు చెబుతున్నారు. అయితే 350 ఎకరాల్లో వరి పంట నీటి మునిగినట్టు తహసీల్దార్ కార్యాలయం అధికారులు చెబుతున్నారు. 180 ఎకరాల్లో పత్తి పంటకు నష్టం వాటిల్లినట్టు ఫిర్యాదులు అందినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ చెప్పారు. 20 ఎకరాల్లో అరటి పంటకు నష్టం వాటిల్లినట్టు అంచనా వేస్తున్నారు. కాగా భారీ వర్షాలకు మండలంలో 13 గృహాలు దెబ్బతిన్నట్టు అధికారులు గుర్తించారు. వీఆర్‌వోలు నివేదికలు అందించాల్సి ఉన్నట్టు తహసీల్దార్ చెప్పారు.



నీట మునిగి కుళ్లిపోయిన వరి నాట్లు

# క్రీడలకు... ప్రోత్సాహమేదీ?

- రికార్డులకే పరిమితమైన పైకా నిర్వహణ
- అభివృద్ధికి నోచుకోని మైదానాలు
- నత్తనడకన ట్రాక్‌ల నిర్మాణం
- ప్రతిభ ఉన్నా కొరవడిన శిక్షణ



**సాలూరు రూరల్:**గ్రామీణ ప్రాంతాల్లో ఆటలాడే పిల్లలు ప్రస్తుతం ర్యాంకుల కోసం కుస్తీలు పడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలల రాకతో ర్యాంకుల ధ్యాసే తప్ప క్రీడలపై మక్కువ తగ్గిపోయింది. క్రికెట్, వాలీబాల్ తప్ప మరే ఇతర ఆటలు గ్రామీణ ప్రాంతాల్లోనూ కనిపించడం లేదు. గతంలో కబడ్డీ ఆడేవారు. దీనికి కూడా రోజురోజుకూ ఆదరణ తగ్గుతోంది. జిల్లాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వ చర్యలు శూన్యం. క్రీడలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు కూడా స్వల్పమే. క్రీడా సంఘాల్లో రాజకీయ జోక్యం, క్రీడాభివృద్ధికి పాటుపడాల్సిన అధికారుల్లో నిర్లక్ష్యం, తల్లిదండ్రుల్లో పిల్లల ఆటల పట్ల నిర్లిప్తత వెరసి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలకు ప్రోత్సాహం కొరవడింది. కొన్ని పాఠశాలల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నా సరైన శిక్షణ లేక వెనుకబడిపోతున్నారు.

### అధ్వానంగా మైదానాలు...

పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ఆటల్లో తర్ఫీదు ఇస్తున్న దాఖలాలు అంతంత మాత్రమే. శిక్షణ ఇద్దామన్నా మైదానాలు లేవు. ఉన్నవి అధ్వానంగా మారాయి. ప్రైవేట్ పాఠశాలల్లో అసలు క్రీడల ఊసే లేదు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రతి పాఠశాలకు మైదానం ఉండాలి. ఆ నిబంధనను ఎవరూ అమలు చేయడం లేదు. విద్యాశాఖాధికారులు సైతం ఆ నిబంధనను పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### పీడీల కొరత...

జిల్లాలో 544 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 363 ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 13 ఎయిడెడ్ పాఠశాలలు, 168 ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. సగానికి పైగా పాఠశాలలకు పీడీలు లేరు. కొద్దిరోజుల క్రితం జరిగిన బదిలీలు, పదోన్నతుల నేపథ్యంలో పీడీ కొరత వల్ల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ఆటల్లో ఆసక్తి సన్నగిల్లుతోంది.

### నత్తనడకన ట్రాక్‌ల నిర్మాణం

జిల్లాలో 164 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో క్రీడా మైదానాల్లో వాలీబాల్ కోర్టు, రన్నింగ్ ట్రాక్, కబడ్డీ ట్రాక్ నిర్మాణాలు ఉపాధి నిధులతో చేపడుతున్నారు. ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అలాగే క్రీడల్లో విద్యార్థులకు ఆసక్తి కల్పించడానికి ఇటీవల ప్రాథమిక పాఠశాలలకు క్రీడా పరికరాలను అందించారు. క్యారమ్స్, రింగ్స్ తదితర వాటిని అందించారు. అవన్నీ కూడా పాఠశాలలో మూలకు చేరాయి. కిట్లు ఉన్నా ఫలితం లేకుండా పోయింది.

### తూతూమంత్రంగా 'పైకా' నిర్వహణ

పంచాయతీ స్థాయిలో గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన పంచాయతీ ఖేల్ అభియాన్ (పైకా) రికార్డులకే పరిమితమైంది. ఏడాదికోసారి పైకా పోటీలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నారు. ఆతర్వాత పట్టించుకున్న వారు కరువయ్యారు. కొన్ని పంచాయతీల్లో నిర్మించిన ఈ భవనాలు ఆటలకు ఉపయోగం పడడం లేదు. పంచాయతీకొక పైకా భవనం నిర్మించాలని కేంద్రం మంజూరు చేసి నిధులు మురిగిపోయాయి. క్రీడా కిట్లు కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. కొన్ని చోట్ల నిధులు దుర్వినియోగమయ్యాయన్న విమర్శలు ఉన్నాయి.



నిరుపయోగంగా పైకా భవనం



### ప్రతిభ ఉన్నా ప్రోత్సాహం కరువు

జిల్లాలోని పలు పాఠశాలల్లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్ తదితర క్రీడల్లో మంచి ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నా వారికి ప్రోత్సాహం, సరైన శిక్షణ అందడం లేదు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి పెంచడంతో పాటు మార్కులు కేటాయించినట్టయితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించే అవకాశం ఉంది.

పాఠశాలకు క్యారంబోర్డు కిట్ అందిస్తున్న దృశ్యం

### క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి



ఉన్నత పాఠశాల స్థాయిలో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి. ఇందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలి. మౌలిక సదుపాయలు ఏర్పాటు చేయాలి. తల్లిదండ్రుల ధోరణిలో మార్పు తీసుకురావాలి. తమ పిల్లలు ఇష్టమైన క్రీడల్లో రాణించేలా సహకరించాలి.

– దన్నాన తిరుపతిరావు, పీఈటీల రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి



## పైడిమాంబకు గాజులతో అలంకరణ

**విజయనగరం టౌన్:**ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లమ్మను మంగళవారం పువ్వులు, గాజులతో అలంకరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ భానురాజా, ఆలయ అర్చకులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

## నేడు అవగాహన సదస్సు

**రింగురోడ్డు:**జిల్లాలోని టెలిఫోన్ మొబైల్ సేవల వినియోగదారుల కోసం భారత టెలికాం రెగ్యులేటరీ అథారిటీ బుధవారం హోటల్ మయూరాలో అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. మధ్యాహ్నం 3గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది. టెలికాం వినియోగదారులకు హక్కులపై అవగాహన కల్పిస్తారు. బీఎస్ఎన్ఎల్‌తో పాటు ఎయిర్‌సెల్, ఎయిర్‌టెల్, ఐడియా, రిలయన్స్, జియో, టెలినార్, వొడాఫోన్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరవుతారని ట్రాయ్ ప్రాంతీయ కార్యాలయం అధికారి వి.సుధాకర్ రెడ్డి తెలిపారు.

## పాత నేరస్థులపై ప్రత్యేక నిఘా

- చోరీల నియంత్రణకు చర్యలు
- రైల్వే ఎస్పీ మోహనరావు

**విజయనగరం క్రైం:** రైల్వే స్టేషన్లు, రైళ్లలో దొంగతనాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నామని, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టామని రైల్వే ఎస్పీ (విజయవాడ) కె.వి.మోహనరావు అన్నారు. విజయనగరం రైల్వేస్టేషన్‌లోని జీఆర్పీ స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మోహన్‌రావు మాట్లాడుతూ రైళ్లలో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని చెప్పారు. రైల్వే పట్టాలపై గుర్తు తెలియని మృతదేహాలు పడి ఉన్నప్పుడు వెంటనే ఆధారాలు సేకరించి వారివారి బంధువులకు తెలియజేసే విధంగా దృష్టి సారించాలన్నారు. ఈయన వెంట రైల్వే డీఎస్పీ జి.బి.ఆర్.మధుసూదనరావు, సీఐ ఎ.దాశరథి, ఎస్ఐ చెల్లూరు శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది ఉన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న రైల్వే ఎస్పీ మోహనరావు

## 'మోడల్' స్కూల్‌లో ఆకట్టుకున్న విన్యాసాలు

**భోగాపురం:**మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్ సంధ్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. తెలుగు భాషను మించినది లేదన్నారు. వృత్తిరీత్యా ఎన్ని భాషలు మాట్లాడుతున్నప్పటికీ మన భావోద్వేగాలను మాతృభాషలోనే వెల్లడిస్తామన్నారు. మాతృభాష చాలా గొప్పదన్నారు. తెలుగు భాషకు సంబంధించి అధ్యాపకులు, ఉపాధ్యాయులు తెలుగు భాషా విశిష్టత, వ్యవహారిక భాషోద్యమంలో గిడుగు పాత్రను వివరించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ హాకీ క్రీడలో దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చారన్నారు. విద్యార్థులు ధ్యాన్‌చంద్‌ను ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, గేయాలాపన, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న విద్యార్థుల విన్యాసం

## సమాచారం

### 1న వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

**కొత్తవలస:** జిల్లా స్థాయి వాలీబాల్ సబ్‌జూనియర్ క్రీడాకారుల (బాలికలు, బాలురు) ఎంపిక సెప్టెంబరు ఒకటో తేదీ ఉదయం పది గంటలకు విజయనగరంలోని రాజీవ్ స్టేడియంలో నిర్వహించనున్నట్టు జిల్లా వాలీబాల్ అసోసేయేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు, చైర్మన్ గొరపల్లి జయప్రకాష్‌లు తెలిపారు. 2002 జనవరి ఒకటి తరువాత జన్మించిన వారు మాత్రమే హాజరుకావాలన్నారు. ఎంపికైన వారిని సెప్టెంబరు 23 నుంచి 26వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలకు పంపిస్తామన్నారు. తమతో పాటు అసోసియేషన్ కార్యదర్శి భగవాన్ దాస్, రాష్ట్ర వాలీబాల్ ఎంపిక కమిటీ సభ్యుడు గవర సూరిబాబులు ఎంపిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

### నేడు జిల్లా శిష్టకరణ సంఘ సమావేశం

**దాసన్నపేట:**దాసన్నపేట సమీపంలోని ఉపాధ్యాయ సంఘ భవనంలో బుధవారం సాయంత్రం 5గంటలకు జిల్లా శిష్టకరణాల సంఘ కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి ఎం.పి.జి.ఈశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశానికి కార్యవర్గ సభ్యులు, సంఘ ప్రతినిధులు, హాజరుకావాలని కోరారు. వచ్చేనెల 15న విశాఖపట్నంలోని నిర్వహించే జాతీయ సమావేశంలో చర్చించవలసిన అంశాలపై కార్యాచరణ రూపొందిస్తామన్నారు. .

### నలుగురు తహసీల్దార్లకు పదోన్నతి

**కలెక్టరేట్:**జిల్లాలో పని చేస్తున్న నలుగురు తహసీల్దార్లకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భోగాపురం తహసీల్దార్‌గా పని చేస్తున్న డి.లక్ష్మారెడ్డి, మెంటాడ తహసీల్దార్ జి.జయదేవి, సీతానగరం తహసీల్దార్ ఎం.ఆప్పారావు, బొబ్బిలి తహసీల్దార్ కె.సూర్యనారాయణలకు పదోన్నతి కల్పించారు. వీరికి ఇంకా పోస్టింగ్ కేటాయించాల్సివుంది.

### మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అనిత

**కలెక్టరేట్:** విజయనగరం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా అనితకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టరు వివేక్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టరుగా ఆమె బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈమె జిల్లా పర్యాటక శాఖ ఇన్‌చార్జి అధికారిగా కూడా విధులు నిర్వహిస్తున్నారు.

# ‘భిన్న పరీక్ష’ నుంచి కచ్చితంగా ప్రశ్నలు

## భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్‌ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది.

ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

### మోడల్ - 1
### పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

**టైప్ 1:** నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

**టైప్ 2:** నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

### టైప్ 1

**1.** ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: **సి**
**వివరణ:** భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

**2.** ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: **బి**
**వివరణ:** నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

**3.** ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: **ఎ**
**వివరణ:** ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

**4.** ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: **డి**
**వివరణ:** పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

**5.** ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: **డి**
**వివరణ:** గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

**6.** ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: **ఎ**
**వివరణ:** బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

**7.** ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: **బి**
**వివరణ:** జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

**8.** ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: **సి**
**వివరణ:** నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

**9.** ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: **ఎ**
**వివరణ:** గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

**10.** ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: **ఎ**



Panditi Meenakshi Pavan
Senior Faculty

**Competitive Exams Special**

**వివరణ:** ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

**11.** ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: **సి**
**వివరణ:** తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

**12.** ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: **డి**
**వివరణ:** కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

**13.** ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: **డి**
**వివరణ:** లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

**14.** ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: **బి**
**వివరణ:** గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

**15.** ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: **డి**
**వివరణ:** వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

**16.** ఎ) బైకాల్ బి) థాల్ సి) చిలక డి) థార్
సమాధానం: **డి**
**వివరణ:** థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

**17.** ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: **సి**
**వివరణ:** ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

**18.** ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: **బి**
**వివరణ:** ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

**19.** ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటూమినస్
సమాధానం: **ఎ**
**వివరణ:** గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

**20.** ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: **డి**
**వివరణ:** డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

**21.** ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: **బి**
**వివరణ:** వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

**22.** ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: **ఎ**
**వివరణ:** నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

**23.** ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: **సి**
**వివరణ:** మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

**24.** ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: **డి**
**వివరణ:** బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్ర ప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

**25.** ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: **ఎ**
**వివరణ:** నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

**26.** ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: **ఎ**
**వివరణ:** కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

**27.** ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: **సి**
**వివరణ:** కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

**28.** ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: **డి**
**వివరణ:** ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

**29.** ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: **సి**
**వివరణ:** అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

**30.** ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: **డి**
**వివరణ:** గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

**31.** ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: **సి**
**వివరణ:** బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

**32.** ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: **డి**
**వివరణ:** ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

**33.** ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: **ఎ**
**వివరణ:** గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

**34.** ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: **బి**
**వివరణ:** బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

**35.** ఎ) దాద్రానగర్ హవేలి బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: **డి**
**వివరణ:** జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

**36.** ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: **సి**
**వివరణ:** బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

**37.** ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజిల్ డి) తాన్‌సేన్
సమాధానం: **బి**
**వివరణ:** ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

**38.** ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: **బి**
**వివరణ:** అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

**39.** ఎ) మెరీనా బి) జెర్సొప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: **ఎ**
**వివరణ:** మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్.

## JOBS ఉద్యోగాలు

### సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

**మొత్తం ఖాళీలు: 67**

**ప్రాజెక్ట్ మేనేజర్** ఖాళీలు: 2
**అర్హత:** బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
**వయసు:** 50 ఏళ్లు మించరాదు

**ప్రాజెక్ట్ ఇంజనీర్** ఖాళీలు: 65
**అర్హత:** బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
**వయసు:** 37 ఏళ్లు మించరాదు
**ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
**ఆన్‌లైన్ టెస్ట్:** సెప్టెంబరు 23
**దరఖాస్తు ఫీజు:** రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవా త హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 18
**చిరునామా:** Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
**వెబ్‌సైట్:** http://cdac.in/

### ఎస్‌ఎస్‌సి ఎస్‌ఆర్

స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్‌ఎస్‌సి ఎస్‌ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

**మొత్తం ఖాళీలు: 66**

**టెక్నికల్ సూపరింటెండెంట్** ఖాళీలు: 3
**అర్హత:** డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
**వయసు:** 30 ఏళ్లు మించరాదు.

**వర్క్‌షాప్ సూపరింటెండెంట్** ఖాళీలు: 1
**అర్హత:** బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
**వయసు:** 30 ఏళ్లు మించరాదు.

**సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్)** ఖాళీలు: 1
**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
**వయసు:** 30 ఏళ్లు మించరాదు.

**మెడికల్ అటెండెంట్** ఖాళీలు: 34
**అర్హత:** 10వ తరగతి
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**లేడీ మెడికల్ అటెండెంట్** ఖాళీలు: 15
**అర్హత:** 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**కన్జర్వేషన్ అసిస్టెంట్** ఖాళీలు: 2
**అర్హత:** 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్** ఖాళీలు: 9
**అర్హత:** 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
**వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

**ఎవల్యూషన్ అసిస్టెంట్** ఖాళీలు: 1
**అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
**వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
**ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 24
**దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ:** అక్టోబరు 4
**వెబ్‌సైట్:** www.sscsr.gov.in

# రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

## భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్
2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్ డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి
5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ
6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ
7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ
8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్టోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ
9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా
10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావు డి) కె.ఎం.మున్షీ
11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్
12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ
13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు
14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి
15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి
17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు
18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు
19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్



కొమ్ము సుందర్‌రాజు
పాలిటీ ఫ్యాకల్టీ

## జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ
21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనపుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు
22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ
23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు
24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బెకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వేవెల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ
25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత
26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ
27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం
28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా
29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ
30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్ 5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4
31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ
32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ట సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది
33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన తొలి వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్‌సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు
34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ
35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్
36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ
37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్
38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ
39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి
40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్
41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి
42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్
43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్
44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17
45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్
46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా
47. జాకీర్ హుస్సేన్ మరణానంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా
48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు
49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర
50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

**సమాధానాలు**

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1) సి | 8) బి | 15) ఎ | 24) ఎ | 33) సి | 42) బి |
| 2) ఎ | 9) సి | 16) బి | 25) సి | 34) ఎ | 43) సి |
| 3) ఎ | 10) బి | 17) సి | 26) బి | 35) డి | 44) బి |
| 4) డి | 11) ఎ | 18) బి | 27) ఎ | 36) సి | 45) డి |
| 5) ఎ | 12) సి | 19) సి | 28) డి | 37) బి | 46) ఎ |
| 6) సి | 13) సి | 20) డి | 29) డి | 38) ఎ | 47) బి |
| 7) బి | 14) డి | 21) ఎ | 30) ఎ | 39) సి | 48) సి |
| | | 22) సి | 31) సి | 40) డి | 49) ఎ |
| | | 23) ఎ | 32) బి | 41) సి | 50) సి |

## అడ్మిషన్స్

### జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.
**పీజీ కోర్సులు:** ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పిహెచ్‌డి/ ఎమ్మెస్సీ - పిహెచ్‌డి డ్యూయెల్ డిగ్రీ
**టెస్ట్ పేపర్స్ - కోడ్:** బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పిహెచ్)
**అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
**జామ్ 2018 జరిగే తేదీ:** 2018 ఫిబ్రవరి 11
**ఫలితాల విడుదల:** 2018 మార్చి 20
**ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 5
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
**వెబ్‌సైట్:** www.jam.iitb.ac.in

### ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
**కోర్సు వ్యవధి:** ఏడాది
**అర్హత:** 50 శాతం మార్కులతో బిఎస్సీ/ బిఫార్మసీ/ బిఎస్సీ - అగ్రి/ ఎంబిబిఎస్/ బివిఎస్సీ/బిడిఎస్/ బిహెచ్ఎంఎస్/ బిఎఎంఎస్/ బియుఎంఎస్/ బిఇ/ బిటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసిఏ/ పిహెచ్‌డి పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
**ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
**వెబ్‌సైట్:** www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net



కుంకుమ పూజలు చేస్తున్న దృశ్యం

## గోర్జిపాడులో కుంకుమ పూజలు

**గోర్జిపాడు (కురుపాం రూరల్):** మండలంలో గణేష్ నవరాత్రి ఉత్స వాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం మొండెంఖల్ పంచా యతీ పరిధిలోని గోర్జిపాడులో 80 మంది మహిళలచే ప్రత్యేక కుంకుమ పూజలను పురోహితుడు బాలకృష్ణమిశ్రో చేయించారు. గ్రామస్థులు మండల సింహాచలం, శివ్యాల యోగులు, ఉపేంద్ర, శ్రీహరి, శంకరరావు పూజా సామగ్రిని ఏర్పాటు చేశారు.

# చెరువులు,రిజర్వాయర్లలో జల కళ

### ● మండంలో పూర్తయిన ఉభాలు

**కురుపాం రూరల్:** ఆది, సోమవారాల్లో మండలంలో వర్షాలు ముంచెత్తాయి. మంగళవారం వర్షం తగ్గుముఖం పట్టింది. ఆదివారం 158.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, సోమవారం 25.8 మిల్లి మీటర్ల నమోదయ్యింది. దీంతో ఆగస్టు సరాసరి వర్షపాతం 213 మిల్లీ మీటర్లు కాగా, ఇప్పటికే 430 మిల్లీమీటర్ల నమోదయ్యింది. వర్షాలు అధికంగా కురవడంతో మండలంలోని చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. గత కొన్ని సంవత్సరాలగా ఉభాలు కాని పొలాల్లో సైతం నాట్లు పడ్డాయి. పంట నష్టంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని రెవెన్యూ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా తిత్తిరి పంచాయతీ ముతురునాయుడుగూడలో ఆది, సోమవారాల్లో కురిసిన భారీ వర్షాలకు భూమి కొంత మేర కృంగిందని తిత్తిరి మాజీ ప్రాదేశిక సభ్యుడు బిడ్డిక పాల్వర్జున తెలిపారు. ఏమైనా వర్షాలకు రైతులు హర్షం వెలిబుచ్చారు.

### నిండుకుండల్లా చెరువులు

**గుమ్మలక్ష్మీపురం:** మండలంలో 25.4 మిల్లీ మీటర్ల వర్షం పడింది. ఈ వర్షానికి మండలంలోని 86 చెరువులు నిండు కుండల్లా మారాయి. చెరువులకు ఎక్కడా గండ్లు పడలేదు. చెక్‌డ్యాములు, గెడ్డలు, వాగులు పెద్ద ఎత్తున నీరు చేరింది. ఏజెన్సీ ప్రాంతం ఎత్తైన ప్రాంత మైనందున ఈ నీరంతా జియ్యమ్మవలస మండలం బట్టిగెడ్డ (రావాడ డ్యాము)కు చేరుతుంది. రైతులు చెరువుల్లో చేరిన నీటిని పంటలకు వాడుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.శంకరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. మండలంలో చెరువులు, రోడ్లుకు గండ్లు పడలేదని తహసీల్దార్ రమణ తెలిపారు.



నిండుకుండలా దర్శనమిస్తున్న ఎల్విన్‌పేట చెరువు

## చిన్నారులకు చిరు వ్యాపారి వితరణ

**చిలకాం (గరుగుబిల్లి):** కుటుంబ పోషణకు చిరు వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తి ఉదారత చూపించారు. పార్వతీపురంలో పానీ పూరీ వ్యాపారం చేస్తున్న నల్ల కోటే శ్వరరావు చిలకాం పాఠశాలలో 30 మంది విద్యార్థులకు పంపిణీ చెయ్యమని ప్రధానోపాధ్యాయుడుకు మంగళవారం బ్యాగ్‌లను అందించారు. అలాగే ప్రధానోపాధ్యాయునికి ఒక కుర్చీ సమకూర్చారు. పాఠశాలలో ఫర్నీచర్‌కు కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి సత్యనారాయణ రూ. 5 వేలు అందించారు. పాఠశాలలకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటువంటి తరుణంలో దాతలు ముందుకు రావడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న కోటేశ్వరరావు

## పత్తిలో సూక్ష్మధాతు లోపం

**అనంతరాయుడుపేట(సీతానగరం):** పత్తిసాగులో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ శాఖాధికారి ఎం.ఉమామహేశ్వరనాయుడు తెలిపారు. మంగళవారం అనంతరాయుడుపేట, పణుకుపేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పత్తి పంటను పరిశీలించారు. పత్తి పంటలో సూక్ష్మధాతు లోపం ఉన్నట్టు గుర్తించినట్టు చెప్పారు. దీనివలన ఆకులు ఎర్రబడి, ఎండి రాలిపోతాయన్నారు. దీని నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను 40 నుంచి 45 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలన్నారు. ఏఈవోలు, ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

## ఉద్యానవన కళాశాలలో 20 మందికి ప్రవేశం

**ఉల్లిభద్ర (గరుగుబిల్లి):** ఉద్యానవన కళాశాలలో 20 మందికి ప్రవేశం కల్పించినట్టు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవన కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ బి.ప్రసన్నకుమార్ తెలిపారు. ఇటీవల గుంటూరులో నిర్వహించిన ఎంసెట్ కౌన్సెలింగ్‌లో 2017-18 సంవత్సరానికి 23 మందిని కేటాయించారన్నారు. రెండో కౌన్సెలింగ్‌కు 59 సీట్లు కేటాయించినట్టు చెప్పారు. డిప్లొమాలో ఉత్తీర్ణత సాధించిన 10 మందికి సెప్టెంబర్ 4లో ప్రవేశం కల్పించినట్టు చెప్పారు. ప్రస్తుతం కళాశాలలో విద్యార్థుల సంఖ్య 72 చేరుకుందన్నారు. కొత్తగా చేరిన వారికి వసతి ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆచార్య వి.గోవర్ధనరావు, డాక్టర్ హిమబిందు పాల్గొన్నారు.



విద్యార్థుల ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న దృశ్యం

## కేదారిపురంలో వినాయక నిమజ్జనం

**గుమ్మలక్ష్మీపురం:** ఒడిశా సరిహద్దు గ్రామమైన కేదారిపురంలో వినాయకుని నిమజ్జన అత్యంత వైభవంగా చేశారు ఈ కార్యక్రమం అనంతరం అన్నసమారాధాన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్యామ్‌సుందరరావు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

### కృష్ణపల్లిలో అన్నసమారాధన

**పార్వతీపురం:** కృష్ణపల్లిలో అన్నసమారాధన నిర్వహించారు. మంగళవారం గ్రామంలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రసాదం స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

## ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి చర్యలు

**శ్రీరంగరాజపురం (బలిజిపేట):** నారం నాయుడువలస పంచాయతీ పరిధిలోని శ్రీరంగరాజపురంలో ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్టు ఎమ్మెల్యే బి.చిరంజీవులు, ఎమ్మెల్సీ జగదీష్ హామీ ఇచ్చారు. మంగళవారం వారు శ్రీరంగరాజపురంలో ఫ్లోరైడ్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ తాగునీటి సమస్య కారణంగా ఫ్లోరైడ్ సమస్య రావడం దురదృష్టకరమన్నారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫ్లోరైడ్ బాధితులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని గళావల్లి పీహెచ్‌సీ డాక్టర్‌లను ఆదేశించారు. వారివెంట జడ్పీటీసీ సభ్యురాలు మండల రాధ, పి.సత్యనారాయణ రాజు, మాజీ ఎంపీపీ శంబాన సత్యంనాయుడు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు ఉన్నారు.



శ్రీరంగరాజపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

## తెలుగుదేశం పార్టీకి తిరుగులేదు

**చినమేరంగి (జియ్యమ్మవలస):** రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీకి తిరుగులేదని, దీనికి నంద్యాల ఉప ఎన్నికలే నిదర్శనమని తెలుగు నాయకులు అన్నారు. మండల కన్వీనర్ బంకురు శంకరజోగినాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు స్వగృహంలో విలేఖరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ బలగ వెంకటరమణ, తుంబలి సర్పంచ్ పూడి సీతారాం, చినమేరంగి పార్టీ అధ్యక్షుడు బోనం నరసింహారావు పాల్గొన్నారు.

### గెలుపునకు దోహదం పథకాలే

**గరుగుబిల్లి :** ప్రభుత్వ పథకాలే గెలుపుకు దోహదపడ్డాయని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు డి. ధనుంజయరావు అన్నారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రానున్న కాలంలో కూడా రాష్ట్రంలో పూర్తి స్థాయి మెజార్టీని ప్రజలు కట్టబెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అక్కేన మధుసూదనరావు, గొట్టాపు తేజేశ్వరరావు, అంబటి గౌరునాయుడు పాల్గొన్నారు.

### మిఠాయిల పంపిణీ

**కురుపాం:** నంద్యాల ఉప ఎన్నికలో తెలుగుదేశం విజయం సాధించినందుకు కురుపాంలో టీడీపీ కార్యకర్తలు బాణసంచా కాల్చారు. మంగళవారం పార్టీ మండల కన్వీనర్ అంధవరపు కోటేశ్వరరావు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు షేక్ సాదు ల్లాబాషా, ఆసుపత్రి కమిటీ చైర్మన్ బండి రాజు, పంచాయతీ ఉపాధ్యక్షుడు కె.గౌరీశంకరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డీఆర్ డిపోల డీలర్లకు నియామక పత్రాలు

**గుమ్మలక్ష్మీపురం:** గుమ్మలక్ష్మీపురం గిరిజన సహకార సంస్థ పరిధిలోని వివిధ డీఆర్ డిపోల డీలర్లుగా ఎంపికైన వారికి జీసీసీ మేనేజర్ రమణ మంగళవారం నియామక పత్రాలు అందించారు. ఇరిడి, మండ, ఉదయపురం డిపోల డీలర్లకు ఆర్డరు కాపీలు అందించారు. వీరి నుంచి రూ. 50 వేలు చొప్పున సెక్యూరిటీ డిపాజిట్ తీసుకుని ఆర్డర్లు ఇచ్చినట్టు మేనేజర్ రమణ తెలిపారు. ఇదిలాఉండగా జీసీసీ డీలర్ ఆధ్వర్యంలో గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలకు చెందిన గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు 972 వంట గ్యాస్ కనెక్షన్లు, సిలెండర్లు అందజేశామన్నారు. పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వారి ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలకు క్రమం తప్పకుండా గ్యాస్ పంపిణీ చేశామన్నారు.



నియామక పత్రం అందిస్తున్న జీసీసీ మేనేజర్ రమణ

## సేంద్రియ ఎరువుతో మంచి పంటలు

**కురుపాం:** రైతులు సేంద్రియ ఎరువులతో ఆరోగ్యకరమైన పంటలు పండించి అధిక దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారి జి.సూర్యప్రకాష్ అన్నారు. మంగళవారం దురిబిలిలో గిరిజన రైతు పువ్వల పత్తి ఏర్పాటు చేసిన సేంద్రియ ఎరువులు, కషాయాల షాపును ఏవో సూర్యప్రకాష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతులు, సీఆర్‌పీలు, వ్యవసా యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు సౌకర్యంగా ఉండేలా చర్యలు

**గరుగుబిల్లి:** రైతులకు రెవెన్యూ పరంగా సౌకర్యాలు కల్పనకు చర్యలు చేపడుతున్నట్టు మండల తహసీల్దార్ సీహెచ్ రాధాకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో రైతులు కొత్త పాస్ పుస్తకాల మంజూరకు అధిక సమయం పెట్టేదని, ప్రస్తుతం ఈ సమస్య లేదన్నారు. గతంలో పాస్ పుస్తకం రావాలంటే 45 రోజులు గడువు ఉండేదని, నూతన విధానంలో 15 నిమిషాల్లో పాస్ పుస్తకం అందుతుందన్నారు. మ్యూటేషన్ పెట్టుకుని, రూ. 25 చెల్లిస్తే నిమిషాల్లో అందుతుందన్నారు. ప్రస్తుతం రైతులు బ్యాంకు రుణాలు పొందేందుకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఉండేందుకు దృష్టి సారిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు మంగమ్మ, వెంకటరావు, అధికారి గణేశ్వరరావులు పాల్గొన్నారు.



పట్టాదార్ పాస్ పుస్తకం అందిస్తున్న తహసీల్దార్

## ఘనంగా కొత్తపోలమ్మ వారాలు

**పార్వతీపురం టౌన్:** కొత్తవలసలో కొత్తపోలమ్మ అమ్మవారి వారాలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఘటాలు ఊరేగించారు. స్థానిక కౌన్సిలర్లు చొక్కాపు వెంకటరమణ,వెంకటరావు,పెద్దలఆధ్వర్యంలో ఘటాల ఊరేగించారు.

### ఎల్ఎన్ పురంలో బంగారమ్మ ఉత్సవాలు

ఎల్ఎన్ పురంలో మంగళవారం బంగారమ్మ అమ్మవారి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బంగారమ్మ ఘటాలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్థానిక పెద్దలు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులను చెల్లించుకున్నారు.

# దినఫలాలు

**అదృష్టసంఖ్యలు : 3, 5**

**మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20):** ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.

**వృషభరాశి: (ఏప్రిల్21-మే20):** పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.

**మిథునరాశి: (మే21-జూన్21):** ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.

**కర్కాటకరాశి: (జూన్22-జూలై23):** వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.

**సింహరాశి: (జూలై24-ఆగస్ట్23):** పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.

**కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23):** బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.

**తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23):** సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.

**వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22):** షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.

**ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21):** సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.

**మకరరాశి(డిసెంబర్22-జనవరి21):** దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.

**కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18):** బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.

**మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20):** ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జన సంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

# మొదటి పేజీ తరువాయి

## ఆనందం.. అ'ధనం'

విడిచిపెట్టారు. ఆ ఇళ్లు వివిధ దశల్లో నిలిచిపోయాయి. బేస్ మెంట్ లెవల్, రూఫ్ లెవల్, శ్లాబ్ లెవల్‌లో ఆగిపోయాయి. ఆ ఇళ్లకు ఇప్పుడు రూ.25 వేల వంతున విడుదల చేసింది. ఇప్పటికే లబ్ధిదారుల వివరాలు గృహ నిర్మాణ శాఖ వద్ద ఉన్నాయి. జిల్లాలో 22,232 మంది లబ్ధిదారులు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. గృహ నిర్మాణాలకు ప్రభుత్వం విడదల చేసిన నిధులు వారి వ్యక్తిగత ఖాతాకు జమవుతాయి. తక్షణమే వీరంతా పనులు ప్రారంభించాల్సి ఉంది. వీటిని గృహనిర్మాణ శాఖ అధికారులు పర్యవేక్షిస్తారు.

ఇదే విషయం గృహ నిర్మాణ శాఖ పీడీ రమణమూర్తి వద్ద ప్రస్తావించగా జిల్లాలో ఇందిరమ్మ పథకం కింద ఇళ్ల నిర్మాణం చేపట్టి మధ్యలో నిలిచిపోయనవి 22,232 ఇళ్లు ఉన్నాయన్నారు. వీటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని చెప్పారు. వాటిని సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న ఇల్లు

## తేల్చుకోం'ఢీ'

మరికొన్ని మండలాల్లో ఎంపీపీలతో జెంటిల్‌మెన్ ఒప్పందాలను గతంలో చేసుకున్నారు. ఆ ప్రకారం వారు కొత్తవారికి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. కానీ అందుకు ససేమిరా అనడంతో సమస్య ఉత్పన్నమైంది. ఇది కొంతకాలంగా జిల్లా పార్టీ స్థాయిలో నలుగుతోంది. సమస్యను కొలిక్కితేలేక పోవటం.. చెప్పిన మాటను ఎంపీపీలు వినకపోవటం జరుగుతోంది. మాట వినని వారిపై జిల్లా పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేకపోతోంది. ఇప్పటికే జంటిల్‌మెన్ ఒప్పందాలపై కేంద్ర మంత్రి అశోక్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ మాంత్రి మృణాళిని, ప్రస్తుత జిల్లా మంత్రి సుజయ్ కృష్ణ రంగారావు అనేక విడతల్లో కుస్తీ పట్టారు. మూడు పార్యాయాలు ముఖ్య నేతలతో చర్చించారు. రెండు పర్యాయాలు జిల్లా సమన్వయ కమిటీ సమావేశాల్లో ప్రస్తావించారు. ప్రస్తుత ఎంపీపీలు రాజీనామా చేసి ఒప్పందం ప్రకారం అవకాశం కల్పించాలని నిర్ణయం కూడా తీసుకున్నారు. నాయకులు ససేమిరా అనడంతో కథ మళ్లీ మొదటికి వచ్చింది.

***మండల స్థాయిల్లోనే..***

మండల పరిషత్‌ల ఎన్నికలు జరిగేటపుడు జిల్లా పార్టీకి ఎటువంటి ప్రమేయం లేకుండానే జెంటిల్ మెన్ ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని మండల స్థాయిల్లో లేదా ఎమ్మెల్యేల స్థాయిల్లోనే సమస్యను పరిష్కరించుకోవాలని మాజీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ స్పష్టం చేశారు. దీనికి కేంద్ర మంత్రి అశోక్ గజపతిరాజు కూడా మద్దతు పలికారు. నిర్ణయం ప్రకటించినా మండల స్థాయిలో మీరే అమలు చేయించు కోవాలని స్పష్టం చేశారు. ఏది న్యాయమో ఆ విధంగా నిర్ణయం తీసుకున్నామని దీనిపై నిర్ణయాలు తీసుకునే బాధ్యత మండల స్థాయిల్లోనే నిర్ణయించుకోవాలని బొబ్బిలిలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. దీంతో మండల స్థాయిల్లోని ఆశావహులైన వారు నిరుత్సాహంలో పడ్డారు.

## మురుగులో గంజాయి గుట్టు

ఈ విధంగా చేసి ఉంటారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఒడిశా రాష్ట్రం నుంచి ఇబ్బడిముబ్బడిగా గంజాయి అక్రమ రవాణా సాగుతోంది. అడ్డుకునేందుకు పోలీసులు 26వ నంబరు జాతీయ రహదారిలో పి.కోనవలస, జీగిరాం, కొట్టక్కి ప్రాంతాల్లో ఈమధ్య కాలంలో చురుగ్గా వాహన తనిఖీలు చేస్తున్నారు. ఒడిశా నుంచి గంజాయిని తీసుకువస్తున్న స్మగ్లర్లు పట్టణంలోకి వచ్చాక తనిఖీలు జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్నారు. ప్రధాన రహదారి కాకుండా పెదకోమటిపేట మీదుగా కోటవీధి చేరుకుని అక్కడ మురుగు కాలువలో గంజాయి ప్యాకెట్లను పడేసిఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

***స్పష్టత లేని సీసీ పుటేజీ..***

కోటవీధి మురుగుకాలువలో గంజాయి ఎవరు వేశారు? ఎప్పుడు వేశారు? అనే కోణంలో పోలీసులు సీసీ కెమెరాల పుటేజీ పరిశీలించారు. కోటవీధి అర్బన్ బ్యాంకు సమీపంలో పోలీసులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని స్మగ్లర్లు గుర్తించలేదు. కెమెరాలకు 30అడుగుల దూరంలో ఉన్న మురుగుకాలువలో గంజాయి ప్యాకెట్లను పడేశారు. సీసీ పుటేజీ పరిశీలించిన పోలీసులు సోమవారం రాత్రి 9 గంటల నుంచి మంగళవారం తెల్లవారు జాము ఐదుగంటల వరకు ఒక్క లారీ మాత్రమే అక్కడ నిలిపి ఉన్నట్లు గుర్తించారు. వేకువ జామున చీకటిగా ఉండటం తో పాటు వర్షం పడటంతో లారీ, కాలువలో గంజాయి ప్యాకెట్లు పడేసిన వ్యక్తి స్పష్టంగా కనిపించలేదు. కాగా కారు లేదా ఆటోలో ఇప్పటి వరకు గంజాయి అక్రమ రవాణా సాగింది. పోలీసుల తనిఖీలలో ఎక్కువగా ఆ వాహనాలే పట్టుబడ్డాయి. తాజాగా గంజాయి ప్యాకెట్లను లారీలో తీసుకువచ్చి కోటవీధి కాలువలో వేసినట్లు సీసీ పుటేజీ బట్టి స్పష్టమవుతోంది.

***ఇదే చోట గతంలో దొంగనోట్లు..***

కోటవీధి కాలువ, పేరసాగరం చెరువులో గతంలో దొంగనోట్లను చించేసి పారవేసినట్లు ప్రచారం జరిగింది. దొంగనోట్లు మురుగునీటిలో కొట్టుకుపోవడంతో అప్పట్లో ఆ విషయం కనుమరుగైంది. వివాహేతర సంబంధాలతో బిడ్డలను కని పిల్లలను కోటవీధి కాలువలోనే పారేసిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం అదే కాలువను గంజాయి ప్యాకెట్లు పారేయడానికి కూడా స్మగ్లర్లు వినియోగించడం గమనార్హం. నిత్యం రద్దీగా ఉన్న కోటవీధి దుర్గగుడిప్రాంతంలో ఎప్పటికప్పుడు ఇలా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుండటంపై ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న పోలీసులు

## రాష్ట్రస్థాయి పోటీలకు ఉల్లిభద్ర విద్యార్థులు

**ఉల్లిభద్ర (గరుగుబిల్లి):** మండలంలోని ఉల్లిభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు కె.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నలుగురు విద్యార్థులు కత్తి యుద్ధం, ఒకరు యోగా పోటీల్లో జిల్లాస్థాయిలో విజేతలుగా నిలిచారన్నారు. వీరిని గుంటూరులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు సమాచారం అందిందన్నారు. మరికొద్ది రోజుల్లో నిర్వహించే పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన వారిని ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు బోను సత్యనారాయణ, పీఈటీ చిట్టిబాటు తదితరులు అభినందించారు.



## పురుష ఎంపీహెచ్‌ల ఎంపిక జాబితా సిద్ధం

**రింగురోడ్డు:** పురుష ఎంపీహెచ్‌ఎల కాంట్రాక్టు నియామకాలకు సంబంధించి 60 మందిని ఎంపిక చేసి జాబితా తయారు చేశామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.పద్మజ తెలిపారు. ప్రభుత్వ జీవో ప్రకారం జిల్లా సెలక్షన్ కమిటీ ఆమోదంతో జాబితా తయారు చేశామన్నారు. ఈ జాబితా జిల్లా కలెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయాల నోటీస్ బోర్డులో అతికించినట్టు తెలిపారు.



## పొంగి ప్రవహిస్తున్న సువర్ణముఖి

**సీతానగరం:** నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సువర్ణముఖి నది పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు కొండ, వాగు, గెడ్డల నుంచి వస్తున్న నీరు నదిలో కలుస్తోంది. దీంతో నదికి రెండు వైపులా నీరు పొంగింది. ఈ ఏడాది నదిలో నీటిమట్టం ఇంతగా పెరిగి ప్రవహించడం ఇదే మొదటిసారి. నదిలో కొత్తనీరు ప్రవహించడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్తున్నారు.

### చికెన్ ధరలు

| | బాయిలర్ | వెన్‌కాబ్ |
|---|---|---|
| రిటైల్‌ధర | 92 | 83 |
| విత్‌స్కిన్ | 154 | 137 |
| స్కిన్‌లెస్ | 164 | 162 |

### కోడి గుడ్లు (నెక్)

| | |
|---|---|
| విశాఖపట్నం | రూ.360 |
| విజయనగరం | రూ.364 |
| శ్రీకాకుళం | రూ.364 |

# తాతయ్య కోసం.. ఓ యాప్




**ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.**




కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంత్, క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.




'నేను ఎంతోమంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'

**- కావ్య**

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'

- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

## టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

## నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో
**డాక్టర్:** ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?
**రోగి: (పర్సు తడుముకుంటూ):** హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

## సూక్తి


పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

## రంగులు వేయండి



## ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



## చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

## మీకు తెలుసా?




అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

## చుక్కలు కలపండి




## దారి కనుక్కోండి



## పదాలు గుర్తించండి

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| shoe | x | k | c | o | l | b |
| duck | l | n | e | e | r | g |
| doll | l | g | l | o | b | e |
| globe | o | q | n | c | w | c |
| block | d | n | s | h | o | e |
| green | u | w | k | c | u | d |

## జంబ్లింగ్ వర్డ్స్

1. BWLO ▶ ...................
2. LDOR ▶ ...................
3. ALPM ▶ ...................
4. TLAL ▶ ...................

## జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ...................
2. అన్నతంత్యు ▶ ...................
3. నీఅతివి ▶ ...................
4. నంవమార్త ▶ ...................

## సమాధానాలు

**చెప్పగలరా?:** జాతీయం
**జంతర్‌మంతర్ :** 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
**జంబ్లింగ్ వర్డ్స్ :** 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL



రాష్ట్రపతికి పుష్పగుచ్ఛం ఇస్తున్న అశోక్‌గజపతి రాజు

## రాష్ట్రపతిని కలిసిన కేంద్ర మంత్రి అశోక్

భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు మంగళవారం కలిశారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌కు వెళ్లి మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పౌర విమానయాన శాఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, అభివృద్ధిపై రాష్ట్రపతికి మంత్రి వివరించారు.

- విజయనగరం-ఆంధ్రజ్యోతి

## బీజేపాలెంలో కలెక్టర్ పర్యటన

**గరివిడి :** మండలం కొండశంభాం పంచాయతీ పరిధిలోని బీజేపాలెం గ్రామంలో కలెక్టర్ వివేక్‌యాదవ్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ గృహనిర్మాణంలో భాగంగా మంజూరైన 5 ఇళ్లు, పీఎంఎవై పథకంలో మంజూరైన 11 ఇళ్ల నిర్మాణాలు ఏ విధంగా జరుగుతున్నాయో లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఈయన వెంట హౌసింగ్ పీడీ రమణమూర్తి, ఈఈ రఘురాం, ఏఈ మెరుపుల వెంకటరమణ, ఎంపీపీ పైల సింహాచలం, మాజీ ఎంపీపీ పైల బలరాం, టీడీపీ మండల నేతలు సారిపాక సురేష్ కుమార్, మహంతి రమణమూర్తి, వెంకునాయుడులు పాల్గొన్నారు.



అధికారుల నుంచి ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్



బోటుపై కాటేజికి వెళ్తున్న జేసీ లఠ్కర్

## 'తాటిపూడి' పరిశీలన

**గంట్యాడ :** తాటిపూడి పర్యాటక ప్రాంతాన్ని జాయింట్ కలెక్టర్ లఠ్కర్ మంగళవారం పరిశీలించారు. ఏకో టూరిజం అధ్వర్యంలో ఉన్న ఈ కాటేజీలకు బోటుపై వెళ్లారు. అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఎస్‌డీపీ మంజూరు చేసిన నిధులతో ఏ మేరకు పనులు చేపట్టారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాటేజికి వెళ్లే రోడ్డును పరిశీలించారు. ఈయనతో పాటు తహసీల్దార్ నీలకంఠరావు, ఆర్ఐ కళ్యాణ్ ఉన్నారు.

## త్వరితగతిన హెడ్‌వాటర్ పనులు

### పబ్లిక్ హెల్త్ ఈఈ గణపతిరావు

**బొబ్బిలి:** జిల్లాలోని బొబ్బిలి, పార్వతీపురం, విజయనగరం, గజపతినగరంలో హెడ్‌వాటర్ వర్క్స్‌కు సంబంధించిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఈఈ గణపతిరావు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం బొబ్బిలి వచ్చిన ఆయన మున్సిపల్ వాటర్ సప్లై పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురానికి రూ. 2కోట్లు, బొబ్బిలికి రూ.2కోట్లు, నెల్లిమర్లకి రూ.1 కోటి, విజయనగరానికి రూ.42 కోట్లతో హెడ్ వాటర్ వర్క్స్‌లో వివిధ రకాల పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇప్పటికే ఈ నిధులు ఆయా మున్సిపాల్టీలకు విడుదల చేసినా పనులు ప్రారంభించలేదని ఆయన తెలిపారు. త్వరితగతిన పనులు చేపట్టకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాకాలం కారణంగా హెడ్ వాటర్ వర్క్స్‌కు వాహనాలు వెళ్లేలా రోడ్లు ఉండాలని, వాటర్ ట్యాంకు పైకి ఎక్కుందుకు వీలుగా మెట్లు నిర్మించాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం ఇటీవల వాటర్ ట్యాంకు శ్లాబ్ కూలిపోవడంతో దీనికి ప్రత్యామ్నాయంగా చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. దీని కోసం రూ.10 లక్షలు ఖర్చు చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు, కమిషనర్ శంకరరావు, మున్సిపల్ డీఈ పాల్గొన్నారు.



హెడ్ వాటర్ వర్క్స్ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

## రామయ్యను దర్శించుకున్న సీఐడీ ఎస్పీ

**నెల్లిమర్ల :** ప్రసిద్ధ పుణ్య క్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానాన్ని సీఐడీ ఎస్పీ కె.నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. ఈయనకు ఆలయ అర్చకులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం సీతారాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీకి ఆలయ ప్రాశస్త్యాన్ని ప్రధాన అర్చకుడు వివరించారు.



ఎస్పీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

## తైక్వాండోలో పతకాల పంట

### విద్యార్థులకు అభినందనల వెల్లువ



గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులతో రోటరీక్లబ్ సభ్యులు

**సాలూరు:** జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో సాలూరు విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. స్కూల్ గేమ్స్‌లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించిన సీహెచ్. సాయి (ప్రభుత్వ ఉన్నతపాఠశాల), పి. జ్ఞానప్రకాష్ (సాయినాథ్ విద్యాపీఠమ్), వి.స్వాతిర్మయి (రవీంద్ర భారతి స్కూల్), బ్రాంజ్‌మెడల్ సాధించిన మనీషాను మంగళవారం రోటరీక్లబ్ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు జె. కళ్యాణ చక్రవర్తి, రవివర్మలు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు క్లబ్ తరపున సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోచ్ ఎం. జనార్థన్, సభ్యులు ఇండుపూరి వెంకటేశ్వరరావు, రవ్వా శ్యామ్, పువ్వలసిరి గోపి, జేబీ తిరుమలాచార్యులు, బుజ్జి పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు 11 మంది విద్యార్థులు

**నెల్లిమర్ల/గరివిడి :** మండలం మొయిద ఉన్నత పాఠశాలకు చెందిన 11మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈ పోటీలకు అండర్-17 ఫుట్‌బాల్‌కు సంబంధించి జె.మణికంఠ జి.వెంకటత్రినాధ, బి.బాలబాస్కర్, హాకీ పోటీలకు యడ్ల మోహనకుమార్, టేబుల్ టెన్నిస్‌కు బి.హరి, కుస్తీకి ఎస్.కార్తీక్, ఎం.జగదీష్, ఎస్.తులసీ, ఎస్.పావని, వెయిట్ లిఫ్టింగ్‌కు టి.పైడిరాజు, అండర్ 14 విభాగంలో యోగ పోటీలకు గేదెల పూర్ణవిజయ్‌లు వెళ్లనున్నారన్నారు. ఈ సందర్భంగా వారిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు తవిటయ్య ఉన్నారు. గరివిడి మండలంలోని గోదావరి దేవి సరాఫ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎన్ అనంత్ బిజిఎస్ఆర్ పట్నాయక్, బి వంశీకృష్ణలు రాష్ట్రస్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల వ్యాయామ శిక్షకుడు బీవీఎస్ఆర్ మూర్తి తెలిపారు. వీరిని ఆ పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.



నెల్లిమర్ల : హెచ్.ఎంతో రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

## తక్కువ ఖర్చుతో అధిక లాభాలు

తెర్లాం: సాగులో మెలకువలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించవచ్చని ఏఈవో శ్రీనివాసారావు అన్నారు. మండలం అరసబలగ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగు విధానాలు, విత్తనశుద్ధి, ఎరువుల వాడకంపై రైతులు తెలుసుకోవాలన్నారు. ఆధునిక పరికరాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం ఆధునిక సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ విస్తరణాధికారులు తమ్మినాయుడు, ఇందిర పాల్గొన్నారు.

## వరుస నాట్లుతో అధిక దిగుబడి

జగన్నాధపురం(బొబ్బిలి రూరల్): ఖరీఫ్‌లో రైతులు వరుస నాట్లు వేయడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని ఏవో ఎం.శ్యాంసుందరరావు తెలిపారు. మండలం జగన్నాధపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బు దుబ్బుకు 22 సెంటీమీటర్ల దూరం ఉండడం వలన పిలకలు ఎక్కువుగా పెరిగి దుబ్బు బాగా చేస్తుందన్నారు. అలాగే గాలి, వెలుతురు బాగా తగిలి దుబ్బుకు చీడపీడలు సోకవని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈవో జోగినాయుడు, రామ్మూర్తి, ఎంపీఈవోలు పాల్గొన్నారు.

## చలో విజయవాడ విజయవంతం చేయండి



గోడప్రతులను విడుదల చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: గ్రామ సహాయకుల సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 4న విజయవాడలో చేపట్టనున్న రిలే నిరాహారదీక్షలకు తరలిరావాలని ఆ సంఘం అధ్యక్షుడు పాపారావు కోరారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన గోడపత్రికను మంగళవారం విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో మాదిరిగా మన రాష్ట్రంలో వేతనాలు పెంచాలన్నారు. డీఏ, ఇంక్రిమెంట్ ఇవ్వాలన్నారు. వీఆర్ఏలకు పేస్కేల్ అమలు చేయాలన్నారు. నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా నియమించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.శంకరరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## తైక్వాండోలో విద్యార్థినుల ప్రతిభ

బొబ్బిలి: విజయనగరం ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న జరిగిన అండర్-17 తైక్వాండో పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు చప్ప జ్యోతి, బల్లంకి శ్రావణి, దేవర హేమలత వరుస స్థానాలు సాధించినట్టు కోచ్ బంకురు ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో పతకాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు ఎన్.జ్యోతి, తైక్వాండో శిక్షకురాలు పి.లలితలు, ఉపాధ్యాయులు అభినందించారు.



తైక్వాండో విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

## మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

బలిజిపేట: ఏపీసీపీఎస్ఈ ఆధ్వర్యంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెప్టెంబర్ 1న మండల కేంద్రాల్లో తలపెట్టిన మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.పైడపునాయుడు కోరారు. మంగళవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో గోడ పత్రికను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పోరాటాల ఫలితంగా దేశంలో మొదటి సారిగా గ్రాట్యుటీ కుటుంబ పింఛన్ లభించిందన్నారు. ఈ సమావేశంలో సీపీఎస్ఈ మండల అధ్యక్షుడు ధర్మారావు, ప్రధాన కార్యదర్శి శంకరరావు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ‘బహుభాషా శాస్త్రవేత్త గిడుగు రామ్మూర్తి’

నారాయణప్పవలస (బొబ్బిలి రూరల్): బాషోద్యమానికి మూలపురుషుడు, బహుభాషా శాస్త్రవేత్త గిడుగు వెంకట రామ్మూర్తి పంతులని హెచ్‌ఎం జేసీ రాజు అన్నారు. మండలం నారాయణప్పవల పాఠశాలలో గిడుగురామ్మూర్తి 155వ జయంతిని ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి అనువాదం చేసి అందులో అందాన్ని తెలియజేసిన మహానీయుడు రామ్మూర్తి పంతులని ఆయన అన్నారు. అనంతరం వేమన, సుమతి, దూర్జటి పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమణమ్మ, నాగరాజు, సూర్యనారాయణ, పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

## క్రీడలతో జాతీయ సమైఖ్యత



ద్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

నారాయణప్పవలస(బొబ్బిలి రూరల్): క్రీడలు జాతీయ సమాఖ్యతకు, మానసిక వికాసానికి దోహదం చేస్తాయని పాఠశాల హెచ్‌ఎం జెసీ రాజు అన్నారు. మండలం నారాయణప్పవలస పాఠశాల్లో హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యానచంద్ జయంతిని పురష్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసినివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హాకీ క్రీడల్లో ధ్యానచంద్‌చూపిన ప్రతిభను విద్యార్థులకు వివరించారు. ఒలింపిక్‌లో పాల్గొని భారత ప్రతిష్టను ప్రపంచానికి చాటిచెప్పిన కీర్తి ఆయనదే అన్నారు. అనంతరం విద్యార్థులకు క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పుస్తకాలు పంపిణీ

బొబ్బిలి: సినీ హీరో అక్కినేని నాగార్జున జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు ఆధ్వర్యంలో తారక రామ కాలనీలోని మున్సిపల్ పాఠశాల విద్యార్థులకు మున్సిపల్ వైస్ చైర్మన్ చోడిగంజి రమేష్‌నాయుడు చేతుల మీదుగా పుస్తకాలు, పెన్నుల పంపిణీ కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున అభిమానులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు, నాగార్జున అభిమానులు పాల్గొన్నారు.




పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్

# జన్మభూమికి సేవ చేయడం అదృష్టం

బర్లి (బలిజిపేట) పుట్టి, పెరిగిన ప్రాంతానికి సేవచే యడం ఎంతో అదృష్టమని జడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణి అన్నారు. మంగళవారం బర్లిలో తాన్న సత్యంనాయుడు, లక్ష్మమ్మ పౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్య క్రమాలకు ఆమె ముఖ్య అతిధిగా హాజరయారు. సర్పంచ్ పాలూరి సరస్వతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావే శంలో ఆమె మాట్లాడుతూ గ్రామంలో పథకాలను ప్రస్తావించారు. తాన్న రామకృష్ణ, వారి కుమారుడు చైతన్యలను అభినందించారు. గ్రామంలో తాగునీటికి రూ. 10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ జన్మభూమి స్ఫూర్తితో గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయమన్నారు. ఎమ్మెల్యే చిరంజీవులు మాట్లాడుతూ బర్లి నుంచి సుభద్ర వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. తాన్న సత్యం నాయుడు, లక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి మనుమడు తాన్న చైతన్యనాయుడు నిర్మించిన ముఖద్వారాన్ని బొబ్బిలి చిరంజీవులు ప్రారంభించారు.

బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎ మ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ శంకుస్థాపన చేశారు. గ్రామం లో సుమారు రూ. 2 లక్షలతో నిర్మించిన గ్రంథాలయాన్ని జడ్పీ చైర్‌పర్సన్ స్వాతిరాణి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గొట్టాపు వెంకటనాయుడు, సీతా నగరం జడ్పీటీసీ సభ్యుడు వెంకటరా వునాయుడు, బొబ్బిలి వైస్ ఎంపీపీ తమ్మిరెడ్డి దామోదరరావు, బలిజి పేట టీడీపీ మండల అధ్యక్షుడు సత్య నారాయణరాజు, మాజీ ఎంపీపీ శంబంగి సత్యంనాయుడు, జడ్పీటీసీ సభ్యురాలు మండలరాధ పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణి, ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిరంజీవులు

## ఉపరితల ఆవర్తనంతో రైతుల్లో ఆనందం

తెర్లాం: బంగాళఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం వల్ల నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది లేటుగా వర్షాలు కురవడం వల్ల వరినాట్లు పూర్తిస్థాయిలో జరగకపోవడం వల్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. గత వారం వరకు 40 శాతం వరినాట్లు వేస్తే రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దాదాపు 80 శాతం వరినాట్లు వేసినట్టు ప్రాథమిక అంచనా. మరో రెండు రోజులు వర్షాలు పడితే శతశాతం వరినాట్లు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు అంటున్నారు.

## రేడియో కళాకారులకు పారితోషికాల కరువు

తెర్లాం: ఆలిండియా రేడియో విశాఖపట్టణం నుంచి రంగస్థల పద్యాలు పాడిన కళాకారులకు మూడు నెలలు కావస్తున్న ఇంత వరకు పారితోషికాలు అందలేదని కళాకారులు చలమాజీ, కె.బలరామస్వామి, రామారావు ఆంధ్రజ్యోతి ఎదుట ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో రంగస్థల పద్యాలు పాడిన కళాకారులకు చెక్కులు అందించి ప్రోత్సహించిన ప్రసారభారతి, ఇప్పుడు ఆన్‌లైన్ అకౌంట్‌ల పేరుతో పారితోషికాలు చెల్లించకపోవడం దురదృష్టకరమని వారు వాపోయారు. ఇప్పటికైన అధికారులు స్పందించి పారితోషికాలు అందించాలని వారు కోరుతున్నారు.

## ప్రజల్లో మూఢనమ్మకాలను పారద్రోలండి

బొబ్బిలి: దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందుతున్నా ప్రజల్లో మాత్రం మూఢనమ్మకాలు పెరుగుతున్నాయని, వీటిని అరికట్టేందుకు విద్యావంతులు ప్రజల్లో అవగాహన కల్పించాలని జిల్లా మానవహక్కుల వేదిక కన్వీనర్ బంకురు జోగినాయుడు కోరారు. మండల కేంద్రంలో ఆయన విలేఖర్లతో మంగళవారం మాట్లాడారు. దేశంలో విభిన్న మతాలు, ఆచార సంప్రదాయాలు ఉన్నాయని, వీటి ముసుగులో మూఢనమ్మకాలు పెరుగుతున్నాయన్నారు. అందు వల్లే గుర్మీత్‌సింగ్ వంటి దొంగబాబాలు పుట్టికొస్తున్నారని తెలిపారు. పకృతిలో దాగి ఉన్న రహస్యాలను శాస్త్రవేత్తలు విభిన్న కోణాల్లో పరిశోధించి చేదించాలన్నారు.

## గ్యాస్ సమాచారం

ఈ నెల 26న బుక్ చేసుకున్న బొబ్బిలి శ్రీవెంకటేశ్వర గ్యాస్ ఏజెన్సీ పరిధిలో బొబ్బిలి రూరల్, బాడంగి, మక్కువ, తెర్లాం, సీతానగరం, రామభద్రపురం, బలిజిపేట మండలాల వినియోగదారులకు, ఈనెల 27న బుక్ చేసిన బొబ్బిలి పట్టణ వినియోగదారులకు నేడు గ్యాస్ సరఫరా చేస్తారు.

## బొబ్బిలిలో సినిమాలు

| | |
|---|---|
| సాయిగణపతి | - ఆనందో బ్రహ్మ |
| శ్రీవాసవి | - జయ జానకి నాయక |
| వెంకటకృష్ణ | - ఫిదా |
| వెంకటేష్ | - అనుక్షణం |
| శ్రీలక్ష్మి | - అర్జున్ రెడ్డి |

# మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయండి

**చీపురుపల్లి రూరల్ :** కంట్రిబ్యూటరీ పెన్షన్‌కు వ్యతిరేకంగా అమరావతిలో సెప్టెంబరు 1న నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌ను విజయవంతం చేయాలని ఆ సంఘం అధ్యక్షుడు బి.అనంతరావు కోరారు. కర్లాంలో ఆయన మంగళవారం విలేఖర్లతో మాట్లాడారు. ఇప్పటికే 70 మందికి ట్రైన్ రిజర్వేషన్ చేశామన్నారు. మహిళల కోసం విజయనగరం నుంచి రెండు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ మిలియన్ మార్చ్‌ను విజయవంత చేసేందుకు పెద్ద ఎత్తున ఉద్యోగులు తరలిరావాలని ఆయన కోరారు.

## రాయితీపై సూక్ష్మ పోషకాల పంపిణీ

**మెరకముడిదాం :** భూసార పరీక్షలు ఆధారంగా ప్రభుత్వం రైతులకు శతశాతం రాయితీపై సూక్ష్మ పోషకాలు సరఫరా చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని చీపురుపల్లి డివిజన్ ఏడీఏ వేణుగోపాల్ అన్నారు. మండలం బుధరాయివలసలో ఏవో ప్రసాదరావు అధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనంతరం రైతులకు సూక్ష్మ పోషకాలు పంపిణీ చేశారు. ఎంపీఈవోలు నిర్వహించిన ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలి బంగారినాయుడు, ఎంపీఈవోలు శ్రావణ్‌కుమార్, దుర్గారావు, కిషోర్, శ్యామల, రైతులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

**చీపురుపల్లి రూరల్ :** మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని రావివలసకు చెందిన యూత్ అసోసియేషన్ ప్రతినిధి ఇదడాసు సతీష్ అన్నారు. స్థానిక పాఠశాలలో తమ సంస్థ తరపున మొక్కలు మంగళవారం నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు భారతి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



గిడుగు చిత్రపటానికి పూల మాలలు వేస్తున్న దృశ్యం

**చీపురుపల్లి రూరల్ :** గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని మండలం పుర్రేయవలస ప్రాథమిక పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు భాషపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.ఎస్.ప్రసాద్, ఉపాధ్యాయులు కే.విశ్వేశ్వరరావు, విమల తదితరులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలు విజయవంతం చేయండి'

**మెరకముడిదాం :** అన్ని ప్రభుత్వ పాఠశాల్లో స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని మండల విద్యాశాఖాధికారి గర్భాపు సంజీవరావు పిలుపునిచ్చారు. మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులుతో ఆయన సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1నుంచి 15 వరకు అన్ని పాఠశాలల్లో స్వచ్ఛ విద్యాలయ ఉత్సవాలు నిర్వహించాలన్నారు. స్వచ్ఛ విద్యాలయాలుపై పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ సమావేశంలో యూటీఎఫ్, పీఆర్‌టీయూ నాయకులు ఎ.రాంబాబు, టీవీవీఎల్ నర్సింహులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## సాగులో మెలకువలతో అధిక లాభాలు

**గుర్ల :** సాగులో మెలకువలు పాటించడం వల్ల ఖర్చు తగ్గడంతోపాటు అధిక లాభాలు సాధించవచ్చని వ్యవసాయ సంచాలకులు ఎన్వీ వేణుగోపాలరావు అన్నారు. మండలం వల్లాపురం, దమరసింగి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఏవో అనూరాధ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. ప్రతి రైతు నూతన వ్యవసాయ పద్ధతులు నేర్చుకొంటే లాభాలు సాధించవచ్చున్నారు. అనంతరం వరి పంటలో గాలి, వెలుతురు సక్రమంగా తగిలి దుబ్బుబాగా చేస్తుందన్నారు. అనంతరం 150 మంది కౌలు రైతులకు రైతు కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరి, కూర్మారావు, సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో పెదబంటుపల్లి పాఠశాల


పెదబంటుపల్లి పాఠశాల

● కనీస సదుపాయాల లేమి ● పిచ్చిమొక్కలతో నిండిన ఆటస్థలం
● పట్టించుకోని పాలకులు, అధికారులు

**గుర్ల:** సర్కారు బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతామంటున్న నాయకులు అటుగా చర్యలు చేపట్టనప్పటికీ.. కనీస సదుపాయాలు కల్పించడంలో కూడా విఫలమవుతున్నారు. ఇందుకు నిదర్శనమే మండలం పెదబంటుపల్లి జిల్లా పరిషత్ పాఠశాల. గత కొన్నేల్లుగా ఈ పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. పాఠశాల ఆవరణం రాళ్ల, పిక్కలు తేలి పాఠశాల ఆవరణం అధ్వానంగా మారింది. దీంతో విద్యార్థులు నడవడం కూడా కష్టమవుతోంది. కొండకు ఆనుకొని పాఠశాల ఉండడంతో చుట్టూ దట్టమైన ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి భయంగొల్పుతున్నాయి. పాఠశాలకు రక్షణ గోడ లేకపోవడంతో ఎటువైపు నుంచి ఏ పాము వచ్చి తరగతి గదిలో దూరుతుందోనని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పిల్లలు ఆడుకునేందుకు ఆట స్థలం ఉనప్పటికీ రాళ్ల, రప్పలు తేలడంతో నిరుపయోగంగా మారింది. ఈ సమస్యలపై రాష్ట్ర మంత్రికి విన్నవించినప్పటికీ ఫలితం లేకుండాపోయిందని స్థానిక నాయకులు చెబుతున్నారు. ఇన్ని సమస్యల మధ్య చదువు సజావుగా ఎలా సాగుతుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.


పాఠశాలకు రక్షణ గోడలేని దృశ్యం


పిచ్చిమొక్కలతో నిండుకున్న ఆటస్థలం

# ఇలాగేనా.. మధ్యాహ్న భోజనం అందించేది!

● నిర్వాహకులపై మండిపడ్డ ఎమ్మెల్యే ● నిబంధనల మేరకు పౌష్టికాహారం

**మెరకముడిదాం:** ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికారం అందించాలనే లక్ష్యంతో మధ్యాహ్నాభోజన పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని, నిర్వాహకులు లక్ష్యం నీరుగారుస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కిమిడి మృణాళిని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మండలం గరుగుబిల్లి జడ్పీ పాఠశాలను ఆమె మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. సుమారు 25 మంది విద్యార్థులకు భోజనం చాలకపోవడంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఇలానే పౌష్టికాహారం అందించేదని నిర్వాహకులపై మండిపడ్డారు. నిబంధనల మేరకు విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించాలని వారికి సూచించారు. ఇకపై ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అనంతరం గ్రామంలో కలియతిరిగారు. ఎస్సీలకు ఇళ్లు మంజూరు చేసినప్పటికీ నేటికీ నిర్మాణాలు ప్రారంభించకపోవడంతో లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. త్వరతగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఏమైనా ఇబ్బందులుంటే తెలియజేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారం తీరుపై ఎమ్మెల్యే మృణాళిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈమె వెంట ఎంపీపీ తాడి సన్యాశినాయుడు, జడ్పీటీసీ పెందుర్తి సింహాచలం తదితరులు ఉన్నారు.


పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే


అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

## విద్యతో పాటు క్రీడల్లో రాణించండి

**గరివిడి:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఆల్‌రౌండర్లుగా ఎదగాలని ఎమ్మెల్యే కిమిడి మృణాళిని అన్నారు. మండల క్రేందంలో ఎంఈవో పి.రామారావు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆమె మాట్లాడుతూ క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం, శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆమె అన్నారు. అనంతరం క్రీడా దినోత్సవం వేడుకలను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు చేపట్టిన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. సీనియర్ క్రీడాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ బలగం కృష్ణమూర్తి, ఎంపీపీ పైల సింహాచలం, మాజీ ఎంపీపీ బలగం బలరాం, టీడీపీ నేతలు సారిపాక సురేష్‌కుమార్, కింతాడ రవికుమార్ పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే

## 'పార్టీ ప్రయోజనాలే ముఖ్యం'

**గుర్ల :** తెలుగుదేశం పార్టీ ప్రయోజనాలు దృష్టిలో పెట్టకుని ప్రతీ ఒక్క కార్యకర్త గ్రామస్థాయిలో పని చేయాలని మండల విప్ సంచాన సన్యాశినాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో బూత్ కమిటీ మెంబర్లు, వార్డు సభ్యులు చేస్తున్న అభివృద్ధి పనులపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెనుబర్తి, గుర్ల, చింతలపేట కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమాచారం

### నేడు ఫిజయోథెరఫి వైద్య శిబిరం

**మెరకముడిదాం :** స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ఫిజియోథెరఫీ వైద్య శిబిరం బుధవారం నిర్వహించనున్నట్టు మండల ఐఈఆర్‌టీ ఎం.సత్యన్నారాయణ తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభమవుతుందని, ప్రత్యేక అవసరాల పిల్లలందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

## చీపురుపల్లిలో సినిమాలు

| | |
|---|---|
| అనురాగ్ | - జయ జానకీ నాయక |
| అమోగ్ | - నేనే రాజు నేనే మంత్రి |
| వంశీ | - వీఐపీ - 2 |
| విష్ణు | - వివేకం |
| నటరాజ్ | - ప్రతి క్షణం |

## ఎగువ కొండపర్తి పాఠశాల ప్రధానోపాధ్యాయునికి మెమో

**గంట్యాడ :** తాటిపూడి ఆవల ఉన్న డేకేపర్తి పంచాయతీకి పరిధిలో గల ఎగువ కొండపర్తి పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు కె. గురువులుకు మెమో జారీ చేశామని మండల విద్యాశాఖ అధికారిణి విజయలక్ష్మీ చెప్పారు. ఈ నెల 26 తేదిన జిల్లా జడ్జి గిరిధర్ గిరిజన గ్రామాలు పర్యటించినప్పుడు ఆయా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు స్కూల్‌కు రాకుండా విద్యావాలంటీర్లను నియమించి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని గిరిజను జడ్జి దృష్టికి తీసుకుని వచ్చారు. దీనిపై స్పందించిన ఆమె ప్రధానోపాధ్యాయుడు గురువులకు మంగళవారం మెమో జారీ చేశారు. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎంఈవో తెలిపారు.



## సేంద్రియ కషాయాలపై అవగాహన



కషాయాలు తయారుచేస్తున్న దృశ్యం

**దత్తిరాజేరు:** మండలంలో మంగళవారం టి.బూర్జివలస గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సేంద్రియ కషాయాల తయారీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్ వరి పంటలో వచ్చే పచ్చ పురుగు, ఆకుముడత పురుగుల నివారణ కొర కు నీమాస్త్రం, అగ్ని అస్త్రం తయారీ విధానాన్ని విస్తరణాధికారి సాయి ప్రయోగాత్మంగా తయారుచేసి, వాడే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వినియోగంతో మానవ మానవ ఆరోగ్యం దెబ్బతింటున్న దృష్ట్యా రైతులు సేంద్రియ కషాయాలు వినియోగంతో పంట దిగుబడులతో పాటు ఆరోగ్యంగా ఉంటామని సర్పంచ్ మంత్రి అప్పలనాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో పలు వురు రైతులు పాల్గొన్నారు.

## వైసీపీదే నైతిక విజయం

● మాజీ ఎమ్మెల్యే బొత్సఅప్పలనరసయ్య

**గజపతినగరం రూరల్:** నంద్యాల ఉప ఎన్నికలో అధికార పార్టీ గెలిచినప్పటికీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీదే నైతిక విజయమని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఓటర్లను ప్రలోభపెట్టి, ఓటుకు వెయ్యినుంచి 5 వేలవరకు డబ్బులు పంచి గెలిచిందీ ఒక గెలుపేనా అని విమర్శించారు. వైసీపీ నుంచి టీడీపీలోకి వెళ్లిన 20 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేయించి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, మాజీ జడ్పీటీసీ గార తవుడు, బెల్లాన త్రినాధరావు, సర్పంచ్ మండల సురేష్, డి.దేముడు, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని పురుగుమందులను విక్రయిస్తే చర్యలు



తనిఖీలు చేస్తున్న ఏ.డి.ఎ అన్నపూర్ణ

**గజపతినగరంరూరల్:** ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేని పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయశా ఖాధికారిని ఎ.డి.ఎ.అన్నపూర్ణ హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం పట్టణంలోగల పురుగుమందుల షాపులను ఆమె తనిఖీలు నిర్వహించారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా 16102811బ్యాచ్ నెంబర్‌గల ఎక్స్‌నోవా మందులు అమ్మకాలు జరుగుతున్నాయని వాటికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవని అటువంటి వాటిని డీలర్లు అమ్మినట్లు యితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. అయితే ఎక్కడా అటు వంటి మందులను అమ్మకాలు చేపట్టడంలేదని తనిఖీల్లో వెల్లడైందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ, టి.సంగీత ఏఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## వసాది, వెలగాడ గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

**గంట్యాడ :** మండలంలోని వసాది, కొత్తవెలగాడ గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలను వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరిశీలన చేశారు. వరి కలుపు తీసుకునే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. పొలాలు గట్టుపై గడ్డి లేకుండా చూడాలని రైతులకు సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని చెప్పారు. నిత్యం తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని ఏవో గ్రేష్‌త చెప్పారు. ఈ కార్యక్రమంలో వసాదికి చెందిన గ్రామ పెద్ద కె.గణపతి ,వ్యవసాయ శాఖ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





వరి పొలాలను పరిశీలిస్తున్నదృశ్యం

# తెలుగుభాష మాధుర్యాన్ని భావితరాలకు అందిద్దాం

● ఘనంగా క్రీడా, మాతృభాషా దినోత్సవం

**గజపతినగరంరూరల్:** భావితరాలకు తెలుగు భాష మాధుర్యాన్ని అందించాలని జనవిజ్ఞాన వేదిక నాయకులు గంధ్రేటి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మాతృ భాష విశిష్ఠ తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాషా వైభవానికి విశేషంగా కృషి చేసిన గిడుగు రామ మూర్తి, గురజాడల యొక్క సాహిత్య విలువలు నేటితరానికి ఎంతో ఆదర్శమని గుర్తు చేసారు. గ్రంథాలయ సంఘ కన్వీనర్ శీర వాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి గంధ్రేటి అప్పలనాయుడు, ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, నారాయణ రావు, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జేవీవీ నాయకులు జి.లక్ష్మణరావు





చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

● క్రీడలు విద్యలో అంతర్భాగమే

**దత్తిరాజేరు:** క్రీడలు విద్యలో అంతర్భాగమేనని ప్రధానోపాధ్యాయులు భాస్కరరావు సూచించారు. మంగళవారం మరడాం జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత ప్రఖ్యాత హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్, వ్యవహారిక భాషా పితామహులు గిడుగు వెంకటరమణమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రీడలపై ఆసక్తి అభివృద్ధి అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మరుపల్లి(గజపతినగరంరూరల్):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని బాలాజీ పాలిటెక్నిక్ కళాశాల కరస్పాడెంట్ రెడ్డి పావని అన్నారు. మంగళవారం మండలంలోని మరుపల్లి గ్రామంలోగల బాలాజీ పాలిటెక్నిక్ కళాశాలలో హాకీ క్రీడాకారుడు ధ్యానచంద్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థినీ, విద్యార్థులతో క్రీడలను ఆడించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. విద్య జ్ఞానాన్ని పెంచితే క్రీడలు శారీరక ఉల్లాసాన్ని అందిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో రెడ్డి శేఖర్, పి.ఇటి అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

**బొండపల్లి:** మండలంలో దేవుపల్లి గ్రామంలో సద్గురుదేవానంద మెమోరియల్ పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెలుగుభాషా వాడుక భాషగా తీర్చిదిద్ది మనకు అందించిన గిడుగురామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగుభాషా దినోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ దూసి కృష్ణమూర్తి మాట్లాడుతూ అమ్మ లాంటి కమ్మనైన తెలుగుభాషను విద్యార్థులు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని, పాశ్చాత్య సంప్రదాయాలను విడనాడాలన్నారు. మమ్మీ,డాడి కాకుండా అమ్మా,నాన్న అని సంబోధించాలని, ఆ పిలుపుతో ఆప్యాయతను పెద్దలు మరువకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ దూసి శ్రీధర్, వైస్ ప్రిన్స్‌పాల్ పి.శ్రీనివాస రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## నంద్యాల గెలుపుపై టీడీపీ విజయోత్సవం



విజయోత్సవర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

**గజపతినగరంరూరల్:** నంద్యాల ఉప ఎన్నికలో ఓటర్లు అభివృద్ధికే పట్టం కట్టారని టీడీపీ నాయకులు ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రావిశ్రీధర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద బాణాసంచిని పేల్చి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో కూడా టీడీపీ విజయం తథ్యమని అన్నారు. కాకినాడలో వైసీపీకి డిపాజిట్ కూడా రాని పరిస్థితి నెలకొందని, త్వరలో వైసీపీ కార్యాలయాలన్నీ మూ తపడతాయని ఎద్దేవా చేశారు. ఈకార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు గంధ్రేటి అప్పలనాయుడు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ లెంక బంగారునాయుడు, సీహెచ్‌సీ ఛైర్మన్ మిత్తిరెడ్డి రమణ, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీ సీలు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలపై పర్యవేక్షణ తప్పనిసరి

**బొండపల్లి:** చిన్నారి పిల్లలను బావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు పర్యవేక్షణ చూపాలని బొండపల్లి ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు గాయత్రీదేవి అన్నారు. మంగళవారం జిల్లా స్త్రీ శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో రోళ్ళవాక గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల స్నేహపూర్వక గ్రామంగా ఎంపిక చేసి గ్రామ పాఠశాలలో పిల్లల అభివృద్ధి ఆరోగ్య పరిరక్షణ విద్యాభివృద్ధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా బాల్య వివాహాలు నిర్మూలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, కార్యదర్శులు, జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారి ఎల్ వెంకటరమణ, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## బైక్ ఢీకొని మహిళకు గాయాలు

**గజపతినగరంరూరల్:** స్థానిక ఎస్‌బిఐ బ్యాంక్ ఎదురుగా జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం మహిళను ద్విచక్రవాహనం ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. గజపతినగరం గ్రామానికి చెందిన నారాయణమ్మ ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న తన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి బైక్ వచ్చి ఆమెను ఢీకొనడంతో తీవ్రగాయాలపాలైంది. ఇది గమనించిన నూనెమిల్లు యజమాని వర్మరాజు తీవ్రంగా గాయపడిన మహిళను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన సమయంలో ఆసుపత్రి ఆవరణలో గల తలుపుకు ఉన్న అద్దాలు తగలడంతో ఆయన గాయపడ్డారు. ఇరువురికీ వైద్యులు చికిత్స చేసిన అనంతరం నారాయణమ్మను విజయనగరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## శిథిలావస్థ పాఠశాలలపై నివేదికలు అందజేయండి



మాట్లాడుతున్న ఎంఈవో విమలమ్మ

**గజపతినగరంరూరల్:** మండలంలోని పలు గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలకు సంబంధించి నివేదికలను అందజేయాలని ఎంఈవో యస్. విమలమ్మ కోరారు. మంగళవారం స్థానిక మానవ వనరుల కేంద్రంలో గ్రామ సర్పంచ్‌లు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలకు సంబంధించి నివేదికలను తయారు చేసి జిల్లా ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. మరమ్మతులకు నిధులు, లేదా నూతన భవనాల మంజూరుకు ప్రతిపాదనలు చేయడం జరుగుతుందని తెలిపారు. పాత భవనాలు వలన విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణవేణి , గ్రామ సర్పంచ్‌లు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

**భోగాపురం :** మండలంలో ఈ నెల 30నుంచి వచ్చే నెల 25 వరకు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని పశువైద్య అధికారి రామరాజు తెలిపారు. పాడి పశువులు, దుక్కి పశువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహించేందుకు మండలంలో రెండు బృందాలు పర్యటించనున్నాయన్నారు. అలాగే టీకాలు వేయించిన పశువులు, రైతుల వివరాలు ఆన్‌లైన్ చేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# సాగునీరు వృథా

- చప్టా ఎత్తు తగ్గడంతో దిగువకు పోతున్న చెరువు నీరు
- అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతులు



చప్టాపై నుంచి దిగువకు పోతున్న చెరువు నీరు

**పూసపాటిరేగ :** నీటిపారుదలశాఖ అధికారుల నిర్లక్ష్యం వల్ల చెరువుల్లో నీరు వృథాగాపోతోంది. పూర్తిస్థాయిలో వర్షాలు పడినా నీరు నిల్వ చేసుకునేలా చప్టాలు నిర్మించకపోవడంతో నీరు కిందికి వెళ్లిపోతుంది. దీంతో చరువుల ఆయకట్టు రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో ఈ ఏడాది చాలా చెరువుల కింద పంట పండడం కష్టతరమవుతుందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొప్పెర్ల పంచాయతీ పరిధిలోగల గాడిగాని చెరువు కింద 20 ఎకరాలు సాగుచేస్తున్నారు. మూడేళ్ల కిందట వచ్చిన వరదలకు ఈ చెరువు చప్టా పూర్తిగా కొట్టుకు పోయింది. నాటి నుంచి రైతులు చప్టా నిర్మించాలని రైతులు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నారు. ఎట్టకేలకు సంబంధిత అధికారులు ఈ ఏడాది చప్టా నిర్మించారు. అయితే పూర్తిస్థాయిలో ఫలితం లేకుండా పోయింది. చప్టాను చెరువు గట్టుకంటే చాలా దిగువ స్థాయికి నిర్మించారు. నీరు-చెట్టు పనుల్లో సాంకేతిక అంశాలు దృష్టిలో పెట్టుకోకుండా చెరువును లోతుగా తవ్వడం వల్ల మదుములకు నీరు అందటంలేదని, చప్టా ఉన్న ప్రాంతాన్ని కూడా లోతుగా చేయటం వల్ల ఈ సమస్య తలెత్తుతోందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ ఏడాది కూడా ఈ చెరువు దిగువన పంట పండించే పరిస్థితి కానరావడం లేదు. ఈ చప్టాను వెంటనే ఎత్తు చేసినట్లయితే కొంతమేర ప్రయోజనం చేకూరుతుందని రైతులు అభిప్రాయపతున్నారు. ప్రస్తుతం విస్తారంగా కురుస్తున్న వర్షాలకు చెరువు నిండి చప్టా పై నుంచి ప్రవహిస్తుండడంతో నీరు వృథాగా పోతోంది.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ రాజ్యలక్ష్మి

## 1 నుంచి చంద్రన్న బీమా నమోదు

**నెల్లిమర్ల :** సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి చంద్రన్న బీమా పథకం నమోదు, రెన్యువల్ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు వెలుగు ఏరియా కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం పలు గ్రామాల గ్రామైఖ్య సంఘాల అధ్యక్షురాళ్లతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్మంగా ఆమె మాట్లాడారు. గత ఏడాది చంద్రన్న బీమా పథకంలో చేరిన వారు రెన్యువల్‌చేయించుకోవచ్చనన్నారు. ఇంతవరకు ఈ పథకంలో చేరని వారు కూడా ఈసారి చేరవచ్చని ఆమె సూచించారు. ఒక్కో వ్యక్తి 15 రూపాయిల ప్రీమియం రుసుము చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామైఖ్య సంఘాల పైనే ఉందని స్పష్టంచేశారు. 18 నుంచి 69 సంవత్సరాల లోపు వారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుందన్నారు. 50 సంవత్సరాల లోపు వారు సహజ మరణం చెందితే 2 లక్షల రూపాయలు, 50 నుంచి 69 సంవత్సరాల వారు సహజ మరణం చెందితే 30 వేల రూపాయల బీమా సొమ్ముగా చెల్లిస్తారని అన్నారు. అలాగే 18 నుంచి 69 సంవత్సరాల వారు ప్రమాదంలో మరణిస్తే 5 లక్షల రూపాయలు చెల్లిస్తారని వివరించారు. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రచారం చేసి ఈ పథకంలో చేరేలా అవగాహన కల్పించాలని ఆమె సూచించారు.





ప్రత్యామ్నాయ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈవో

పులిగెడ్డపేట పాఠశాలకు వెళ్లాలంటే ఈ గెడ్డ దాటాల్సిందే..

# పాఠశాల మూసివేతపై పరిశీలన

**తమ్మయ్యపాలెం (పూసపాటిరేగ) :** తమ్మయ్యపాలెం పాఠశాల మూసివేతపై మంగళవారం ఎంఈవో ప్రకాశరావు పరిశీలించి నివేదిక తయారు చేశారు. కిలోమీటరు వ్యవధిలో తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను సమీపంలోని పాఠశాలల్లో కలిపివేయాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా ఈ పాఠశాలను సమీపంలోని రాయుడిపేట పాఠశాలలో కలిపివేశారు. దీంతో జడ్పీటీసీ ఆకిరి ప్రసాదరావుతోపాటు స్థానిక నాయకులు ఈ పాఠశాలను పునః ప్రారంభించాలని డీఈవోకు వినతిని అందించడంతో ఎంఈవో పరిశీలనకు వచ్చారు. గతంలో తప్పుడు నివేదికలతో ఈ పాఠశాలను కిలోమీటరు కంటే ఎక్కువ దూరంలో ఉన్న రాయుడిపేట పాఠశాలలో కలిపేశారు. అయితే కొంతమంది విద్యార్థులు దగ్గరలోని పులిగెడ్డపేట పాఠశాలలో చేరారు. మరికొంత మంది బడిబయట విద్యార్థులుగా ఉండిపోయారు. దీనిపై పరిశీలించిన ఎంఈవో నివేదిక తయారు చేసి డీఈవోకి అందిస్తానన్నాను.

***గెడ్డదాటల్సిందే...***

పులిగెడ్డపేట పాఠశాలకు వెళ్లే విద్యార్థులు రోజూ ఈ రెండు గ్రామాలకు అడ్డగా ఉన్న గెడ్డ దాటాల్సి వస్తోంది. దీంతో చాలా మంది విద్యార్థులు స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు. దీంతో స్నేహ స్వచ్ఛంద సంస్థ ఇక్కడ 29 మంది విద్యార్థులతో ప్రత్నామ్నాయంగా పాఠశాలను నడుపుతుంది.

## ఎంఆర్ టీకాల నిర్వహణపై పరిశీలన



పేరాపురంలో పరిశీలిస్తున్న దృశ్యం

**పూసపాటిరేగ :** మండలంలో నిర్వహిస్తున్న ఎంఆర్ టీకాలపై జిల్లా పరిశీలకుడు డి.చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. స్థానిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో స్థానిక జడ్పీ పాఠశాల, ఓక్‌లాండ్ ప్రైవేటు పాఠశాలలతోపాటు, పేరాపురం, కోనాడ గ్రామాల్లోని స్కూల్స్‌ను ఆయన సందర్శించి ఎంఆర్ వాక్సిన్ అమలు తీరును తెలుసుకున్నారు. దీనికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీ పరిధిలో 91శాతం పిల్లలకు ఈటీకాలు వేసినట్టు వైద్యాధికారి రాజేష్ వర్మ తెలిపారు. శతశాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో స్థానిక హెల్త్ ఎడ్యుకేటర్ శాంతి స్వరూప్, పేరాపురం సర్పంచ్ బొంతు ఉమ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సతివాడ పాఠశాలలో నాటికను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

## ఘనంగా తెలుగుభాషా దినోత్సవం

**సతివాడ, (నెల్లిమర్ల) :** మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు చిత్రపటాలకు, క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.రామకృష్ణారావు పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుభాష గొప్ప తనాన్ని వివరించారు. అలాగే తెలుగుభాష ఉన్నతికి గిడుగు, గురజాడలు చేసిన కృషిని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఇందుకు తెలుగు ఉపాధ్యాయులు ఈశ్వరరావు, మాధవి, రాధ, సురేఖ తదితరులు ఏర్పాట్లు చేసి విద్యార్థులకు మార్గదర్శకత్వం చేశారు.

## కాచి చల్లార్చిన నీటిని తాగండి

**నెల్లిమర్ల :** నగర పంచాయతీ ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని కమిషనర్ టి.జయరామ్ సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అన్ని బావులు, రక్షిత నీటి పథకాల్లోనూ క్లోరినేషన్ చేయించామన్నారు. నిల్వ నీటిని, నిల్వ ఉన్న వాటర్ ప్యాకెట్లను వినియోగించవద్దని సూచించారు. నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుని దోమల నివారణకు సహకరించాలని కోరారు.



బావుల్లో క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

## చినబత్తివలసలో ‘పొలం పిలుస్తోంది’

**చినబత్తివలస (పూసపాటిరేగ) :** కుమిలి పంచాయతీ చినబత్తివలస గ్రామంలో మంగళవారం స్థానిక వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మొక్కజొన్న పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ పంటను ఆశించే తెగుళ్ల, చీడపీడల నివారణకు అవసరమైన సూచనలు రైతులకు అందించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎ.శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణాధికారిణి శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

## ఘనంగా అన్నసమరాధన

**భోగాపురం :** స్థానిక ఎస్సీబీసీ కాలనీల్లో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మంగళవారం అన్నసమరాధన నిర్వహించారు. ముందుగా వినాయక ప్రతిమను దర్శించుకొని అనంతరం అన్నసమారాధనలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది.

## సినిమాలు

**నెల్లిమర్ల**

సాయిసుభద్ర : ఆనందో బ్రహ్మో

శ్రీనివాస : జయ జానికి నాయక

**పూసపాటిరేగ**

శ్రీసాయికృష్ణ : ఫిదా, నేనేరాజు నేనేమంత్రి

**భోగాపురం**

శ్రీగోపాలకృష్ణ : జయ జానికి నాయక, నేనేరాజు నేనేమంత్రి



పాడి పశువులకు చికిత్స చేయిస్తున్న గాయత్రి

## గాలికుంటు వ్యాధి నియంత్రణకు టీకాలు

**కొత్తవలస :** గాలి కుంటు వ్యాధితో పాల ఉత్పత్తి తగ్గిపోతుందని మండల పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. ఈ వ్యాధి నియంత్రణకు వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. ఈ వ్యాధి సోకిన పశువులు పునరుత్పత్తి సమస్యలతో ఇబ్బంది పడతాయని చెప్పారు. రైతులు తమ పశువులకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు.

## ఇళ్ల స్థలాలకు 3501 దరఖాస్తులు

**కొత్తవలస రూరల్ :** ఇళ్ల స్థలాలకు 3501 మంది దరఖాస్తు చేసుకున్నట్టు డీటీ జి.అప్పలనాయుడు తెలిపారు. అన్ని గ్రామాల నుంచి ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ నెల 31 వరకూ గడువు ఉందని తెలిపారు.



స్టాఫ్‌నర్స్‌కు సమ్మె నోటీసు అందిస్తున్న ఆశ కార్యకర్తలు

## ఆశ కార్యకర్తల సమ్మె నోటీసు

**శృంగవరపుకోట రూరల్ :** సీఐటీయూ నేత మద్దిల రమణ ఆధ్వర్యంలో మంగళవారం ఆశ వర్కర్ యూనియన్ కొట్టాం పీహెచ్‌సీ స్టాఫ్‌నర్స్ కె.మహాలక్ష్మికి సమ్మె నోటీసు అందించింది. కార్యక్రమంలో ఆశ నేతలు విమల, మంగ, రమణమ్మ, సామమ్మ పాల్గొన్నారు.

## 50 మందికి రుణ అర్హత కార్డులు

**కొత్తవలస రూరల్ :** కొత్తవలస మండలంలోని 50 మంది కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు చేసినట్టు డీటీ జి.అప్పలనాయుడు తెలిపారు. ఈ జాబితాను ఆరు బ్యాంకులు, వ్యవసాయాధికారి కార్యాలయాలకు పంపించామన్నారు. బ్యాంకు లింకేజీ, రుణ సదుపాయాలకు వ్యవసాయాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారన్నారు. అర్హులంతా ప్రభుత్వం రుణాలను పొందాలని సూచించారు.



గ్రాండ్ పేరెంట్స్ డేలో చిన్నారుల నృత్య ప్రదర్శన

## రవీంద్రభారతిలో గ్రాండ్ పేరెంట్స్ డే

**శృంగవరపుకోట:** ఎస్.కోటలోని రవీంద్రభారతి పాఠశాలలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలను సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శాంతిమహంతి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలు

**సింగరాయి(వేపాడ) :** సింగరాయి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు వంట పాత్రలనందజేసినట్టు ఎంపీటీసీ సభ్యురాలు నిరిజోగి ఈశ్వరమ్మ, గ్రామపెద్ద అమ్మతల్లినాయుడు తెలిపారు. కార్యక్రమంలో మూడు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సీపీఎస్ రద్దయ్యే వరకూ పోరాడతాం

**శృంగవరపుకోట :** సీపీఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసేవరకూ పోరు సాగిస్తామని ఏపీఎన్‌జీవో జిల్లా ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల మురళి, ఎస్.కోట తాలూకా యూనియన్ అధ్యక్షుడు ఎస్వీఎస్ సుధాకర్ అన్నారు. మంగళవారం వారు ఎన్జీవో హోంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. భవిష్యత్ కార్యాచరణ గూర్చి చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ సెప్టెంబరు 1న విజయవాడలో నిర్వహించే మిలియన్ మార్చ్, బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల నాయకులు వి.శ్రీనివాసరావు(బాబీ), పెనగంటి శ్రీనివాస రావు, రమణమ్మ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్జీవో నాయకులు

# ఘనంగా తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలు

## గిడుగు రామ్మూర్తి, ధ్యాన్‌చంద్‌కు నివాళి

**కొత్తవలస :** గిడుగు జయంతి సందర్భంగా కొత్తవలసలోని అమర్ కౌముది పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతుల నందచేశారు. గిడుగు జీవిత చరిత్రను చిత్రపటాల ద్వారా ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, డీన్ ఆదిమూర్తి తదితరులు పాల్గొన్నారు. కొత్తవలస జడ్పీ హైస్కూల్‌లో తెలుగుభాషా, క్రీడా దినోత్సవాలు ఎంఈవో శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం బండారు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కొత్తవలస రూరల్ :** దేవాడలోని అమరావతి పాఠశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, పద్యపఠనం, పండితుల వేషధారణ పోటీలను నిర్వహించారు. అనంతరం క్రీడా దినోత్సవంలో భాగంగా పలు రకాల పోటీలను జరిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ నాంచారయ్య బహుమతులనందజేశారు.



కొత్తవలస అమర్‌కౌముది పాఠశాలలో నిర్వహిస్తున్న గిడుగు జయంతి



సోంపురంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**వేపాడ /లక్కవరపుకోట :** సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్ఎం శంకరరావు సారథ్యంలో తెలుగు భాషా దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాఠశాల విద్యార్థుల సంప్రదాయ వస్త్రధారణ పలువురిని ఆకట్టుకుంది. తెలుగమ్మాయి, వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మురుపిండి గంగరాజు, తెలుగు ఉపాధ్యాయుడు బి.అక్కయ్య, గ్రామ పెద్ద పెదరామునాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్.కోటలోని ఆదర్శ పాఠశాల, కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

**శృంగవరపుకోట రూరల్ :** ధర్మవరం ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం హెచ్ఎం లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. అనంతరం బదిలీపై వెళ్లిపోయిన ఉపాధ్యాయులను సన్మానించారు.

భవానీనగర్ వరలక్ష్మి సీబీఎస్ఈ పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరుగు, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్, టెన్నిస్ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులనందించారు.

తొలుత ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శర్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



దేవాడలోని అమరావతి పాఠశాలలో విద్యార్థుల ఆట, పాటలు



వరలక్ష్మి సీబీఎస్ఈ పాఠశాలలో షటిల్ ఆడుతున్న విద్యార్థినీ, విద్యార్థి

# వ్యవసాయ శాఖ సూచనలు పాటించండి



సన్యాసయ్యపాలెం వ్యవసాయ క్షేత్రంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో నీలవేణి

**శృంగవరపుకోట రూరల్ :** ప్రస్తుత వర్షాలకు ఉభాలు చేస్తున్న రైతులు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలనుసరించి పంటలను వేయాలని మండల వ్యవసాయాధికారిణి చుక్క నీలవేణి కోరారు. మంగళవారం ఆమె వేములాపల్లి, సన్యాసయ్యపాలెంలోని వ్యవసాయ క్షేత్రాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఉడుపులు చేస్తున్న రైతులకు సలహాలనందించారు. కార్యక్రమంలో ఎంపీఈవో రవి, రైతులు పాల్గొన్నారు.

## 62 మందికి కళ్లద్దాల పంపిణీ

**శృంగవరపుకోట రూరల్:** వేములాపల్లి సత్యసాయి పాఠశాలలో మంగళవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. సర్పంచ్ లగుడు శ్రీనివాసరావు వీటిని రోగులకు అందజేశారు. కార్యక్రమంలో శంకర్ ఫౌండేషన్‌అసిస్టెంట్ మేనేజర్ రాజు పాల్గొన్నారు.



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

# నవ గణేష్ మండపంలో హోమం

**శృంగవరపుకోట :** ఎస్.కోటలో ఏర్పాటుచేసిన నవ గణేష్ వినాయక మండపంలో మంగళవారం వేద పండితులు హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు శోభా హైమావతి మాట్లాడుతూ ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఈ హోమం జరిపామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి వెంకన్న, జడ్పీటీసీ సభ్యురాలు రామలక్ష్మి, సర్పంచ్‌లు అంబటి లక్ష్మి, రెడ్డి భవాని, కొత్తవలస ఏఎంసీ ఉపాధ్యక్షురాలు ఇందుకూరి సావిత్రమ్మ, తెలుగు మహిళ నాయకురాలు సత్యలక్ష్మి, తెలుగుదేశం నేతలు కొండం మల్లేశ్వరరావు, వసంత లక్ష్మీ నారాయణ, వేద పండితుడు విన్నకోట భాస్కర శర్మ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న శోభా హైమావతి తదితరులు

## సినిమాలు

### శృంగవరపుకోట

శ్రీశ్రీనివాస---------------వీఐపీ-2
శ్రీవెంకటేశ్వర ---------ఆనందోబ్రహ్మ

### కొత్తవలస

శ్రీజయ-------నేనే రాజు..నేనే మంత్రి
శ్రీరాజా---------------------లై
శ్రీలక్ష్మీనరసింహ---జయజానకినాయక

### జామి

జ్యోతి----------------ఆనందోబ్రహ్మ

## రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు

● సాలూరు ఐసీడీఎస్ సీడీపీవో కామాక్షి

**సాలూరు రూరల్:** అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు సక్రమంగా లేకుంటే చర్యలు తప్పవని సాలూరు ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్ట్ సీడీపీవో హెచ్.వి. కామాక్షి హెచ్చరించారు. మంగళవారం మామిడిపల్లిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కేంద్రాలకు గ్రేడింగ్ చేస్తున్న నేపథ్యంలో పనితీరు మెరుగ్గా ఉండాలన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు సేవలను నాణ్యంగా ఉండాలన్నారు. చిన్నారులకు శిశు విద్యనందించాలన్నారు. అన్ని రికార్డులు ఎప్పటికప్పుడు తాజా పర్చుకొని ఉంచాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి టెన్నిస్ వాలీబాల్ పోటీల్లో బొడ్డవలస విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

**సాలూరు రూరల్:** రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో బొడ్డవలస సాంఘిక సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థి ప్రతిభ చూపినట్లు ప్రిన్సిపాల్ కేఎంపీ నారాయణరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. రాష్ట్రస్థాయి అండర్ 19 టెన్నిస్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు తృతీయ స్థానం లభించిందన్నారు. ఈ జట్టు విజయానికి తమ పాఠశాల విద్యార్థి ఎస్. నవీన్ కీలక పాత్ర పోషించారన్నారు. అలాగే రాష్ట్రస్థాయి అండర్ 14 టెన్నిస్ పోటీల్లో 8వ తరగతి చదువుతున్న జి. నరేంద్ర విజేతగా నిలిచాడన్నారు. విద్యార్థులను ఆయనతోపాటు వైస్ ప్రిన్సిపాల్ మూడడ్ల తిరుపతిరావు, పీడీ రాంబార్కి ఆదినారాయణ, పీఈటీ నగిరేష్ నాయుడులు అభినందించారు. ఆశ్రమ పాఠశాలల జిల్లా కో ఆర్డినేటర్ బి.చంద్రావతి ఫోన్‌ద్వారా అభినందనలు తెలిపినట్టు ప్రిన్సిపాల్ తెలిపారు.

## గతాన్ని మరిచి విమర్శలా..?

● ఎమ్మెల్యే రాజన్నదొర

**సాలూరు:** టీడీపీ నేతలు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే రాజన్నదొర అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో విలేకర్లతో మాట్లాడారు. నంద్యాలలో టీడీపీ గెలుపు బలుపు కాదు వాపన్నారు. నంద్యాలలో ఎన్నికల ప్రక్రియ చూస్తే ప్రజాస్వామ్యం ఉందా లేదా అనిపించిందన్నారు. అధికార పార్టీకి బై ఎలక్షన్స్ అధికారం, డబ్బు, సానుభూతి ఉంటుందన్నారు. ఈ మూడింటితోనే టీడీపీ గెలిచిందన్నారు. భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో వైసీపీ విజయఢంకా మోగిస్తుందన్నారు. ఈసమావేశంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

**మెంటాడ:** విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరం విజయవంత మైంది. మంగళవారం పోరాం గ్రామంలో ఏర్పాటు చే సిన వైద్య శిభిరంలో పుష్పగిరి హాస్పటల్ వైద్యురాలు ఆర్.స్నేహ రోగులను పరీక్షించారు. పలువురిని కంటి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రామభద్రపురం విశాఖ డెయిరీ బీఎం రెడ్డి వరప్రసాద్ మాట్లాడుతూ డెయిరీ పాడి రైతులకు ఆరోగ్య సేవలందించేందుకు విశాఖలో డెయిరీ సంస్థ కంటి ఆసుపత్రిని నూతనంగా ప్రానంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ డోల రామప్పడు, ఎంపీటీసీ లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## ముదిరిన వరినారుకు యాజమాన్య పద్ధతులు అవసరం

**పాచిపెంట:** ముదిరిన వరినారు ఉడిచేటప్పుడు యాజమాన్య పద్ధతులు అవసరమని స్థానిక వ్యవసాయాధికారి బి.గోవిందరావు తెలిపారు. మంగళవారం మండలంలోని శ్యామలగౌరీపురం, కూనాం బందవలస గ్రామసమీపాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా ముదిరిన వరినారు ఏ విధంగా ఉడవాల్లో రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో కె.శైలజ, ఎంపీఈవోలు మనోజ్‌కుమార్, లిఖిత, రైతులు పాల్గొన్నారు.

## 1 నుంచి తూకంపై గుడ్లు సరఫరా

● సీడీపీవో ఉమాభారతి

**పాచిపెంట:** వచ్చేనెల 1 నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు తూకంపై గుడ్లు సరఫరా చేయనున్నట్లు స్థానిక సీడీపీవో డి.ఉమాభారతి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కమిషనర్ ఆదేశాల మేరకు వారం వారం వివిధ రంగుల్లో గుడ్లు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. గ్రేడింగ్ విధానం ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని టెలీకాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ ఆదేశాలున్నాయని సీడీపీవో తెలిపారు. కేంద్రానికి సంబంధించి ఐదు అంశాలపై ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లు నిర్వహించాలన్నారు.

# తెలుగు భాషాభివృద్ధికి గిడుగు సేవలు అజరామరం

**సాలూరు:** తెలుగు భాషాభివృద్ధికి గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన సేవలు అజరామరమని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చింతల ఎల్లం నాయుడు అన్నారు. మంగళవారం పట్టణంలోని కోటవీధి వెంకటవిద్యాగిరి స్కూల్‌లో మాతృ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవహారిక భాషాభివృద్ధికి గిడుగు ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ కోడూరు సాయి శ్రీనివాస్, ఎల్లంనాయుడు మాస్టర్, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ● క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ గుర్తింపు

### మున్సిపల్ కమిషనర్ నాయుడు

**సాలూరు:** క్రీడలలో రాణిస్తే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వస్తుందని మున్సిపల్ కమిషనర్ ఎం.ఎం.నాయుడు అన్నారు. మంగళవారం జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేశ, విదేశాలలో ఖ్యాతి చాటవచ్చన్నారు. కాబట్టి విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ వలీ ఖాన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతం నుంచి ఆల్ ఇండియా స్థాయి క్రీడా పోటీలలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థులు పాల్గొనటం గర్వనీయమన్నారు. విద్యార్థులకు క్రీడాసక్తిని పెంపొంచేలా కృషి చేస్తున్న ఫిజికల్ డైరెక్టర్ గౌరీశంకర్‌ను అభినందిచారు. ఈసందర్భంగా ఆల్ఇండియా క్రీడా పోటీలలో పాల్గొన్న బి. సత్యనారాయణ, డి. సంతోషి, సాయిబాలాజీ, ఎ. శ్రావణిలను సత్కరించారు. క్రికెట్, కోకో పోటీలలోని విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విజేతలకు షీల్డ్‌లు అందిస్తున్న కమిషనర్ నాయుడు

### ● మాతృభాష గొప్పది

**సాలూరు రూరల్:** మాతృభాష గొప్పదని పురోహితునివలస మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ చిన్నా రావు అన్నారు. మంగళవారం పాఠశాలలో మాతృ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మాతృభాషలో పట్టు సాధిస్తే పరభాషల్లో పట్టు సులభంగా సాధించవచ్చు నన్నారు. మాతృభాషపై ప్రేమ కలిగి ఉండాలన్నారు. తెలుగు భాష గొప్పదనం అందరికీ తెలియజేయా లన్నారు. పరభాష వ్యామోహం సరికాదన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మంగళవారం పాఠశాలలో పీడీ రవి ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ రవి పర్యవేక్షణలో ఘనంగా క్రీడాదినోత్సవం నిర్వ హించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తి కలిగి ఉండాలన్నారు. క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి బంగారు భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సంద ర్భంగా మాతృభాష, క్రీడలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, దామోదరరావు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.


పద్యపోటీల్లో విజేతకు బహుమతి అందిస్తున్న ప్రిన్సిపాల్ చిన్నారావు

## పట్టణాభివృద్ధే ధ్యేయంగా పాలన

మున్సిపల్ చైర్‌పర్సన్ విజయకుమారి

**సాలూరు:** పట్టణాభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ గొర్లె విజయకుమారి అన్నారు. మంగళవారం పట్టణ ప్రధాన రహదారిలో లెప్రసీ ఆస్పత్రి నుంచి స్టేట్‌బ్యాంకు వరకు రూ.10లక్షలతో చేపట్టే కాలువ, పోస్టాఫీసు నుంచి యూనియన్ బ్యాంకు వరకు రూ.4లక్షలతో నిర్మిస్తున్న సీసీ పేవ్‌మెంట్ పనులకు ఆమె శంకుస్థాపన పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ జాతీయ రహదారిలో సీసీ పేవ్‌మెంట్, కాలువ నిర్మాణ పనులు జరగక దుమ్ము, ధూళి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రతిపాదనలు తయారుచేయించి నిధులు మంజూరు చేశామన్నారు. ఈకార్యక్రమంలో కమిషనర్ ఎంఎం నాయుడు, డీఈ సుధాకర్, ఏఈ జాన్సన్, కౌన్సిలర్లు డబ్బి అన్నపూర్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్‌పర్సన్ విజయకుమారి

## బురదలో కూరుకుపోయిన బస్‌లు

నాలుగు గంటల పాటు స్తంభించిన ట్రాఫిక్


కూరుకుపోయిన బస్‌లు

**మెంటాడ:** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు బర్మ్‌లు బురదమయంగా తయారయ్యాయి. మంగళవారం మెంటాడ సెల్ టవర్ వద్ద ఉద యం 6 గంటల సమయంలో రెండు బస్‌లు ఈ బురదలో కూరుకుపోయాయి. ఆంధ్ర నుంచి గజపతి నగరం వెళుతున్న బస్ ముందుగా కూరుకుపోయింది. ఆంధ్రవైపు వస్తున్న మరో బస్ పక్కపక్కనే కూరుకుపోయాయి. దీంతో ద్విచక్ర వాహనాలు సైతం అటూ ఇటూ వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. దీంతో 10 గంటల వరకు వాహనరాకపోకలు స్తంభించిపోయాయి. విద్యార్థులు, ఉద్యోగులు ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. ఆంధ్ర పోలీసులు స్పందించి ఎక్సలేటర్ ద్వారా ఒక బస్ ప్రమాదస్థలంనుంచి తప్పించి ట్రాఫిక్ పునరుద్ధరించారు.

## కూలిన ఇంటి గోడ

**శంబర (మక్కువ):** గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మక్కువ మండలం శంబరలో మంగళవారం తెల్లవారుజామున పెంకుటిల్లు గోడ కూలింది. వివరాలిలా ఉన్నాయి. రెడ్డి పోతినాయుడుకు చెందిన పెంకిటిల్లు గోడ కూలింది. అయితే ఈ ఇంటిలో ఎప్పుడు ఆయన తల్లి రాములమ్మ (80 ) రాత్రిళ్లు నిద్రించేది. సోమవారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో అక్కడ నిద్రించలేదు. గోడ కూలి ఉండడంతో ఉదయం చూసిన గ్రామస్థులు తొలుత ఆందోళన చెందారు. రాత్రి నిద్రపోలేదని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

### గ్యాస్ సమాచారం

శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ పరిధిలో ఈ నెల 23న గ్యాస్ బుక్ చేసుకున్న సాలూరు పట్టణ వినియోగదారులకు మామిడిపల్లి, పాచిపెంట వినియోగదారులకు బుధవారం గ్యాస్ సరఫరా చేస్తారు.

### సినిమాలు

సాలూరు

| | |
|---|---|
| లక్ష్మి.. | నేనే రాజు నేనే మంత్రి |
| శ్రీలక్ష్మి.. | ఆనందో బ్రహ్మ |
| శ్రీరామ .. | జయ జానకి నాయక |
| వెంకటేశ్వర.. | ఫిదా |
| సూర్యమహల్ ... | ప్రతిక్షణం |



## విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

**విజయనగరం క్రైం:** మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐ మహేశ్వరరాజు హెచ్చరించారు. మంగళవారం అంబటి సత్రం జంక్షన్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఇద్దరు ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఇక పై పట్టణంలో అన్ని ప్రధాన జంక్షన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపడతామన్నారు. వాహనచోదకులు అన్ని రకాల ధ్రువతాలు కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛమిస్తున్న గ్రామీణ వైద్యులు

## కేంద్రమంత్రి అశోక్‌ను కలిసిన గ్రామీణ వైద్యులు

**విజయనగరం టౌన్:** గ్రామీణ వైద్యులకు శిక్షణఇవ్వడంతో పాటు గుర్తింపు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధులు కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రాత్రి అశోక్ బంగ్లాలో మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయనకు వివరించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందరభ్ంగా అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు జంగం జోషి, ఐగోపి, గెద్ద చిరంజీవి, ఎ.ఎ.శర్మ, ఉమాశంకర్, అంజన్ రాయ్, విజయ్ ఉన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

● సాయి ఎముకల ఆసుపత్రి వైద్యనిపుణుడు శ్రీరామమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామమూర్తి

**రింగురోడ్డు:** పేదల కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సాయి ఎముకల ఆసుపత్రి వైద్యనిపుణుడు, డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యసాయిబాబా 92వ జయంతిని పురస్కరించుకుని 100 మంది పేదలకు శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తున్నామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇటీవల మెంటాడ మండలంలో లోతుగెడ్డ గ్రామానికి చెందిన కుమారి కిడ్నీ వ్యాధితో బాధపడుతోందని, ఆమెకు రూ.54వేలు విలువ చేసే శస్త్ర చికిత్సను సాయిట్రస్టు ద్వారా ఉచితంగా నిర్వహించామన్నారు. ఎముకలు, కీళ్లు, నరాలు, మూత్రపిండాలకు సంబంధించి ఏమైనా శస్త్రచికిత్సలు సాయి ఆసుపత్రిలో ఉచితంగా చేయడంతో పాటు మందులు కూడా అందజేస్తామని చెప్పారు. ఎయిమ్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ కడగల ఆనంద్ మాట్లాడుతూ నెల్లిమర్ల మండలంలో ఈ కార్యక్రమంపై విస్త్రతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. రోగులకు సాయి ఆసుపత్రిలో ఉచిత చికిత్సలు అందించేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో తిరుమరెడ్డి అప్పారావు, విశ్రాంత ఆర్డీవో శేఖర్‌స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రేపటిలోగా డీడీలు అందజేయండి

**విజయనగరం టౌన్:** ప్రధానమంత్రి అవాస్ యోజన కింద విజయనగరం మున్సిపాలిటీలో ఎంపికైన వారు గురువారంలోగా సంబంధిత మొత్తాన్ని కమిషనర్, విజయనగరం మున్సిపాలిటీ పేరిట డీడీలు అందజేయాలని కమిషనర్ కనకమహాలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొంతమంది అందజేశారని, మిగతా వారు నెలాఖరులోగా అందజేయాలని కోరారు.



గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్‌ఎం శేఖర్

# పాకలోనే పాఠాలు!

● గుంకలాం పాఠశాలలో గదుల కొరత ● కనీస సదుపాయాలకు నోచుకోని విద్యార్థులు ● నిధులు మంజూరైనా నిర్మాణం కాని గదులు ● పట్టించుకోని అధికారులు, పాలకులు



గుంకలాం పాఠశాలలో పాకలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

**విజయనగరం రూరల్:** జడ్పీటీసీ సభ్యుడు కుంపిలి రమణ సొంత గ్రామమైన గుంకలాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినన్ని తరగతి గదులు, మరుగుదొడ్లు లేవు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇక్కడి సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

గుంకలాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 212 మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. బాలురు 113, బాలికలు 99 మంది ఉన్నారు. నందాం, ద్వారపూడి, గుంకలాం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. పాఠశాలలో ఐదు గదులు ఉండాల్సివుండగా కేవలం మూడే ఉన్నాయి. పాకలోనూ, పాఠశాల వరండాల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.13లక్షలు మంజూరైంది. నిర్మాణ పనులు



పూర్తికాని అదనపు గదులు



బోధకుడు లేక ఖాళీగా మూలకు చేరిన కంప్యూటర్లు

మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఇక్కడ కేవలం రెండే మరుగుదొడ్లు ఉన్నాయి. వాటికి రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో వినియోగించడం లేదు. దీంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సివస్తోంది. పాఠశాలకు ప్రహరీ లేదు. విద్యార్థులు మొక్కలు నాటినా కంచె ఏర్పాటు చేసినా పశువులు మేసేస్తున్నాయి. వర్షం పడితే పాఠశాల ఆవరణలో నీరు ఉండి బురదగా మారుతోంది. మధ్యాహ్న భోజనం పథకం అమలుకు సైతం వంటగది లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే వంటలు చేయాల్సిన దుస్థితి. కట్టెలతో వంటలు చేస్తుండడంతో గదుల్లోకి పొగచూరుతోంది.

### ఉపాధ్యాయుల కొరత

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. 212 మంది విద్యార్థులకు గాను ఆరుగురే ఉన్నారు. కొన్నేళ్లుగా హిందీ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలో టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం మాత్రం బాగానే ఉంది. విద్యాబోధన మాత్రం సక్రమంగానే ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కంప్యూటర్లు ఉన్నా బోధకులను నియమించలేదు. దీంతో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు సాంకేతిక విద్యను బోధిస్తున్నారు.

### అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గదులు లేకపోవడంతో వరండాలపై, పాకలో విద్యాబోధన చేస్తున్నాం. వర్షం పడితే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈవిషయమ్మై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

**- బలివాడ శంకరరావు, ప్రధానోపాధ్యాయుడు**

## గ్రీవెన్స్‌సెల్ వినతులను పరిష్కరించండి

● మున్సిపల్ ఛైర్మన్ రామకృష్ణ

**విజయనగరం టౌన్:** మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌కు సమస్యలపై ప్రజలు ఇస్తున్న వినతులు తక్షణమే పరిష్కరించాలని ఛైర్మన్ రామకృష్ణ అధికారులకు ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో పలు సమస్యలపై పట్టణ ప్రజలిచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం ఛైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదని ఎక్కువగా వినతులు వస్తున్నాయని, విద్యుత్ విభాగ సిబ్బందిని తక్షణం దృష్టిసారించాలన్నారు. రోడ్లు, కాలువల ఏర్పాటు దశలవారీగా కొనసాగుతున్నాయని చెప్పారు. మూడేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రెండేళ్ల కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కనకమహాలక్ష్మీ మాట్లాడుతూ, గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన వినతులను ఆయా విభాగాలకు పంపించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగు అధికారులు శోభన్‌బాబు, హరిదాసు, ఇంజినీరింగు, రెవెన్యూ, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న ఛైర్మన్ రామకృష్ణ

## ఊపందుకున్న ఉభాలు

**విజయనగరం రూరల్:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు విజయనగరం మండలంలో ఉభాలు ఊపందుకున్నాయి. గుంకలాం, ద్వారపూడి, కొండకరకాం, చెల్లూరు, సారిక, గుండాలపేట, బియ్యాలపేట గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు కొన్నిచోట్ల ట్రాక్టర్లతో దమ్ము పడుతుంటే, మరికొన్ని చోట్ల ఆకును కావిడితో పొలాల్లోకి తీసుకువెళ్తూ కనిపించారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో నాట్లు ఆలస్యమయ్యాయని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ముదురునారు వేసినపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.



ఉభాలు చేస్తున్న రైతులు

## ఘనంగా గిడుగు జయంతి వేడుకలు

**రింగురోడ్డు:** పట్టణంలోని గురజాడ పాఠశాలలో గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ తెలుగు, సవర భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావులు ఒకే బడిలో చదివారని తెలిపారు. ప్రజలు అక్షరాస్యులైతే తప్ప సమాజం వృద్ధిలోకి రాదన్న గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని కొనియాడారు. వ్యవహారిక భాషను అందరికీ అందేలా చూశారని తెలిపారు. ఆయన జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక కేంద్రాలు

| | |
|---|---|
| విజయనగరం | - 08922 276101 |
| గజపతినగరం | - 08945 285277 |
| చీపురుపల్లి | - 08952 283017 |
| ఎస్.కోట | - 08966 265319 |
| కొత్తవలస | - 08966 263101 |
| సాలూరు | - 08964 242489 |
| బొబ్బిలి | - 08944 255299 |
| పార్వతీపురం | - 08963 221101 |
| బాడంగి | - 08944 258494 |
| గుమ్మలక్ష్మీపురం | - 08963 223322 |
| రాజాం | - 08942 258494 |

## సినిమా గైడ్

### విజయనగరం

| | |
|---|---|
| ఆదిత్య | : అర్జున్‌రెడ్డి |
| శ్రీకృష్ణ | : జయజానకి నాయక |
| న్యూపూర్ణ | : నేనే రాజు నేనే మంత్రి |
| రంజని | : ఫిదా |
| శివరంజని | : ఆనందో బ్రహ్మ |
| హిమగిరి | : వివేకం |
| సప్తగిరి | : వివిపీ-2 |
| లీలామహల్ | : జయజానకి నాయక |
| ఎన్‌సీఎస్ | : అర్జున్‌రెడ్డి |

### ఎన్‌సీఎస్ ఐనాక్స్

స్క్రీన్-1, స్క్రీన్-2, స్క్రీన్-3
ఆనందో బ్రహ్మ, నేనే రాజు నేనే మంత్రి, అర్జున్‌రెడ్డి, వివేకం, జయజానకి నాయక, లై, ది జంటిల్మెన్ (హిందీ)

## సమాచారం

### గ్యాస్ ఏజెన్సీ ఫోన్ నంబర్లు

| | |
|---|---|
| సాయి ఏజెన్సీ | : 08922-234523 |
| ఎన్‌సీఎస్‌ఏజెన్సీ | : 08922- 224177, 233578 |
| ఎన్‌వీఆర్ ఏజెన్సీ | : 08922-225810 |
| శ్రీనివాసా ఏజెన్సీ | : 08922-224301, 285288 |

### ఆర్టీసీ సమాచారం

| | |
|---|---|
| విచారణ కేంద్రం | 08922 225333 |
| ఫిర్యాదుల విభాగం | 7382923726 |
| అడ్వాన్స్ బుకింగ్ | 08922 234911 |
| టోల్‌ఫ్రీ నంబరు | 1800 200 4599 |

### ఎమర్జన్సీ సర్వీసెస్

| | |
|---|---|
| పోలీస్ | 100 |
| ఫైర్ | 101 |
| ఆపద సమయాల్లో | 108 |
| బాలల సంరక్షణ కోసం | 1098 |
| కేంద్రాసుపత్రి అంబులెన్స్ | 08922 272124 |
| ఘోషాసుపత్రి అంబులెన్స్ | 8008553401 |

## రైతుబజారు ధరలు

| కూరగాయలు | కిలో (రూ) |
|---|---|
| టమోటా (దేశవాళీ) | 44-00 |
| టమోటా(హైబ్రిడ్) | 42-00 |
| వంకాయలు | 27-00 |
| బీరకాయలు | 22-00 |
| బెండకాయలు | 24-00 |
| కాకర కాయలు | 22-00 |
| క్యాబేజీ | 18-00 |
| గోరు చిక్కుడు | 22-00 |
| దొండకాయలు | 30-00 |
| క్యారెట్ | 34-00 |
| బీట్‌రూట్ | 25-00 |
| ఉల్లిపాయలు | 23-00 |
| బంగాళదుంపలు | 10-00 |
| అల్లం | 58-00 |
| పచ్చిమిర్చి | 45-00 |
| క్యాప్సికమ్ | 50-00 |
| కీర దోస | 20-00 |

### బంగారం ధరలు

| | |
|---|---|
| 24క్యారెట్లు (10 గ్రాములు) | 29,720-00 |
| 22 క్యారెట్లు | 27,780-00 |
| వెండి కిలో | 40,000-00 |

## రామనారాయణంలో ప్రత్యేక పూజలు

**దాసన్నపేట:** రామనారాయణంలో మంగళవారం ఉదయం నాగదేవతకు పంచామృతాభిషేకాలు గావించారు. దేవాలయం ప్రధాన అర్చకులు నాగవర్ధన్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు అభిషేకం చేశారు. అనంతరం అభయాంజనేయునికి అభిషేకంతో పాటు సింధూరం తమలపాకులతో అర్చన గావించారు. ఈ పూజలలో ట్రస్టు సభ్యులు నారామణం శ్రీనివాస్ నీరజవల్లి దంపతులు పాల్గొన్నారు.

# రోటరీ సేవలు అభినందనీయం

- జడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి
- యూత్ ఫెస్టివల్ ప్రారంభం



యూత్ ఫెస్టివల్‌లో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ స్వాతీరాణి

**విజయనగరం రూరల్:** సమాజసేవలో రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు అభినందనీయమని జడ్పీ చైర్‌పర్సన్ శోభా స్వాతీరాణి అన్నారు. మంగళవారం స్థానిక రోటరీ సమావేశ మందిరంలో క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించే యూత్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహిస్తే మరింతగా రాణిస్తారన్నారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు యువతను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని తెలిపారు. దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు. యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. నేటి యువత తమ లక్ష్యాలను సాధించేందుకు ఎన్నో అత్యుత్తమైన అవకాశాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సన్మార్గంలో నడిచి పలువురికి ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పలు పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు డాక్టర్ డి.వి.శ్రీకాంత్, కార్యదర్శి కొండపల్లి శ్రీనువాస్,విమల్ కిషోర్‌రాఠీ, అనిల్‌కుమార్, నిర్మల్‌కుమార్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ పద్మ, క్లబ్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించండి

- ఎమ్మెల్యే మీసాల గీత

**విజయనగరం రూరల్:**విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఎమ్మెల్యే మీసాల గీత అన్నారు. భాష్యం పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయన్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని తెలిపారు. క్రీడల్లో సత్తాచాటిన వారి జీవిత చరిత్రను ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సంయుక్త కలెక్టర్ నాగేశ్వరరావు మాటాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని కోరారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గత మూడు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, బాక్సింగ్, కబడ్డీ, హాకీ, తైక్వాండో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశా రు. కార్యక్రమంలో డీఎస్‌డీవో సూర్యారావు, సెట్విజ్ సీఈవో సత్యనారాయణ, ఒలింపిక్స్ క్రీడాసంఘ ప్రతినిధులు, భాష్యం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాల్గొన్నారు.


రిటైర్డు అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

### కస్పా పాఠశాలలో...

**దాసన్నపేట:** విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ అన్నారు. మంగళవారం కస్పా హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పాల్గొని గొర్తి ఈశ్వరట్రస్ట్ ప్రతిభా పురస్కారాలతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డు అధికారులు సుబ్బారావు, రాజు, చిన్నంనాయుడు, ట్రస్టు కోఆర్డినేటర్ బి.అప్పలనాయుడు, వై.అప్పలనాయుడు, కస్పా హైస్కూల్ తెలుగు అధ్యాపకులు జనార్ధనరావు పట్నాయక్ పాల్గొన్నారు.

## 'హక్కులు కాలరాయొద్దు'

**విజయనగరం రూరల్:** బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డీసీపీయూ జిల్లా సభ్యుడు చిట్టిబాబు అన్నారు. వారి హక్కులు కాలరాస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. మంగళవారం రోళ్లవాక గ్రామంలో సర్పంచ్ శ్రీనివాసరావు అధ్యక్షతన పాఠశాల ఆవరణలో బాలల హక్కులపై సదస్సు నిర్వహించారు. బాలలను పనిలో పెట్టుకోకూడదని తెలిపారు. బాలలకు బడికి పంపించాలని తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం బాలల సంరక్షణ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీపీయూ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఘనంగా సినీనటుడు నాగార్జున జన్మదిన వేడుకలు

**విజయనగరం టౌన్:** సినీ నటుడు అక్కినేని నాగార్జున పుట్టిన రోజును పురస్కరించుకుని అక్కినేని ఫ్యామిలీ ఫాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పేర్ల వారు వీధిలో వున్న చెవిటి, మూగ పాఠశాల విద్యార్థుల సమక్షంలో అభిమానులు కేక్‌ను కట్ చేశారు. అనంతరం చెవిటి, మూగ, అంధ విద్యార్థులకు అవసరమైన క్రీడా పరికరాలను ఆ స్కూల్‌కు అందించారు. ఈకార్యక్రమంలో అభిమాన సంఘం ప్రతినిధులు దుర్గాప్రసాద్, పి వాసు, నగేష్, కృష్ణ, అంజి, ఈశ్వర్, నాగరాజు, డి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ విధానాన్ని రద్దు చేయండి

**విజయనగరం టౌన్:** కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ని తక్షణమే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎ.సదాశివరావు చెప్పారు. మంగళవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీపీఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానం రద్దు చేయాలన్నారు.. సీపీఎస్‌ని రద్దు చేయాలని కోరుతూ విజయవాడలో జరగనున్న మిలియన్ మార్చ్‌లో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన పిలుపు నిచ్చారు.


ఉత్సవ కమిటీకి లడ్డూ అందజేస్తున్న రెడ్‌ఎఫ్‌ఎం నిర్వాహకులు

## నవగణేషునికి 25కేజీల లడ్డూ అందజేత

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట ఆకులడిపో వద్ద నవగణేషునికి విశాఖపట్నానికి చెందిన 93.5 రెడ్‌ఎఫ్‌ఎం ప్రతినిధులు 25కేజీల లడ్డూను అందజేశారు. మంగళవారం నవగణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకురాలు, తెలుగుమహిళా రాష్ట్ర అధ్యక్షురాలు శోభా హైమావతి, గుల్లిపల్లి గణేష్, ఎంపీపీ రెడ్డి వెంకన్న, రాష్ట్ర డీలర్ల సంఘం అధ్యక్షుడు బుగత వెంకటేశ్వరరావు, వివేకానంద విద్యాసంస్థల అధినేత సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్‌లకు రెడ్‌ఎఫ్‌ఎం నిర్వాహకులు ఆర్.జె.రోహిత్, ఆర్.జె.షామీలలు ఈ లడ్డూ అందజేశారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొణదం మల్లేశ్వరరావు, ఎస్.కోట సర్పంచ్ అంబటి లక్ష్మి, తలారీ సర్పంచ్ రెడ్డి భవానీ, కొత్తవలస మార్కెటింగ్‌శాఖ ఉపాధ్యక్షురాలు ఇందుకూరి సావిత్రమ్మ, బుగత సత్యలక్ష్మి, జనపురెడ్డి ఈశ్వరరావు, వేములాపల్లి సర్పంచ్ లగుడు శ్రీనువాసరావులు పాల్గొన్నారు.

## అలరించిన భక్తి గీతాలాపన

**దాసన్నపేట:**రామనారాయణంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన భక్తిగీతాంజలి కార్యక్రమం అలరించింది. వినాయకనవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆర్ సంగీత్‌కుమార్ బృందం చక్కడి భక్తిగీతాలను ఆలపించింది. ఓం గణనాయకాయ, ఏ రీతినీకీర్తి, మహాగణపతిం, వాతాపి గణపతిం, మురళీధరుని, మంగాబుది, హనుమంత, వినరోభాగ్యము ఫంటి కీర్తనలు భక్తులకు పారవశ్యం కలిగించాయి,

## తైక్వాండో పోటీల్లో ఫోర్టుసిటీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

**విజయనగరం టౌన్:**పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో మంగళవారం జరిగిన తైక్వాండో పోటీల్లో ఫోర్టుసిటీ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇందులో విజయం సాధించిన వారు వచ్చే నెలలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. సత్తా చాటిన వారిలో జె.రిషిత, కె.చైతన్య, ఐ.సాయివర్మ, మనోజ్‌లు ఉన్నారు. వీరిని మంగళవారం సాయంత్రం స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో చైర్మన్ కెపీపీ శివ, ప్రిన్సిపాల్ రవి కె మండా, స్కూల్ డైరక్టర్లు చంటిరాజు, మధు, నీలిమ, అశోక్ తదితరులు అభినందించారు.

## 'అర్హుల జాబితాను వెల్లడించండి'

**దాసన్నపేట:**అందరికీ ఇళ్లు పథకంలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను వెంటనే వెల్లడించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ చైర్మన్ ప్రసాదుల రామకృష్ణ, కనకమహాలక్ష్మిలను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో కేంద్రప్రభుత్వం అమృత పథకం కింద కోట్లాది రూపాయలు విడుదల చేసినప్పటికీ పనుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతుందన్నారు. పనుల్లో నాణ్యత కొరవడుతుందని తెలిపారు. రింగురోడ్డు పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ పనుల్లో ఎటువంటి పురోగతి కనబడడం లేదన్నారు. యువమోర్చా ప్రధాన కార్యదర్శి మజ్జి రమేష్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ పథకాలు అర్హులైన పేదవారికి చేరే విధంగా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు. చైర్మన్‌ను కలిసి వారిలో పి.అశోక్, కుసుమంచి సుబ్బారావు, లక్ష్మినరసింహం సత్తి అచ్చిరెడ్డి, మునిరామకృష్ణ, ఎన్ని కృష్ణ, కర్రి గోపాలరెడ్డి, కార్తీక్, కూర్మారావు, పాకా ప్రమీళా రాణి, సుభద్రాదేవి, గండికోట శాంతి, పి.సంతోష్, ఐ.శ్రీనివాసరావు, షకీల్, చిన్ని పాల్గొన్నారు.

## ఏపీ మోడల్ స్కూల్‌లో అష్టావధానం

**విజయనగరం టౌన్:** తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని పూల్‌బాగ్ రోడ్డు అయ్యప్పనగర్‌లో వున్న మోడల్ స్కూల్‌లో అష్టావధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం కట్టమూరి చంద్రశేఖర శర్మ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా ఉప విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి, ఎం.జ్యోతికుమారి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అప్పాజీరావు, వైఎస్ ప్రిన్సిపాల్ ఎస్తేరు రాణి, విద్యార్థులు, విద్యార్థినీలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## విస్తృతంగా డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు

**విజయనగరం క్రైం:** మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ మహేశ్వరరాజు హెచ్చరించారు. మంగళవారం అంబటి సత్రం జంక్షన్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. ఇద్దరు ఆటో డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇక పై పట్టణంలో అన్ని ప్రధాన జంక్షన్‌లో విస్తృతంగా తనిఖీలు చేపడతామన్నారు. వాహనచోదకులు అన్ని రకాల ధ్రువతాలు కలిగివుండాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛమిస్తున్న గ్రామీణ వైద్యులు

## కేంద్రమంత్రి అశోక్‌ను కలిసిన గ్రామీణ వైద్యులు

**విజయనగరం టౌన్:**గ్రామీణ వైద్యులకు శిక్షణఇవ్వడంతో పాటు గుర్తింపు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల గ్రామీణ వైద్యుల సంఘ ప్రతినిధులు కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం రాత్రి అశోక్ బంగ్లాలో మంత్రిని కలిసి రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయనకు వివరించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందరభ్ంగా అశోక్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ ప్రతినిధులు జంగం జోషి, ఐగోపి, గెద్ద చిరంజీవి, ఎ.ఎ.శర్మ, ఉమాశంకర్, అంజన్ రాయ్, విజయ్ ఉన్నారు.

## వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

● సాయి ఎముకల ఆసుపత్రి వైద్యనిపుణుడు శ్రీరామమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీరామమూర్తి

**రింగురోడ్డు:**పేదల కోసం ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని సాయి ఎముకల ఆసుపత్రి వైద్యనిపుణుడు, డాక్టర్ ఎ.శ్రీరామమూర్తి అన్నారు. మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యసాయిబాబా 92వ జయంతిని పురస్కరించుకుని 100 మంది పేదలకు శస్త్రచికిత్సలు ఉచితంగా చేస్తున్నామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇటీవల మెంటాడ మండలంలో లోతుగెడ్డ గ్రామానికి చెందిన కుమారి కిడ్నీ వ్యాధితో బాధపడుతోందని, ఆమెకు రూ.54వేలు విలువ చేసే శస్త్ర చికిత్సను సాయిట్రస్టు ద్వారా ఉచితంగా నిర్వహించామన్నారు. ఎముకలు, కీళ్లు, నరాలు, మూత్రపిండాలకు సంబంధించి ఏమైనా శస్త్రచికిత్సలు సాయి ఆసుపత్రిలో ఉచితంగా చేయడంతో పాటు మందులు కూడా అందజేస్తామని చెప్పారు. ఎయిమ్ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ కడగల ఆనంద్ మాట్లాడుతూ నెల్లిమర్ల మండలంలో ఈ కార్యక్రమంపై విస్త్రతంగా ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు. రోగులకు సాయి ఆసుపత్రిలో ఉచిత చికిత్సలు అందించేలా కృషి చేస్తామన్నారు. సమావేశంలో తిరుమరెడ్డి అప్పారావు, విశ్రాంత ఆర్డీవో శేఖర్‌స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రేపటిలోగా డీడీలు అందజేయండి

**విజయనగరం టౌన్:** ప్రధానమంత్రి అవాస్ యోజన కింద విజయనగరం మున్సిపాలిటీలో ఎంపికైన వారు గురువారంలోగా సంబంధిత మొత్తాన్ని కమిషనర్, విజయనగరం మున్సిపాలిటీ పేరిట డీడీలు అందజేయాలని కమిషనర్ కనకమహాలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కొంతమంది అందజేశారని, మిగతా వారు నెలాఖరులోగా అందజేయాలని కోరారు.



గుంకలాం పాఠశాలలో పాకలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

# పాకలోనే పాఠాలు!

● గుంకలాం పాఠశాలలో గదుల కొరత ● కనీస సదుపాయాలకు నోచుకోని విద్యార్థులు ● నిధులు మంజూరైనా నిర్మాణం కాని గదులు ● పట్టించుకోని అధికారులు, పాలకులు

**విజయనగరం రూరల్:**జడ్పీటీసీ సభ్యుడు కుంపిలి రమణ సొంత గ్రామమైన గుంకలాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సంఖ్యకు తగినన్ని తరగతి గదులు, మరుగుదొడ్లు లేవు. ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఇక్కడి సమస్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

గుంకలాం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 212 మంది విద్యార్థులు ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. బాలురు 113, బాలికలు 99 మంది ఉన్నారు. నందాం, ద్వారపూడి, గుంకలాం తదితర గ్రామాల నుంచి విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. పాఠశాలలో ఐదు గదులు ఉండాల్సివుండగా కేవలం మూడే ఉన్నాయి. పాకలోనూ, పాఠశాల వరండాల్లోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. అదనపు తరగతి గదుల నిర్మాణానికి సర్వశిక్ష అభియాన్ నిధులు రూ.13లక్షలు మంజూరైంది. నిర్మాణ పనులు



బోధకుడు లేక ఖాళీగా మూలకు చేరిన కంప్యూటర్లు

మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. ఇక్కడ కేవలం రెండే మరుగుదొడ్లు ఉన్నాయి. వాటికి రన్నింగ్ వాటర్ సదుపాయం లేకపోవడంతో వినియోగించడం లేదు. దీంతో విద్యార్థులు ఆరుబయటకు వెళ్లాల్సివస్తోంది. పాఠశాలకు ప్రహరీ లేదు. విద్యార్థులు మొక్కలు నాటినా కంచె ఏర్పాటు చేసినా పశువులు మేసేస్తున్నాయి. వర్షం పడితే పాఠశాల ఆవరణలో నీరు ఉండి బురదగా మారుతోంది. మధ్యాహ్న భోజనం పథకం అమలుకు సైతం వంటగది లేకపోవడంతో పాఠశాల ఆవరణలోనే వంటలు చేయాల్సిన దుస్థితి. కట్టెలతో వంటలు చేస్తుండడంతో గదుల్లోకి పొగచూరుతోంది.



పూర్తికాని అదనపు గదులు

### ఉపాధ్యాయుల కొరత

పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంది. 212 మంది విద్యార్థులకు గాను ఆరుగురే ఉన్నారు. కొన్నేళ్లుగా హిందీ, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పాఠశాలలో టెన్త్‌లో ఉత్తీర్ణత శాతం మాత్రం బాగానే ఉంది. విద్యాబోధన మాత్రం సక్రమంగానే ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. కంప్యూటర్లు ఉన్నా బోధకులను నియమించలేదు. దీంతో కొందరు ఉపాధ్యాయులు విద్యార్థులకు సాంకేతిక విద్యను బోధిస్తున్నారు.

### అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం



పాఠశాలలో మౌలిక వసతులు లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గదులు లేకపోవడంతో వరండాలపై, పాకలో విద్యాబోధన చేస్తున్నాం. వర్షం పడితే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈవిషయమై అధికారుల దృష్టికి తీసుకువెళ్లాం.

**- బలివాడ శంకరరావు,**
**ప్రధానోపాధ్యాయుడు**

## గ్రీవెన్స్‌సెల్ వినతులను పరిష్కరించండి

● మున్సిపల్ చైర్మన్ రామకృష్ణ

**విజయనగరం టౌన్:** మున్సిపాలిటీలో నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌సెల్‌కు సమస్యలపై ప్రజలు ఇస్తున్న వినతులు తక్షణమే పరిష్కరించాలని చైర్మన్ రామకృష్ణ అధికారులకు ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో పలు సమస్యలపై పట్టణ ప్రజలిచ్చిన వినతులను ఆయన స్వీకరించారు. అనంతరం చైర్మన్ రామకృష్ణ మాట్లాడుతూ పట్టణంలో పలు ప్రాంతాల్లో ఎల్ఈడీ దీపాలు వెలగడం లేదని ఎక్కువగా వినతులు వస్తున్నాయని, విద్యుత్ విభాగ సిబ్బందిని తక్షణం దృష్టిసారించాలన్నారు. రోడ్లు, కాలువల ఏర్పాటు దశలవారీగా కొనసాగుతున్నాయని చెప్పారు. మూడేళ్ల కాలంలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామని, రానున్న రెండేళ్ల కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కనకమహాలక్ష్మీ మాట్లాడుతూ, గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన వినతులను ఆయా విభాగాలకు పంపించి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టౌన్ ప్లానింగు అధికారులు శోభన్‌బాబు, హరిదాసు, ఇంజినీరింగు, రెవెన్యూ, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న చైర్మన్ రామకృష్ణ

## ఊపందుకున్న ఉభాలు

**విజయనగరం రూరల్:** ఇటీవల కురుస్తున్న వర్షాలకు విజయనగరం మండలంలో ఉభాలు ఊపందుకున్నాయి. గుంకలాం, ద్వారపూడి, కొండకరకాం, చెల్లూరు, సారిక, గుండాలపేట, బియ్యాలపేట గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. రైతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు కొన్నిచోట్ల ట్రాక్టర్లతో దమ్ము పడుతుంటే, మరికొన్ని చోట్ల ఆకును కావిడితో పొలాల్లోకి తీసుకువెళ్తా కనిపించారు. వర్షాలు సకాలంలో పడకపోవడంతో నాట్లు ఆలస్యమయ్యాయని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ముదురునారు వేసినపుడు జాగ్రత్తలు పాటించాలన్నారు.



ఉభాలు చేస్తున్న రైతులు

## ఘనంగా గిడుగు జయంతి వేడుకలు

**రింగురోడ్డు:** పట్టణంలోని గురజాడ పాఠశాలలో గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. తొలుత గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ తెలుగు, సవర భాషాభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావులు ఒకే బడిలో చదివారని తెలిపారు. ప్రజలు అక్షరాస్యులైతే తప్ప సమాజం వృద్ధిలోకి రాదన్న గొప్ప వ్యక్తి గిడుగు రామ్మూర్తి పంతులని కొనియాడారు. వ్యవహారిక భాషను అందరికీ అందేలా చూశారని తెలిపారు. ఆయన జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గిడుగు చిత్రపటానికి పూలమాల వేస్తున్న హెచ్ఎం శేఖర్